

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



అయోధ్య తీర్పు విస్మరణ – కొత్త వివాదాలు!
ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు
బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అధికారంపైనే మమకారం
లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 173 | మంగళవారం | 10-12-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## బహుజనుల అమ్మరూపమే

# తెలంగాణ తల్లి

**సచివాలయ ప్రాంగణంలో 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సిఎం**

తెలంగాణ తల్లి విగ్రహానికి అధికారిక ముద్ర 08

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్లు అవహేళనకు, పదేళ్లపాటు తెలంగాణ తల్లి వివక్షకు గురైందని, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన డిసెంబర్ 9వ తేదీ చరిత్రలో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అవమానాలు ఎదుర్కొన్నామని, తెలంగాణలో పదేళ్లు నిర్లక్ష్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి అవమానాలు, నిర్లక్ష్యాలు ఉండకూడదని ప్రతీ ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని సిఎం ప్రకటించారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయిన కవులను, రచయితలను గుర్తించాలని, గౌరవించాలని, ఆదుకోవాలని నిర్ణయించామన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల 'తెలంగాణ తల్లి' కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, తరువాయి 12లో

> **తె**లంగాణ కోసం సర్వం కోల్పోయిన కవులను, రచయితలను గుర్తించాలని, గౌరవించాలని, ఆదుకోవాలని ఆలోచించాం. గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిరావులను ప్రభుత్వం గుర్తిస్తోంది. వారికి 300 గజాల ఇంటి స్థలంతో కోటి రూపాయల నగదును, తామ్ర పత్రాన్ని అందిస్తాం. కార్యక్రమానికి విచ్చేసిన అందరినీ చూస్తోంటే కృష్ణా, గోదావరి నదులు ఇక్కడ ప్రవహిస్తున్నట్లు ఉంది. చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయే ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

## రైతు ఉద్యమానికి సిపిఐ సంపూర్ణ సంఘీభావం

బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపు

**న్యూఢిల్లీ :** కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ కల్పించాలని డిమాండ్ చేస్తూ కొనసాగిస్తున్న రైతుల పోరాటానికి సిపిఐ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. ఇది ప్రాథమిక హక్కుల నుంచి వేళ్ళూనుకున్న న్యాయబద్ధమైన డిమాండ్ అని, రైతులు ఉత్పత్తులకు సరైన ధర కల్పించాలని, కార్పొరేట్ దోపిడీ నుంచి రక్షించాలని కోరింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. వ్యవసాయ వర్గాల న్యాయమైన ఆందోళనను బిజెపి ప్రభుత్వం పరిష్కరించకుండా, వ్యవసాయ సంక్షోభం పట్ల నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తుందని సిపిఐ విమర్శించింది. ఫలితంగా గ్రామీణ భారతంలో ఆత్మహత్యలు, అప్పులు, పేదరికం మరింత పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవసాయ రంగ తరువాయి 2లో



ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్‌కు సోమవారం నాడు వచ్చిన సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కారాట్‌లతో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా. ఈ సందర్భంగా వారు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించి వామపక్షాల మధ్య ఐక్యత మరింత అవసరమని ఉద్ఘాటించారు.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే

## చరిత్ర క్షమించదు

డిసెంబర్ 9న పర్వదినోత్సవంగా జరపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
'సెప్టెంబర్ 17'ను బేషజాలకు పోకుండా అధికారికంగా నిర్వహించాలి
సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే చరిత్ర క్షమించబోదని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండడమే తల్లి రూపమని, తెలంగాణ తల్లి చేతిని చూస్తే ఆశీస్సులు ఇస్తున్నట్టుగా ఉన్నదన్నారు. డిసెంబర్ 9న పర్వదినోత్సవంగా జరపాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఆనాటి పోరాటం ఫలితంగా విజయం సాధించిన నాటి 'సెప్టెంబర్ 17'ను ఎటువంటి బేషజాలు, బింకాలకు పోకుండా, మానసిక అడ్డంకులను వదిలి అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'తెలంగాణ తల్లి' విగ్రహ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనపై సోమవారం జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ తమ మనసులో అనుకున్నట్లు అన్నీ ఉండబోవని, ప్రస్తుతం ఉన్నది బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాదని, టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గామార్చుకోవచ్చని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా? అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన విషయంలో నాటి ప్రతిపక్ష పార్టీలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహ్వానించిందా ? అని కూనంనేని ప్రశ్నించారు. విధి విధానాలు ఎలా ఉండాలని, ఆవిష్కరణలో ఉండాల్సిన పలు అంశాలపై ఎవ్వరితో గత ప్రభుత్వం చర్చించలేదని, తమను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహ్వానించలేదని, కనీసం గౌరవించలేదని అన్నారు. విశాలాంధ్ర కోసం అనేక త్యాగాలు చేసిన సిపిఐ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడిందని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా గతంలో సిపిఐ జాతీయ సమితి నిర్ణయం తీసుకున్న తరువాయి 2లో

### తెలంగాణ తల్లి విగ్రహం మాత్రమే కాదు..

## మన జాతి ఆత్మగౌరవ ప్రతీక

- నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగం
- డిసెంబర్ 9 అధికారికంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగుతున్న పాలన
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ తల్లి అంటే ఒక భావన మాత్రమే కాదని, నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగమని, ఆ భావోద్వేగానికి నిండైన రూపం మన తెలంగాణ తల్లి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి కేవలం విగ్రహం మాత్రమే కాదని, మన జాతి ఆత్మగౌరవ ప్రతీక అని, మన అస్థిత్వ పతాకమని, జీవన గమనాన్ని నిర్దేశించే ఒక దీపిక, మన భవిష్యత్ కర్తవ్యాన్ని నిరంతరం గుర్తు చేసే విధాత అని అన్నారు. ఒక వ్యక్తి, ఒక పార్టీ ఆలోచనే తెలంగాణ సమాజం ఆలోచన అనుకోవడం తప్పు అని, మధ్యయుగాల చక్రవర్తుల పాలన ప్రస్తుతం నడవబోదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రతి ఏటా 'డిసెంబర్ 9'న 'తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం'గా అధికారికంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. తెలంగాణ కీర్తిని విశ్వ వేదికపై వైభవోపేతంగా చాటిచెప్పేలా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామన్నారు. "తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన'పైన సిఎం రేవంత్ రెడ్డి శాసనసభ సమావేశంలో సోమవారం ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఈ శాసనసభ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున సోనియాగాంధీకి సిఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో మన సాంప్రదాయాలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒక నిండైన రూపాన్ని తీర్చిదిద్దామన్నారు. మన సంస్కృతికి అద్దంపడుతూ "ప్రశాంత వదనంతో, సాంప్రదాయ కట్టు బొట్టు,మెడకు కంతే, గుండు పూసల హారంతో, చెవులకు బుట్ట కమ్మలు, తరువాయి 2లో



> **పు**ట్టుక నీది. చావు నీది. బతుకంతా దేశానిది.. అన్న కాళోజీ మాటల స్ఫూర్తితో స్వరాష్ట్ర ఉద్యమంలో లక్షలాది మంది యువత ఉద్యమ జ్వాలలై వెలిగారు. తమ గుండెలపై తెలంగాణ సంక్షిప్త నామాన్ని టిజిగా పచ్చబొట్లు వేయించుకున్నారు. వారి ఆకాంక్షలను నెరవేర్చేలా తెలంగాణ సంక్షిప్త నామాన్ని టిఎస్ నుంచి టిజిగా మార్చాం. ఉద్యమ సమయం నుండి తెలంగాణ ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని, అస్థిత్వాన్ని, జాతి జనుల కీర్తిని నలుదిశలా వ్యాప్తి చేసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించుకున్నాం. గీత రచయిత అందెశ్రీని ప్రభుత్వం గౌరవించుకుంది.

## గ్రూపు-2 పరీక్షలు వాయిదా వేయలేం

### హైకోర్టు తీర్పు

**హైదరాబాద్:** టిజిపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయినందున వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. డిసెంబర్ 16న రైల్వే పరీక్ష ఉందని, ఒకే రోజు గ్రూప్–2, రైల్వే పరీక్షలు ఉన్నందున పరీక్షను వేరే తేదీకి మార్చాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, గ్రూప్–2 వాయిదా వేయడం వల్ల లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని టిజిపిఎస్‌సి న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులంతా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లు కొట్టివేసింది.

### ఉపరాష్ట్రపతి పదవి నుంచి

## ధన్‌ఖడ్‌ను తొలగించాలి

రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఇండియా కూటమి సిద్ధం!

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను ఆ పదవిని తొలగించాలని కోరుతూ అతి త్వరలో రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష ఇండియా కూటమి పక్షాలు భావిస్తున్నాయి. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు, విపక్షాల మధ్య సంబంధాలు చెడిపోయిన నేపథ్యంలో ఈ చర్యకు ఉపక్రమిస్తున్నాయి. ఆగస్టులోనే ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన సంతకాలు ఉన్నాయని, అయినప్పటికీ ఒక అవకాశం ఇవ్వాలని భావించామని ఇండియా బ్లాక్ సభ్యులు తెలిపారు. అయితే సోమవారం ఆయన రాజ్యసభలో వ్యవహరించిన తీరుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై కాంగ్రెస్ చొరవ చూపగా, టిఎంసి, సమాజ్‌వాదీ



పార్టీతో పాటు ఇతర ఇండియా కూటమి పక్షాలు కూడా మద్దతు ప్రకటించనట్లు సమాచారం. సోమవారం రాజ్యసభ ప్రారంభమవగానే బిజెపి సభ్యుల నిరసనతో జీరో అవర్‌లో సభ తొలిసారి వాయిదా పడంది. అనంతర సభ ప్రారంభమవగానే అధికార పక్ష సభ్యులు ఎందుకు నిరసనలు వ్యక్త ం చేస్తున్నారని తరువాయి 2లో

## ఆర్‌బిఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా



**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంకు 26వ గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను కేంద్ర ప్రభుత్వం సోమవారం నియమించింది. ఆర్‌బిఐ గవర్నర్‌గా మల్హోత్రా నియామకం ప్రతిపాదనకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో బుధవారం నుంచి ఆయన మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉన్న శక్తికాంత్ దాస్ పదవీ కాలం డిసెంబరు 10వ తేదీతో ముగియనుంది. సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఐఐటి కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ తరువాయి 2లో



## అసెంబ్లీ వద్ద బిఆర్‌ఎస్ నిరసన

రేవంత్‌రెడ్డి, అదానీ ఫొటో ఉన్న టీషర్ట్‌లు ధరించి రావడంతో అడ్డుకున్న పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలను పోలీసులు అసెంబ్లీ బయటే అడ్డుకున్నారు. అనుమతించలేదు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పారిశ్రామికవేత్త ఆదానీ కలిసి ఉన్న ఫోటోతో కూడిన టిషర్టులు ధరించి రావడంతో అసెంబ్లీ గేటు వద్దే అడ్డుకున్నారు. టిషర్టులపై ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి, ఆదానిల ఫోటోను తొలగిస్తేనే లోపలికి అనుమతిస్తామని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు పోలీసులు స్పష్టం చేశారు. అయితే దీనికి అంగీకరించి బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అసెంబ్లీ గేటు ముందు నిరసనకు దిగారు. దీంతో తరువాయి 2లో

# అసద్‌కు రష్యా ఆశ్రయం



**మాస్కో:** తిరుగుబాటుదారులు దేశ రాజధాని డమాస్కస్‌ను కూడా ఆక్రమించుకోవడంతో, అధికార నివాసం నుంచి పరారైన సిరియా మాజీ అధ్యక్షుడు బషీర్ అసద్‌కు రాజకీయ ఆశ్రయం కల్పిస్తామని రష్యా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యక్తిగతంగా ఈ నిర్ణయం తీసుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, అసద్‌తో పుతిన్ భేటీ అయ్యే అవకాశాలు లేవని అన్నారు. అసద్ ఇప్పుడు రష్యాలోనే ఉన్నారా? ఒకవేళ రష్యా వచ్చి ఉంటే, ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పెస్కోవ్ వెల్లడించలేదు. తిరుగుబాటుదారులతో చర్చించిన తర్వాత అసద్ సిరియా వదలి వెళ్లారని పేర్కొన్నారు. కాగా, రష్యా ప్రకటనతో, అసద్ అక్కడికే చేరుకొని ఉండవచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి.

## ఇండోనేషియాలో ఆకస్మిక వరదలు

10 మంది మృతి... ఇద్దరు గల్లంతు



**సుకబుమి (ఇండోనేషియా):** గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, అకస్మిక వరదలు ముంచెత్తడంతో, ఇండోనేషియాలోని సుకబుమి ప్రావీన్స్‌లోని పలు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. ఆకస్మిక వరదలతో భారీగా ఆస్తి నష్టం జరగ్గా, 10 మంది మృతి చెందారని, ఇద్దరు గల్లంతయ్యారని అధికారులు ప్రకటించారు. ఈ వరదల వల్ల సుకబుమి జిల్లాలోని 170 గ్రామాలు నీటిలో మునిగాయి. పశ్చిమ జావా ప్రావీన్స్‌లో అనేక చోట్ల బురద మేటలు కనిపిస్తున్నాయి. కనీసం 3000 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 400 ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతిన్నాయి. సహాయ కార్యక్రమాలు జురుగ్గా సాగుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

# రసాయన ఆయుధాగారాలపై ఇజ్రాయెల్ దాడులు



### సిరియాలో గందరగోళ పరిస్థితులు
### అసద్ అధికార నివాసంలో యథేచ్ఛగా లూటీలు

**డమాస్కస్:** సిరియాలోని అనుమానిక రసాయన ఆయుధాగారాలపై ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు శత్రువుల చేతికి చిక్కకుండా ఉండేందుకే ఈ దాడులను నిర్వహించామని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రకటించింది. 1974 నాటి ఒప్పందం ప్రకారం సిరియాలోని బఫర్‌జోన్‌ను ఇజ్రాయెల్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. తమ దేశ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యకు ఉపక్రమించినట్టు ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. సిరియాలోని ఇరాన్, హిజ్బొల్లా మిలిటరీ స్థావరాలే లక్ష్యంగా ఇటీవల కాలంలో ఇజ్రాయెల్ వందలాది వైమానిక దాడులు గత కొంత కాలంగా చేస్తునే ఉంది. అయితే నిర్దిష్టంగా ఒక స్థావరం లేదా కొన్ని స్థావరాలను లక్ష్యంగా చేసుకొని జరిగే దాడులను ఇజ్రాయెల్ అధికారులు గోప్యంగా ఉంచుతారు. కానీ, తాజా దాడులపై ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ వివరణ ఇవ్వడం ఆసక్తి రేపుతున్నది. ఇలావుంటే, అధ్యక్షుడు బషీర్ అసద్ దేశం విడిచి పారిపోవడంతో, తిరుబాటుదారుల చేతికి అనధికారికంగా అధికార పగ్గాలు చిక్కాయి. పాలనా వ్యవహారాలన్నీ సక్రమంగా సాగుతున్నాయని సిరియా ప్రధాని మహమ్మద్ ఘాజీ జలాలీ ప్రకటించినప్పటికీ, దేశ వ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దేశాధ్యక్షుడి అధికార భవనంపై కొంత మంది దాడులు చేసి, లూటీకి పాల్పడ్డారు. అధికారిక భవనాలు, ఆస్తులను పరిరక్షించాలంటూ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన హయాత్ తహరీర్ అల్–షామ్ (హెచ్‌టిఎస్) నాయకుడు అబూ మహమ్మద్ అల్‌జులానీ విజ్ఞప్తి చేసినప్పటికీ, అరాచకదాడులు కొనసాగుతునే ఉన్నాయి. మరోవైపు సిరియా రాజధాని డమాస్కస్ సమీపంలోని మెజ్జే సైనిక విమానాశ్రయం ప్రాంతంలో ఆదివారం వైమానిక దాడులు జరిగాయి. అయితే, ఎవరు ఈ దాడులకు పాల్పడ్డారన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు. సిరియాలోని రసాయన ఆయుధాగారాలు, రాకెట్లపై దాడులు జరిపింది తామేనని ప్రకటించిన ఇజ్రాయెల్, ఈ దాడుల ప్రస్తావన చేయకపోవడం గమనార్హం.




# ప్రపంచ దేశాల ఆందోళన



**డమాస్కస్:** సిరియాలో చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల అధిక శాతం దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. అధ్యక్షుడు బషీర్ అసద్ పాలనకు వ్యతిరేకంగా 14 సంవత్సరాలుగా పోరాడుతున్న హయాత్ తహరీర్ అల్–షామ్ (హెచ్‌టిఎస్) అధినేత అబూ మహమ్మద్ అల్‌జులానీకి అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉండడమే ఈ ఆందోళనకు కారణం. పశ్చిమాసియా దేశమైన సిరియాలో అసద్ కుటుంబీకుల పాలన 54 సంవత్సరాలుగా కొనసాగుతున్నది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో అసద్ విదేశాలకు పలాయనం కావడంతో, తిరుగుబాటుదారులు పట్టు బిగించారు. హెచ్‌టిఎస్ నాయకుడు అల్‌జులానీ సౌదీఅరేబియాలో జన్మించాడు. తండ్రి పెట్రోలియం ఇంజనీరు కావడంతో, అతని కుటుంబం సిరియా రాజధాని డమాస్కస్ సమీపంలో స్థిరపడింది. అమెరికాపై అల్‌ఖైదా జరిపిన దాడులు (9/11) అల్‌జులానీ ఆలోచనలను మార్చాయి. ఉగ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షితుడైన అతను 2003లో ఇరాక్ వెళ్లి, అల్‌ఖైదా సంస్థలో చేరాడు. సంస్థలో కీలక వ్యక్తిగా మారగా, 2006లో, ఇరాక్‌లోని అమెరికా దళాలు అతనిని నిర్బంధంలోకి తీసుకున్నాయి. ఐదేళ్ల జైలు జీవితం గడిపిన అతను, బయటకు వచ్చిన తర్వాత అల్‌కైదాలో కీలక బాధ్యతలు స్వీకరించి, సిరియాలో దాని విభాగమైన అల్ సుస్రా ఫ్రంట్‌ను ఏర్పాటు చేశాడు. సిరియాలో ఇస్లామిక్ షరియా పాలన కోసం పోరాటం సాగిస్తామని 2013లవో ప్రకటించాడు. మూడేళ్లలోనే అల్‌ఖైదా అనుబంధ గ్రూప్‌పై పూర్తి ఆధిపత్యాన్ని సంపాదించి, ఆ తర్వాత గ్రూప్ పేరును 'జబాత్ ఫతే అల్‌షమా'గా మార్చాడు. 2017లో వివిధ తిరుగుబాటు సంస్థలను కలిపి హెచ్‌టిఎస్‌ను నెలకొల్పాడు. అసద్ పాలనపై సమర శంఖారావం పూరించి, తిరుగుబాటు ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. అమెరికా, తుర్కియే (టర్కీ) తోసహా పలు దేశాలు హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి. ఐక్యరాజ్య సమితి (యుఎన్) కూడా ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చింది. ఇరాన్, హిజ్బొల్లాకు మద్దతునిస్తున్న అసద్ పాలనకు తెరపడడంతో, అల్‌జులానీ వైఖరిపై అనుమానంతోపాటు ఆందోళన కూడా వ్యక్తమవుతున్నది. సిరియాలో ఆందోళనకరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సర్ అన్నారు. హిజ్బొల్లాకు మద్దతునిస్తున్న అసద్ అధికారాన్ని కోల్పోవడం స్వాగతించగదగిన పరిణామమేనని అంటూనే, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

# హిందువులపై దాడులు ఆందోళనకరం

### బంగ్లాదేశ్‌లో పర్యటనలో
### భారత విదేశాంగ కార్యదర్శి మిస్రీ

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. శాంతిస్థాపనకు జరిగే కృషిలో సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలున్నాయని భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ అన్నారు. బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లిన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జషీమ్ ఉద్దీన్‌తో భేటీ అయినప్పుడు, మైనారిటీ ప్రజలు, సంస్థలు, ఇతరత్రా కీలక ప్రాంతాలపై దాడులు జరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేసినట్టు చెప్పారు. శాంతి భద్రతలను మెరుగుపరచి, బంగ్లాదేశ్‌లోని మైనారిటీ వర్గాలన్నిటికీ రక్షణ కల్పించాలని కోరినట్టు తెలిపారు. జషీమ్ ఉద్దీన్ కూడా ఈ విషయంలో సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ ఏడాది ఆగస్టు 5న, విద్యార్థుల ఆందోళన ఉధృతం కావడంతో, బంగ్లాదేశ్‌ను విడిచి పెట్టిన అప్పటి అధ్యక్షురాలు షేక్ హసీనా భారత్ చేరుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత్ నుంచి భారత్ తరఫున ఇదే తొలి అధికారిక పర్యటన. హసీనాపై బంగ్లాదేశ్‌లో పలు కేసులు నమోదయ్యాయి. హసీనాను విచారించాల్సి ఉందని, కాబట్టి ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ యూనుస విదేశాంగ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహిద్ సొస్సేన్‌ను కూడా మిస్రీ కలిశారు. వారితో భేటీ ఆశాజనకమైన వాతావరణం జరిగిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఢిల్లీ నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. భారత్–బంగ్లాదేశ్ మైత్రీ సంబంధాలపై మిస్త్రీ చర్చించారని, అదే విధంగా బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల విషయాన్ని కూడా ప్రస్తావించారని వివరించింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది.



## తొలగించాలి (మొదటి పేజీ తరువాయి)

ధన్‌ఖడ్ ప్రశ్నించగా, సభా నాయకుడు జె.పి.నడ్డా స్పందించారు. కాంగ్రెస్ సభ్యులకు సంబంధమున్న అంశంపై చర్చ జరగాలని బిజెపి సభ్యులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ – ఆసియా పసిఫిక్ (ఎఫ్‌డిఎల్–ఎపి), జార్జ్ సోరస్‌ల మధ్య బంధం ఆందోళన కలిగించేదని, ఆ సంస్థ సహ అధ్యక్షులు మన సభలో సభ్యులని ఆయన అన్నారు. ఎఫ్‌డిఎల్–ఎపి సంస్థ జమ్మూ కశ్మీర్ ప్రత్యేక అస్థిత్వంగా చూస్తుందని, రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు విరాళాలిస్తుందని నడ్డా ఆరోపించారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశమన్నారు. తక్షణమే జార్జ్ సోరస్‌కు కాంగ్రెస్ అగ్రనేతలకు మధ్య సంబంధాలపై చర్చ జరగాలని పలువురు బిజెపి ఎంపిలు డిమాండ్ చేశారు. కేవలం అదానీ అంశం నుంచి దృష్టి మళ్ళించేందుకు ఇలా చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టింది. ఈ అంశానికి సంబంధించి బిజెపి సభ్యులు ఇచ్చిన నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరించినప్పటికీ జీర అవర్‌లో జాతీయ భద్రత అంశంపై బిజెపి సభ్యుడు లక్ష్మీ కాంత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఆ అంశాన్ని ప్రస్తావించేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ నియమావళి ప్రకారం రూల్ 267 కింద తిరస్కరణకు గురైన అంశంపై ఇతర రూపంలో ప్రస్తావించేందుకు అనుమతించబోరని జైరామ్ రమేశ్ తెలిపారు. చైర్మన్ వివక్షతాపూరితంగా వ్యవహరిస్తున్నాడని మరో కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ సింగ్ అన్నారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రతి పదవి నుంచి ధన్‌ఖడ్‌ను తప్పించేందుకు రాజ్యాంగంలోని 67(బి) అధికరణ కింద రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు నోటీసు ఇవ్వాలని ఇండియా కూటమి సభ్యులు నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

## సంజయ్ మల్హోత్రా (మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన ఆయన అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ అభ్యసించారు. విద్యుత్, ఆర్థిక, పన్నులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైన్స్ తదితర రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సర్వీసులందించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని రెవెన్యూ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక, పన్నుల విషయంలో అపారమైన అనుభవం కలిగిన ఆర్థిక, ట్యాక్సేషన్‌లో అపారమైన అనుభం కలిగిన సంజయ్ మల్హోత్రా.. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా, 2018లో ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్ పదవీ కాలం 2021లోనే ముగియగా కేంద్రం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబర్ 10తో ముగియనుండడంతో కొత్త గవర్నర్ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మల్హోత్రా ఆర్‌బిఐకి 26వ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టనున్నారు.

## సంఘీభావం (మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలను పరిరక్షించే చట్టాలను తీసుకురావడంలో వైఫల్యం ద్వారా రైతుల కష్టాల పట్ల ప్రభుత్వ ఉదాసీనత స్పష్టతమవుతుందని తెలిపింది. రైతులు గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన ఎంఎస్‌పి అంశంపై ప్రభుత్వం పదే పదే నిష్క్రియాప్రియత్వంతో వ్యవహరించటాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది.రైతుల శాంతియుత నిరసనలను అణిచివేసేందుకు, మౌన అసమ్మతి వ్యక్తికరణపై పోలీసుల దాష్టీకం సహా బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కఠినమైన ఎత్తుగడలను తీవ్రంగా విమర్శించింది. రైతుల న్యాయబద్ధమైన డిమాండ్‌ల పట్ల చర్చలు, పరిష్కారం దిశగా కాకుండా ప్రభుత్వ స్పందన అణివేత, బెదిరింపు ధోరణిలో ఉందని మండిపడింది. న్యాయంగా రావాల్సిన వాటి గురించి డిమాండ్ చేస్తున్న రైతులను దేశ శతృవులుగా చూపిస్తున్నారని, వారిని అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని, వారిపై లాఠీ చార్జ్ చేస్తున్నారని, రైతులు ఉద్యమంలో మరణాలను కూడా ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. బిజెపి ప్రభుత్వ రైతు వ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా అడ్డుకోవాలని సిపిఐ పిలుపునిచ్చింది. తక్షణమే ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలని, రైతు పోరాటంలో హానికి గురైన వారికి న్యాయం చేయాలని కోరింది. రైతుల పక్షాణ నిలబడతామని, వారు విజయం సాధించేంత వరకు వారి న్యాయమైన హక్కుల గురించి నిరంతరం పోరాడుతామని సిపిఐ ప్రకటించింది.

# మన జాతి ఆత్మగౌరవ ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

ముక్కు పుడక, బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరలో,చేతికి గాజులు, కాళ్లకు కడియాలు, మెట్టెలతో,చాకలి ఐలమ్మ, సమ్మక్కసారలమ్మ పోరాట స్ఫూర్తితో ఎంతో హుందాతో కూడిన ఆహార్యంతో 'తెలంగాణ తల్లి'ని రూపొందించారని సభలో సిఎం వివరించారు. కుడి చేతితో జాతికి అభయాన్నిస్తూ, ఎడమ చేతిలో తెలంగాణ మాగాణంలో పండే సాంప్రదాయ పంటలైన వరి, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న పంటలతో మన సంస్కృతికి, సాంప్రదాయానికి నిలువెత్తు రూపంగా తీర్చిదిద్దామని తెలిపారు. తెలంగాణ తల్లి నిలుచున్న పీఠం మన చరిత్రకు దర్పణంగా రూపొందించామన్నారు. తెలంగాణ చిరునామానే ఉద్యమాలు, పోరాటాలు, అమరుల ఆత్మ బలిదానాలు అని, దీనికి సంకేతంగా పీఠంలో బిగించిన పిడికిళ్లను పొందుపరిచామని, పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని గుర్తుచేస్తూ చేతులన్నీ కలిపి పీఠాన్ని మోస్తున్న తీరు తెలంగాణ పునర్ నిర్మాణ రీతిని తెలియజేస్తాయని సిఎం వివరించారు.

**'తెలంగాణ తల్లి'లో గొప్ప తాత్వికత**

తెలంగాణ తల్లి రూపకల్పనలో ఉపయోగించిన వర్ణాలకు కూడా ప్రత్యేకత, గొప్ప తాత్వికత ఉన్నదని, పీఠంలో నీలంవర్ణం, 'గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ'అన్న అదెశ్రీ గీతంలోని తెలంగాణ జల దృశ్యానికి ప్రతీకగా నిలుస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆకుపచ్చవర్ణం, పచ్చని తమ నేలల్లో పసిడి సిరులు పండంగ, 'అన్న తెలంగాణ సస్యశ్యామల' వ్యవసాయ కీర్తికి సంకేతంగా కనిపిస్తుందన్నారు.ఎరుపు వర్ణం మార్పునకు, ప్రగతికి, చైతన్యానికి ప్రతీక అని, బంగారు వర్ణం, శుభానికి, ఐశ్వర్యానికి, సమృద్ధికి నిదర్శనంగా నిలబడుతుందని చెప్పారు..

**ఆకాశంలో తారాజువ్వలుగా వెలిగారు...**

ఆరు దశాబ్దాలుగా రకరకాల రూపాల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజలు తెలియజేశారని, తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ముఖ్యభూమిను పోషించాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక బాధ్యతతో సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలను పరిష్కరించుకోవాలంటే విద్యతో పాటు పోరాటం కూడా చేయాలని, నాలుగు కోట్ల ప్రజల పక్షాన నిలబడాలనే సామాజిక బాధ్యతతో ఉద్యమ బాట పట్టారన్నారు. శ్రీకాంత చారి, కానిస్టేబుల్ కృష్టయ్య,యాదయ్య, ఇషాన్‌రెడ్డి ఇలా ఎంతో మంది ఉద్యమకారులు ఆకాశంలో తారజువ్వలుగా వెలిగారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించాలనే పట్టుదలతో అమరులయ్యారని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆనాడు సోనియాగాంధీ ఒక ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారని, తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని డిసెంబర్ 9న ప్రకటించి నేపథ్యంలో 'డిసెంబర్ 9'కు ఎంతో ప్రాధాన్యత ఉన్నదన్నారు.

**ఛక్రవర్తుల ఆలోచనలతో ప్రజాప్రభుత్వం నడ-వదు:సిఎం**

ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక పార్టీ ఆలోచనలనే నాలుగు కోట్ల ప్రజల ఆలోచనగా, భావన అనేది సమంజసం కాదని సిఎం రేవంత్ రెడ్డి హితువుపలికారు. మధ్య యుగాలల్లో తానే రాజ్యం, రాజ్యమే తాను అనుకున్నట్టుగా బావన, భ్రంతిలో ఉండేవారని, మధ్యయుగాల ఛక్రవర్తుల ఆలోచనలతో ప్రజాస్వామ్యంలో ప్రజాప్రభుత్వం నడవబోదని స్పష్టం చేశారు. నాలుగు కోట్ల ప్రజలు ఏం కోరుకుంటున్నారో,వారి ఆలోచన ప్రతి రూపమే ప్రజా ప్రభుత్వమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో కూడా రాష్ర గీతం లేదని, ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదించకపోవడం దురదృష్టకరమని సిఎం అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమ సందర్భంలో యువత గుండెలపై రాసుకున్న టిజిని అధికారకంగా చేశామన్నారు. తెలంగాణ దేవత, తెలంగాణ తల్లి అనే రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయని,వజ్ర వైఢూర్యాలతో, భుజకీర్తులు, కిరీటాలతో ఉండాలా?, తల్లిలా ఉండాలా? అని ప్రస్తావన వచ్చినప్పుడు, తల్లి ప్రతిరూపమే ఉండాలని పలువురు మేధావులు సూచించారని సిఎం అన్నారు. అందుకే బహుజనుల తెలంగాణ తల్లిగా ఏర్పాటు చేసుకున్నామన్నరు. తెలంగాణ రాష్ట్రంతో, ఇక్కడి ప్రజలతో సోనియా గాంధీకి విడదీయలేని అనుబంధం ఉన్నదని, 60 ఏళ్ల పోరాటాన్ని గౌరవించి, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, దశాబ్దాల కలను నిజం చేసిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ అని సిఎం అన్నారు.

## బిఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

**అమరవీరుల స్తూపం వద్ద బిఆర్ఎస్ నివాళి**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళ్లు అర్పించారు. అమరవీరులను కీర్తిస్తూ ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్ గేయాన్ని ఆలపించగా, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ప్రశాంత్ రెడ్డి ఎంఎల్‌సి కవిత, తో పాటు పలువురు ఎంఎల్‌ఎలు నివాళ్లు అర్పించారు.

**నడిరోడ్డుపై అడ్డుకోవడం దుర్మార్గం : కెటిఆర్**

అసెంబ్లీలోకి వెళ్లకుండ పోలీసులు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులను నడి రోడ్డుపై అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి కెటిఆర్ అగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని సభకు వెళ్లకుండా తమను అడ్డుకోవాలని చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కుస్తీ..గల్లీలో దోస్తీ కడుతున్నారని ఆరోపించారు. సిఎంరేవంత్‌రెడ్డి , అదానీల మధ్య ఉన్న బంధాన్ని బయటపెడతామనికెటిఆర్ పేర్కొన్నారు.

**రాష్ట్రంలో దుర్మార్గపు పాలన : హరీశ్‌రావు**

రాష్ట్రంలో దుర్మార్గ, అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, అగ్రహారం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలని ఎవరైనా ఉద్యమాలు చేశారా అన్ని ఆయన ప్రశ్నించారు. కొత్తగా రూపొందించిన విగ్రహంలో బతుకమ్మను తొలగించి చెయ్యి గుర్తు పెట్టడం రాష్ట్ర ప్రజలకు ఇది అవమానకరమన్నారు.

## చరిత్ర క్షమించదు

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిష్కరణ కావాల్సిందేనని నాటి సిపిఐ జాతీయ నాయకులు ఎపి బర్ధన్, సురవరం సుధాకర్ రెడ్డి,డిరాజా, కె. నారాయణ అనేక మంది నిర్ణయం తీసుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో వస్తే తెలంగాణ రాష్ట్రం ఇస్తామని నాడు సోనియాగాంధీ చెప్పిన విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. ప్రత్యేరాష్ట్ర ఏర్పాటుకు సిపిఐ(ఎం) తటస్థంగా, టిడిపి ఏకాభిప్రాయానికి వచ్చిందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తాను జైలులో ఏడు రోజుల పాటు దీక్ష చేపట్టానని, 700ల కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేశానని అన్నారు. సకలజనుల సమ్మె జయశంకర్, కోదండరామ్ లాంటి అనేక మంది త్యాగాలు, అనేక పద్ధతిలో కృషి చేశారని అన్నారు. సింగరేణి, ఆర్‌టిసిలో తామే గుర్తింపు సంఘం అని, 45 రోజుల పాట సమ్మెలో పాల్గొన్నామన్నారు.

**విరోచితంగా తెలంగాణ సాయుధ పోరాటం**

సోనియా భిన్నాభిప్రాయాలతో ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజకీయాలను బేషజాలను పక్కన పెట్టి, అందరూ ఒక తాటిపైన ఉంటేనే తెలంగాణ తల్లి పట్ల గౌరవం ఉన్నట్టు అర్థమవుతుందని కూనంనేని సూచించారు. మలిదశ తెలంగాణలో యువత, ప్రాణ త్యాగాలు చేసిందని, తమ విద్యార్థి నాయకుడు స్టాలిన్‌పై 250పైన కేసులు ఉన్నాయన్నారు. మహాత్మా గాంధీ కూడా తాను ఒక్కడినే భారతదేశానికి స్వాంతత్ర్యం తీసుకొచ్చానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. విరోచితంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని, 4500 మరణించారని, మగ్ధుం మొయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి,రావి నారాయణ రెడ్డి,చాకలి ఐలమ్మ, దొడ్డి కొము రయ్య లాంటి కమ్యూనిస్టు యోదులు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన విషయాన్ని ఆయన సభలో కూనంనేని సాంబశివరావు వివరించారు. వారి త్యాగాలతోనే ఆనాడు హైదరాబాద్ సంస్థానం నుంచి తెలంగాణ విముక్తి జరిగిందన్నారు. హైదరాబాద్ సంస్థానం నుంచి తెలంగాణ విముక్తి చెందిందని, దీనిని ఎప్పుడూ కమ్యూనిస్టు పార్టీ వ్యక్తిగతంగా చెప్పుకోలేదని కూనంనేని అన్నారు.

**బతుకమ్మ ఉంటే బాగుండేది : పాయల శంకర్**

బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో అన్ని పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్నారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఉంటే బాగుండేదన్నారు. 317జిఒను మార్చాలని కోరారు. తెలంగాణ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణను గత ప్రభుత్వం చిన్నా భిన్నం చేసిందని ఆరోపించారు.

రాజకీయాలకు తావివ్వొద్దు: పోచారం శ్రీనివాస్ రెడ్డి

ఎంఎల్ఎ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాను కూడా తెలంగాణ పోరాటంలో ఉన్నామని, తెలంగాణ తల్లి రూపకల్పన అభినందనీయమన్నారు. రాజకీయాలకు తావు ఇవ్వొద్దని, పార్టీలకు అతీతంగా ఉండాలన్నారు. శాసనసభ సమావేశాలు ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. అందరూ సభలో హుందాతనంగా, మర్యాదగా వ్యవహారించాలని సూచించారు.

# అదానీ, రేవంత్ రెడ్డి ఉన్న టీ–షర్ట్ వేసుకొని వెళితే తప్పేమిటి?

### మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాము అదానీరేవంత్ రెడ్డి ఉన్న టీషర్ట్ వేసుకెళితే తప్పేమిటని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగకుండా పాలకపక్షం కుట్ర పన్నిందని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలను సభకు రాకుండా చేయాలని కుట్ర చేసిందన్నారు. అందుకే తమను అసెంబ్లీ బయటే అడ్డగించారన్నారు. ఇదివరకు ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. తాము ఏ దుస్తులు వేసుకోవాలో స్పీకర్ చెబుతారా? అని ప్రశ్నించారు. కెసిఆర్ దీక్ష వల్లనే డిసెంబర్ 9న తెలంగాణకు అనుకూలంగా ప్రకటన వచ్చిందన్నారు. ఈ విషయం కోదండరామ్‌కు కూడా తెలుసునని అన్నారు.

ఆశావర్కర్లపై దాడిని ఖండించిన మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆశావర్కర్లపై పోలీసుల దాడిని బిఆర్ఎస్ ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డి ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఆమే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆశావర్కర్లపై అమానీయంగా వ్యవహరించిందన్నారు. అసెంబ్లీలో తెలంగాణ తల్లి గురించి మాట్లాడారు, బయట ఆడబిడ్డలైన ఆశావర్కర్లపై దాడి చేశారని విమర్శించారు. ఆశావర్కర్ల మీద మగ పోలీసులు దాడిచేసిన తీరును అందరూ చూశారని అన్నారు. అసలు ఎటు పోతోంది రాష్ట్రం అని ప్రశ్నించారు. ఆశావర్కర్లపై దాడి జరిగిన తీరుతో ప్రభుత్వం సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఆశావర్కర్ సంతోషి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఆమెకు ఉత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఆశావర్కర్లపై రాక్షసుల్లా ప్రవర్తించిన పోలీసులు : పల్లా రాజేశ్వర్ రెడ్డి**

ఆశావర్కర్లపై పోలీసులు రాక్షస మూకలా దాడి చేశారని జనగాం ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఎసిపి శంకర్ మహిళలపై దాడి చేశారన్నారు. పోలీసులు చీరలను ఇష్టమొచ్చినట్టు లాగారన్నారు. ఇదేనా ప్రజా పాలనా ? అని ప్రశ్నించారు. ఆశావర్కర్లపై దాడిని ఆయన ఖండించారు. తెలంగాణ తల్లి మాట్లాడుతూ, ఆడబిడ్డలపై దాడులు చేయిస్తారా? అని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్‌లు తమ బిల్లుల కోసం ఉద్యమిస్తుంటే వాళ్ళను జైల్లోకి పంపుతున్నారని అన్నారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తూ మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఆపుతున్నారన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్..

# డిసెంబర్ 9 చరిత్రాత్మక దినం



ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి ద్వారా తెలంగాణ ప్రకటన చేసిన డిసెంబర్ 9 ఒక చరిత్రాత్మకమైన దినంగా పరిగణించబడుతుందని మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఎ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు ప్రక్రియ గురించి ఏంచేయలేదన్నారు. గతంలో గత ప్రభుత్వం అనధికారికంగా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మేధావులు, విద్యార్థులు ఏ వర్గం కూడా ఆమోదించలేదని స్పష్టం చేశారు. "కేవలం నా కుటుంబం వల్లే తెలంగాణ వచ్చింది, కెసిఆర్ వల్లే తెలంగాణ వచ్చింది" అనే బిఆర్ఎస్ పార్టీ నేతల చిల్లర మాటలు ఈ పది సంవత్సరాలు విన్నాం భరించామన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ తరుణంలో ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ సభలో ఉండాల్సిందన్నారు. సభలో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లేకపోవడం కల్వకుంట్ల కుటుంబం చేస్తున్న ద్రోహం అని అభివర్ణించారు. పార్టీ పేరు నుండి తెలంగాణ తొలగించిన వారికి తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆత్మగౌరవం ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన చేయించారన్నారు. సచివాలయంలో జరిగే విగ్రహావిష్కరణకు కెసిఆర్, కెటిఆర్, కవిత, హరీశ్ రావు వచ్చి తెలంగాణ సమాజం పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. బతుకమ్మ బహుజనులు అందరూ ఆడరని, ఒక పండుగ ఒక వర్గానికి మాత్రమే ప్రత్యేకమన్నారు. అన్ని పండుగలను దృష్టిలో ఉంచుకుని విగ్రహ రూపకల్పన జరిగిందన్నారు. బహుజనులకు ప్రతిరూపం తెలంగాణ తల్లి విగ్రహం అని అన్నారు.

**తెలంగాణ అస్థిత్వం ఉట్టిపడేలా విగ్రహాన్ని రూపొందించారు**
**ఎంఎల్‌ఎ వేముల వీరేశం**



తెలంగాణ అస్థిత్వం ఉట్టిపడేలా విగ్రహాన్ని రూపొందించిన సిఎం రేవంత్‌రెడ్డికి నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబర్ 9 చారిత్రాత్మక దినమని, సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణ సమాజానికి ఊపిరి పీల్చుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన జరిగిన రోజు అని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో గత ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరించిందన్నారు. గత ప్రభుత్వం ఎవరి సూచనలు పట్టించుకోకుండా విగ్రహం రూపకల్పన చేసిందన్నారు. వారు మాకు సూచనలు చేయాల్సింది పోయి తెలంగాణ తల్లిని విస్మరిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు.బిఆర్ఎస్ పార్టీ గడీల సంస్కృతి అని పేర్కొన్నారు.తెలంగాణకు బతుకమ్మ, బోనాలు అవసరం. అయితే ఒకే చేతిపై బతుకమ్మ, బోనాలు పెట్టలేం కదా? అని అన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరిగిందని పేర్కొన్నారు.

**డిసెంబర్ 9 తెలంగాణ తల్లి ఉత్సవాలను వ్యతిరేకిస్తున్నం**
**ఎంఎల్‌ఎ ధన్‌పాల్ సూర్యనారాయణ**



ప్రతి సంవత్సరం డిసెంబర్ 9 తెలంగాణ తల్లి ఉత్సవాలు జరుపుతాం అని చెప్పడం వ్యతిరేఖిస్తున్నం అని నిజామాబాద్ అర్బన్ ఎంఎల్‌ఎ ధన్‌పాల్ సూర్యనారాయణ ఎద్దేవాచేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో ధన్‌పాల్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ సంవత్సరం కాలంలో ఇచ్చిన ఆరు హామీలు ఆరు అబద్దాలుగా మారాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కొత్తగా ఆవిష్కరణ కోసం అసెంబ్లీ పెట్టారని పేర్కొన్నారు.

**ఇది ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే..** సోనియమ్మ మెప్పుకోసం అని అన్నారు. దానికోసమే ఒక్కరోజు అసెంబ్లీ నడిపారని, చరిత్రలో ఇలా ఎన్నడూ జరగలేదని అన్నారు. ఇది గవర్నర్‌ను అవమానపర్చడమేనన్నారు. దీంతో 1200 మంది అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. తెలంగాణకు సంస్కృతి సంప్రదాయానికి ప్రతిరూపం అయిన బతుకమ్మ తెలంగాణ తల్లి విగ్రహం నుండి తొలగించడం పద్ధతి కాదు.

# తెలంగాణ తల్లి విగ్రహంపై మరింత చర్చ అవసరం

ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్



ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహంపై ఇంకా చర్చ జరగాల్సిన అవసరం ఉందని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ప్రొఫెసర్ కోదండరామ్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఉద్యమంలో తెలంగాణ తల్లి విగ్రహం చారి అనే వ్యక్తి తయారు చేశారన్నారు. ఉద్యమ తెలంగాణ తల్లి, ఇప్పుడు ప్రభుత్వం పెడుతున్న తెలంగాణ తల్లి ఒకే విధంగా ఉన్నాయన్నారు. కెసిఆర్ తెలంగాణ తల్లి విగ్రహం ఆయన సొంత నిర్ణయమని ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. గతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ప్రకటించలేదన్నారు. ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహంపై అన్ని వర్గాల ప్రజల మధ్య చర్చ జరిగిందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని, ట్రోల్ చేసే వాళ్లకు చరిత్ర తెలియదన్నారు. తెలంగాణ తల్లి బొమ్మపై ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయం చెబుతారన్నారు. మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కొంత మంది బతుకమ్మ ఆడబోరన్నారు. బతుకమ్మ ఉండాలా వద్దా అనే అంశాలపై చర్చ జరుగుతోందని ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు.



# ముత్యాలమ్మ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని పండుగలా జరపాలి

మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల దుండగుడి దాడిలో ధ్వంసం అయిన ముత్యాలమ్మ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని పండుగలా జరపాలని దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం జరుగుతుందని శాఖా కొండా సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ రావాలని కోరుతూ మంత్రి కొండా సురేఖకు దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి మంత్రి సురేఖను అసెంబ్లీలోని మంత్రి చాంబర్‌లో కలిసి ఆహ్వానపత్రికను అందించారు. నిర్ణీత సమయంలోనే ముత్యాలమ్మ దేవాలయ నవీకరణతో పాటు గర్భాలయంలో ముత్యాలమ్మ వారి విగ్రహ పునఃప్రతిష్టకు చర్యలు చేపట్టినందుకు గాను మంత్రి సురేఖ అధికారులను అభినందించారు. ముత్యాలమ్మ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని పండుగలా జరపాలని ఆదేశించారు. భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా దేవాలయాలను తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అధికారంపైనే మమకారం..



'తెలంగాణ తల్లి విగ్రహం' రాష్ట్ర ప్రజల మనోభావాలకు అద్దం పడుతోంది
శాసనసభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల అభిప్రాయం చెప్పకుండా సభకు దూరంగా ఉండడమంటేనే వారికి అధికారంపైనే ప్రేమ, తాపత్రయం ఉన్నట్టు భావనలు కలుగుతున్నాయని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 'తెలంగాణ తల్లి' విగ్రహ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనపై పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం భట్టి విక్రమార్క సమాధానమిస్తూ 'సోనియాగాంధీకి హృదయపూర్వక కృతజ్ఞతలు. వారి చొరవతోనే తెలంగాణ ఏర్పడింది. అందులో ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదు. వారికి నా ధన్యవాదాలు" అని 13 డిసెంబర్ 2014న శాసనసభలో నాటి సభా నాయకుడు, సిఎం కెసిఆర్ చేసిన ప్రసంగాన్ని భట్టి సభలో చదవి వినిపించారు. తెలంగాణ ఏర్పాటుకు కొన్ని దశాబ్దాలుగా పోరాటం జరుగుతున్నప్పటికీ డిసెంబర్ 9న యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తన జన్మదినం సందర్భంగా హోంమంత్రి చిదంబరంతో అధికారికంగా ప్రకటన చేయించారని భట్టి తెలిపారు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో అద్భుతంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణను రాష్ట్రం మొత్తం పండుగలా జరుపుకుంటుంటే ఈ పండుగ తమకు అవసరంలేదని బిఆర్ఎస్ నాయకులు బయటికి పోవడం ఏ సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిపక్షం అభిప్రాయాలు చెబితేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని, శాసనమండలిలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై తాను ప్రకటన చేస్తే సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారని.. హర్షం వ్యక్తం చేశారని భట్టి తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్ సభలో ఉండి వారి అభిప్రాయాలు చెబితే బాగుండేదని, తమను పొగడాలని, తెలంగాణ తల్లి విగ్రహం గొప్పగా ఉన్నదని చెబుతారని తాము కోరుకోవడం లేదని, ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తం చేయవచ్చని అన్నారు. భిన్నాభిప్రాయాలు ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో సభను నడిపించామని, తెలంగాణ రాష్ట్ర బిల్లు చర్చకు వచ్చినప్పుడు తాను డిప్యూటీ స్పీకర్‌గా, శ్రీధర్ బాబు శాసనసభాపక్ష వ్యవహారాల మంత్రిగా అందరికీ మాట్లాడే అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. ఆనాడు భిన్నాభిప్రాయాలు ఉండేనని, అయినా ఎవ్వరూ సభ నుంచి బయటికి వెళ్లలేదని, ఆనాడు తీవ్ర భావోద్వేగాలు ఉన్నప్పటికీ అందరూ సభలోనే ఉండి, వారి వారి అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయాన్ని భట్టి గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహం చూస్తుంటే ఒక అమ్మ, ఒక నాయనమ్మ కనిపిస్తున్నదన్నారు. పంటల పచ్చదనానికి ఆకుపచ్చ చీర ప్రతిబింబం, రాజ్య హింస పెరిగినప్పుడు ప్రజలు తిరుగుబాటు చేస్తారు. దీనికి పీఠంపైన పిడికిళ్ళు, ఎరుపు ప్రగతిశీల భావాలు ఉద్యమాలకు గుర్తు, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ సుభిక్షంగా ఉండాలని ఆపన్న హస్తంతో ఆశీర్వదిస్తారు. తెలంగాణలో పండే పంటలన్నీ తల్లి చేతిలో కనిపిస్తుంది' అని అన్నారు.

**చరిత్రకు దర్పణం తెలంగాణ తల్లి**
**మంత్రి శ్రీధర్‌బాబు**



శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మన చరిత్రకు దర్పణంగా తెలంగాణ తల్లిని రూపొందించామన్నారు. తెలంగాణ తల్లి రూపకల్పనపై శాసనసభలో బిఆర్ఎస్ మాట్లాడుతుందని తాము అనుకున్నామని, ఉద్దేశపూర్వకంగానే వారు సభకు దూరంగా ఉన్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను, సభకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం జరిగిందన్నారు. పార్టీ పేరులో తెలంగాణ తొలగించుకున్న వారికి తెలంగాణపై మాట్లాడే హక్కు లేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోనియా గాంధీలేకపోతే జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. టిఆర్ఎస్‌లో 'తెలంగాణ' అనే టి అనే పదాన్ని తొలగించి, 'భారత' అని 'బి' పదాన్ని చేర్చుకున్న బిఆర్ఎస్‌కు తెలంగాణపైన మాట్లాడే హక్కు లేదన్నారు. 'ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు..నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు' అని అన్నారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత, మాజీ సిఎం గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదన్నారు.

**పదేళ్ల కాలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదు :**
**మంత్రి పొన్నం ప్రభాకర్**



బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు జరగలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలోనే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నామని వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని, తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా తెలంగాన తల్లి విగ్రహాన్ని రూపకల్పన చేశామన్నారు. ఇటీవల వరదలు వస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ బిజెపి సభ్యులకు సూచించారు.

**తెగింపునకు పర్యాయపదం ఒయు**
**మంత్రి దామోదర రాజనర్సింహ్మా**



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు తెగింపునకు పర్యాయపదం ఉస్మానియా విశ్వవిద్యాలయం అని అన్నారు. అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలు ఉన్నాయని, ఉద్యమంలో అన్ని వర్గాలూ పాల్గొన్నాయని తెలిపారు.

**తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలా? : మంత్రి సీతక్క**



పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవన రూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని వివరించారు. 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ బిఆర్ఎస్, బిజెపి నాయకులు తమపై విమర్శలు చేస్తున్నారని, గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? అని ప్రశ్నించారు.

కెటిఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుని, దీనిని ఇప్పటి వరకు రాష్ట్ర ప్రజలపై రుద్దారని మండిపడ్డారు. తాము తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించామన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కమిటీ ఏకగ్రీవ మద్దతు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణను శాసనమండలిలో సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. శాసన మండలి సమావేశాలు సోమవారం ఉదయం 10:30 గంటలకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభంలోనే తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి ప్రకటనకు సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా తెలంగాణ తల్లి విగ్రహాన్ని, రూపాన్ని మార్చకుండా ఉండే విధంగా చట్టం చేయాలని పలువురు సభ్యులు ప్రభుత్వానికి సూచించారు. సచివాలయం ముందున్న తెలుగు తల్లి ఫ్లైఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మార్చాలని కోరారు. ఈ విషయాలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ అందుకు సంబంధించిన అంశాన్ని పరిశీలిస్తామని సభ్యులకు హామీనిచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సభ్యులు మద్దతు తెలపడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణకు సభ్యులను ఆయన ఆహ్వానించారు.

**తెలంగాణ తల్లిని అధికారికంగా గౌరవించుకుందాం : భట్టి విక్రమార్క**



ఇప్పటి వరకు ప్రాచుర్యంలో ఉన్న విగ్రహానికి అధికారిక గుర్తింపు లేదన్నారు. స్వరాష్ట్ర సాధన సుదీర్ఘ పోరాటంలో సకల జనుల్లో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లిని అధికారికంగా గౌరవించుకుందామన్నారు. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదని, నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగమన్నారు. భావోద్వేగాన్ని ప్రతిబింబించేలా ప్రజాప్రభుత్వం తెలంగాణ తల్లిని రూపొందించిందని చెప్పారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ సంక్షిప్త పేరును టిజికి అధికారికంగా గుర్తింపు ఇచ్చామన్నారు.

**తెలంగాణ తల్లి రూపం ఆశీర్వదిస్తున్నట్లుగా ఉంది, పార్టీలకు లింకు పెట్టొద్దు :**
**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



డిసెంబర్ 9, 2009లో యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీని మధ్యాహ్నం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, తెలంగాణ ప్రకటన చేయాలని కోరామని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. సాయంత్రం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటన వచ్చిందన్నారు. తెలంగాణ ఏర్పాటు చేసిన సోనియా గాంధీకి ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తల్లి రూపం ఆశీర్వదిస్తున్నట్లుగా భావించాలన్నారు. ఈ విషయంలో పార్టీలకు లింకులు పెట్టొద్దన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు.

**తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు రాజకీయ కోణంలో చూడొద్దు : జీవన్ రెడ్డి**



తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణను, జయ జయహే గీతం అధికారికంగా గుర్తింపు నివ్వడం పట్ల కాంగ్రెస్ సభ్యులు జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని అభినందించారు. రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించలేదన్నారు. గతంలో ఉన్న విగ్రహాలు రాచరికపు విధానాలకు అద్దంపట్టేలా ఉండేవన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆవిష్కరిస్తున్న విగ్రహం తెలంగాణ రైతు, రైతు కూలిగా, చేతిలో వరి, మొక్కజొన్న, సజ్జలతో అభయ హస్తంతో అశీర్వదిస్తున్న మాతృమూర్తిలా ఉందని, విమర్శలు అనవసరమన్నారు. హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుని విగ్రహాన్ని ఎన్‌టిఆర్ హయంలో రూపొందించారని, అభయ హస్తంతోనే బుద్ధుని విగ్రహం ఉందని, దేవతా మూర్తులు కూడా అలాగే ఉంటాయన్నారు. తెలంగాణ ఉద్యమం ఒక్క రాజకీయ పార్టీది కాదన్నారు. ఎవరినీ సంప్రదించకుండానే బిఆర్ఎస్ గతంలో విగ్రహం రూపొందించిందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటును రాజకీయ కోణంలో చూడొద్దన్నారు.

**తెలంగాణ జీవవాన్ని ప్రతిబింబించేలా ఉంది : అలుగుబెల్లి నర్సి రెడ్డి**

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రభుత్వంతో ఏకీభవిస్తున్నామని అలుగుబెల్లి నర్సి రెడ్డి అన్నారు. ఎలాంటి అలంకరణలు లేకుండా రూపొందించిన విగ్రహ ఆవిష్కరణకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవాలకు దగ్గరగా తెలంగాణ తల్లి విగ్రహం ఉందన్నారు. తెలంగాణ జీవనాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఉద్యమ సమయంలో జయ జయహే గీతాన్ని పాఠశాలల్లో పాడేవారని, తెలంగాణ వచ్చాక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గీతాన్ని అధికారికంగా ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు.

**భవిష్యత్తులో విగ్రహ రూపం మార్చకుండా చట్టం చేయాలి : రఘోత్తమ్ రెడ్డి**

భవిష్యత్తులో ప్రభుత్వం మారినా కూడా విగ్రహాన్ని మార్చకుండా చట్టం ఉంటుందా?, ఉంటే ఆ చట్టం చేయాలని సభ్యుడు రఘోత్తమ్ రెడ్డి సూచించారు. డిసెంబర్ 9 చారిత్రాత్మకమైన రోజు అన్నారు. పండుగ వాతావరణం నెలకొందన్నారు. తెలంగాణ జన జీవనం ఉట్టిపడేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

**ఒరిజినల్ తెలంగాణ తల్లిని పరిచయం చేశారు తీన్మార్ మల్లన్న**



ఒరిజినల్ తెలంగాణ తల్లిని పరిచయం చేశారని సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. ఆలేరు నియోజకవర్గం రాజపేట మండలంలోని బేగంపేట గ్రామంలో ప్రస్తుతం ప్రభుత్వం ఆవిష్కరిస్తున్న విగ్రహం మాదిరిగానే విగ్రహాన్ని గతంలో ఆవిష్కరించారని తెలిపారు. సచివాలయం ముందున్న తెలుగు తల్లి ఫ్లైఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా మార్చాలని సూచించారు. బావుల దగ్గర బాలమ్మ, పోచమ్మ మాదిరిగా తెలంగాణ తల్లి విగ్రహం ఉందన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఆవిష్కరించాలని, కలెక్టరేట్‌లలో చిత్రపటాలు ఏర్పాటు చేయాలని కోరారు. గన్‌పార్కులో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఇప్పటి వరకు అధికారికంగా ఆవిష్కరించలేదన్నారు. తెలంగాణ అమరుల స్థూపాన్ని ఆవిష్కరించాలని మల్లన్న కోరారు.



# సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ట్రాన్స్‌జెండర్లు క్షీరాభిషేకం

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ వాలంటీర్లుగా విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ట్రాన్స్ జెండర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ నిర్ణయం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ట్రాన్స్‌జెండర్లు.. హైదరాబాద్ బషీర్బాగ్ చౌరస్తాలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేవంతన్న జిందాబాద్ అని పలు నినాదాలు చేశారు. సమాజంలో వివక్షకు గురవుతున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. తమను ట్రాఫిక్ విధుల్లోకి తీసుకున్నందుకు రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మాజీ సర్పంచుల అరెస్టు దారుణం

హరీష్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పెండింగ్ బిల్లులు చెల్లించాని కోరుతూ మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వస్తున్న మాజీ సర్పంచుల సంఘం నాయకులను, మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. మాజీ సర్పంచులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరడం కూడా పాపం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటం శోచనీయమని, ఏడాది కాలంగా వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటం దుర్మార్గమన్నారు.

ఇప్పటికే నాలుగైదు సార్లు హైదరాబాద్‌కు వచ్చి మొరపెట్టుకున్నా సమస్యలు పరిష్కరించకపోగా నిరసనలు తెలిపితే నిర్బంధిస్తూ అరెస్టులు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే మాజీ సర్పంచులను చర్చలకు పిలవాలని, వారి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దిగ్విజయంగా 'ఏడాది పాలన' పూర్తి

టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి నేతల కుట్రలను తిప్పికొడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం శాసనమండలిలో ఎంఎల్‌సిలు బల్మూరు వెంకట్, తీన్మార్ మల్లన్నలతో కలిసి మహేష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఒకవైపు ఓవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'ప్రజాపాలన విజయోత్సవాలు', మరో వైపు తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ జన్మదిన ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని మహేష్ కుమార్ పేర్కొన్నారు. మాటకు కట్టుబడి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం రూపొందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందని, ప్రజల ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**గాంధీభవన్‌లో సోనియా జన్మదిన వేడుకలు :** గాంధీ భవన్‌లో సోనియాగాంధీ 79 వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎఐసిసి ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తో కలిసి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.

అనంతరం టిపిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT.No. 42/EE-28/SBZ/GHMC/2024-25

**పని పేరు:** నిర్వహణ పనులు: ఇతర-01, **అంచనా విలువ:** రూ.0.92 లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం :** 09.12.2024న మ.02.30గం.ల నుండి 12.12.2024న మ.02.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, **సెల్ నెం.** 9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.18, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7680-PP/CL/ADVT/1/2024-25, Date: 09-12-2024

దేవాదాయ-ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వము
శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానము
గ్రా॥ గంగాపురం, మం॥ జడ్చర్ల, జి॥ మహబూబ్‌నగర్

టెండర్ నోటీస్ నం.: 1/ఎస్.ఎల్.సి.డి/2024 తేది: 07.12.2024

సీల్డ్ టెండర్ కామ్ బహిరంగ వేలము ద్వార టెండర్లు - వేలము ప్రకటన

దేవాలయంలో దిగువ కనపరచిన లైసెన్సు మరియు సరఫరా హక్కుల నిమిత్తం 2025-26 గాను ఆసక్తి మరియు అనుభవం గల ఫర్మ్ ల నుండి తక్కువ, ఎక్కువ మొత్తంలో కోడ్ చేయు టెండర్ దారుల నుంచి టెండర్లు కోరడమైనది. ఇందుములముగా సమస్త వ్యాపారులకు మరియు ప్రజలకు తెలియచేయునది లైసెన్సు మరియు సరఫరా హక్కుల నిమిత్తం 2025-2026 టెండర్లు గాను విప్పుట తేది మరియు సమయం 16-12-2024 ఉదయం 11.00 గం.ల నుండి, కార్యనిర్వహణాధికారి కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేలములు నిర్వహించబడును. ఇట్టి వేలములు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి & ఫౌండర్ ట్రస్టీ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షణలో జరుగును.

విభాగం: ఎ

| క్ర.సం. | వేలం వివరములు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | తలనీలాలు ప్రోగు చేసుకోను హక్కు | ఒక్క సంవత్సరం | రూ. 2,000.00/- |
| 2 | ప్రసాదములు అమ్మకము | ఒక్క సంవత్సరం | రూ. 2,000.00/- |
| 3 | కొబ్బరికాయలు అమ్ముకోవడము | బ్రహ్మోత్సవాలు (జాతర)సమయంలో మాత్రమే | రూ.1,000.00/- |
| 4 | కొబ్బరిచిప్పలు సేకరించుకోనుట | ఒక్క సంవత్సరం | రూ. 25000.00/- |
| విభాగం: బి | | | |
| 1 | విద్యుత్ అలంకరణ | ఒక్క సంవత్సరం రూ.10,000/- | |
| 2 | పూల మాలలు మరియు అలంకరణ | ఒక్క సంవత్సరం రూ.10,000/- | |
| 3 | చలువ పందిర్లు | బ్రహ్మోత్సవాలు నుంచి జూన్ నెల వరకు | రూ.10,000/- |
| 4 | రంగులు వేయడము | బ్రహ్మోత్సవాలకు ముందు ఒక్క నెల మాత్రమే | రూ.5,000/- |

**వేలంపాట షరతులు :** 1. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు నగదు/ డి.డి రూపంలో చెల్లించవలెను . డి.డి లు Executive Officer, Sri Laxmi Chenna Kesava Swamy Devasthanam, Gangapur, Jadcherla తీయగలరు. 2. వేలంపాటలో పాల్గొనదలచిన వారు టెండర్ షెడ్యూల్ రూ.200/- నగదు చెల్లించి, కార్యాలయ సిబ్బందిని సంప్రదించి షెడ్యూల్ తీసుకొనవలెను. 3. వేలంపాటలో పాల్గొనదలచిన వారు హిందువులై ఉండవలెను. 4. సరైన కారణములు తెలపకనే టెండర్లు రద్దు చేయుటకు, వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారం కలదు. ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సిబ్బందిని సంప్రదించగలరు. సదా శ్రీ స్వామి వారి సేవలో........

ఫౌండర్ ట్రస్టీ & ధర్మకర్తల మండలి సభ్యులు సం/- కార్యనిర్వహణాధికారిణి

DIPR R.O. No. : 7666-PP/CL/ADVT/1/2024-25, Date: 09-12-2024

ఫోకస్

# యువతరంగం

## అబ్బుర పరిచే ప్రతిభ..



జాషువా బెక్ఫోర్డ్... 'ది మోస్ట్ బ్రిలియంట్ బాయ్ ఇన్ ది వరల్డ్'గా పేరు సంపాదించిన అసాధారణ ప్రతిభావంతుడు. కేవలం 10 నెలల వయసులోనే కీబోర్డులోని అన్ని అక్షరాలను గుర్తించడం మొదలు పెట్టాడు. జాషువా ఆసక్తిని, తెలివిని గ్రహించిన అతని తండ్రి నాక్స్ డేనియల్, కొత్తకొత్త సవాళ్లను ముందు ఉంచేవాడు. జాషువా వాటిని పూర్తి చేసేవాడు. ఏడాది వయసులోనే సంక్లిష్టమైన సమస్యలను అర్థం చేసుకొని, పరిష్కరించడం ప్రారంభించాడు. నైజీరియా నుంచి ఇంగ్లండ్ వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన జాషువా ఒకటిన్నర సంవత్సరాల వయసులోనే రంగులు గుర్తించడంతోపాటు, చదవడం, రాయడం మొదలు పెట్టాడు. మూడు సంవత్సరాల వయసులో జపనీస్ భాషలో అనర్గళంగా మాట్లాడాడు. ఆరు సంవత్సరాలకే అతనికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చేరాడు. తత్వశాస్త్రం, చరిత్రను అభ్యసించాడు. ఇప్పుడు అతని వయసు 14 ఏళ్లు. చిన్నతనం నుంచే ఎవరూ ఊహించని స్థాయిలో రాణించి, అత్యంత తెలివిమంతుడుగా గుర్తింపు పొందిన జాషువా భవిష్యత్ ప్రణాళికలు కూడా చాలా ఉదాత్తంగా ఉన్నాయి. 'నేను ప్రపంచాన్ని మార్చాలనుకుంటున్నాను. భూమి పరిరక్షణకు కృషి చేయాడమే నా లక్ష్యం' అని వియన్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ చెప్పాడు. నేషనల్ ఆటిస్టిక్ సొసైటీ యొక్క బ్లాక్ అండ్ మైనారిటీ (బిఇఎం) ప్రచారకుడిగా పని చేస్తున్న అతను, ఆటిజం నిరోధానికి జరుగుతున్న ప్రయత్నాలకు సహకరిస్తున్నాడు. ప్రపంచ ప్రజల, ప్రత్యేకించి నల్ల జాతీయుల అభ్యుదయమే తన లక్ష్యమని అంటున్న జాషువా భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## అధిక జనాభాతో చిక్కులు

ప్రపంచ జనాభా రోజురోజుకూ పెరుగుతున్నది. 2050 నాటికి 9.7 బిలియన్లకు చేరుతుందని అంచనా. 2100 నాటికి జనాభా 11.2 బిలియన్లు దాటిపోయే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అదే విధంగా 2050 నాటికి ప్రపంచ జనాభాలో దాదాపు 70 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటారని అంచనా. గత దశాబ్దకాలంలో వాతావరణంలో విపరీమైన మార్పులు వచ్చాయి. 2010–2019 మధ్యకాలంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవానికి ముందు కాలంతో పోలిస్తే సగటున 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. గత రెండేళ్లుగా ప్రపంచంలోని అనేక దేశాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అభివృద్ధి నమోదవుతున్నప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా 736 మిలియన్ల మంది ప్రజలు ఇప్పటికీ తీవ్రమైన పేదరికాన్ని అనుభవిస్తున్నారు. అనేక దేశాల్లో పేదల సగటు ఆదాయం రోజుకు 2 డాలర్లు (సుమారు 164 రూపాయలు) కంటే తక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోని అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక శాతం మంది, సంపదలో మాత్రం 40 శాతం వాటాతో, పూర్తి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది.



# దేశ ఆర్థిక వ్యవస్థకు 'గిగ్ మార్కెట్' ఊతం




ఇటీవల కాలంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న లేబర్ మార్కెట్‌గా గిగ్ వర్క్‌ఫోర్స్‌ను పేర్కోవచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థకు గిగ్ మార్కెట్ ఊతమిస్తున్నది. ఫోరమ్ ఫర్ ప్రోగ్రెసివ్ గిగ్ వర్కర్స్ ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, దేశంలో గిగ్ ఎకానమీ 17 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్)ను నమోదు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి గిగ్ మార్కెట్ 455 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ పెరుగుదల గణనీయమైన ఆర్థిక వృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఉపయోగపడుతుంది. స్వల్పకాలిక, సౌకర్యవంతమైన ఉద్యోగాలను 'గిగ్' అంటారు. గిగ్ మార్కెట్ అనేది తరచుగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సులభతరం చేయబడిన కార్మిక మార్కెట్‌ను సూచిస్తుంది. ఇది సాంప్రదాయ పూర్తిసమయ ఉద్యోగ ఒప్పందాల ద్వారా కాకుండా, తాత్కాలిక లేదా పనికి వేతనం మాదిరి 'టాస్క్ బై టాస్క్' ప్రాతిపదికన కొనసాగుతుంది. ఆ విధంగా, చేసిన పనికి ప్రతిఫలం పొందడానికి ఇష్టపడేవారే ఈ రంగంలో ఉంటారు. ఇండిపెండెంట్ కాంట్రాక్టర్లు, ఫ్రీలాన్సర్లు అనికూడా పిలిచే గిగ్ వర్కర్లు ఎక్కువగా ఫుడ్ డెలివరీ, రవాణా తదితర రంగాల్లో ఫ్రీలాన్సర్లుగా పనులు చేస్తుంటారు. వీరికి స్వల్పకాలిక లేదా టాస్క్ ఆధారిత ఉద్యోగాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ అందిస్తాయి. గిగ్ వర్క్ అనేది విభిన్నమైన అవకాశాలను, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను సమతుల్యం చేసుకునే అవకాశాలను కల్పిస్తుంది. ఆయా రంగంల్లో సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని పెంచుతుంది. గిగ్ ఎకానమీలో కార్మికులు లేదా సేవకులు తమ షెడ్యూల్‌ను తామే ఖరారు చేసుకుంటారు. తమకు నచ్చిన పనే చేస్తారు. సాధారణంగా చదువుకు, చేస్తున్న ఉద్యోగానికి సంబంధం లేకుండా వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని చూస్తునే ఉంటాం. అయితే గిగ్ వర్కర్లకు మాత్రం తాము ఎలాంటి పని చేయాలనుకుంటున్నారో, అదే పనిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా లేబర్ మార్కెట్‌లోని మహిళలకు ప్రయోజనం చేకూరుస్తుంది. గిగ్ వర్క్ అనేది నైపుణ్యాన్ని పెంపొందించడానికి అనుమతిస్తుంది, కార్మికులు తమ నైపుణ్యాన్ని విస్తృతం చేసుకోవడం ద్వారా ఆదాయ సామర్థ్యాన్ని పెంచే వివిధ పనులను చేపట్టగలుగుతారు. డిమాండ్ ఆధారంగా అవసరమైన మేరకే సేవలు పొందే అవకాశం కంపెనీలకు లభిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది అటు కార్మికులు లేదా ఉద్యోగులకు, ఇటు కంపెనీలు లేదా సంస్థలకు ఉభయతారకంగా ఉంటుంది. గిగ్ వర్క్ స్వల్పకాలిక ప్రాజెక్ట కోసం నిర్దిష్ట నైపుణ్యాలుగల కార్మికులను ఎంపిక చేసుకోవడానికి వ్యాపార సంస్థలను అనుమతిస్తుంది. దీర్ఘకాలిక కట్టుబాట్లు లేకపోవడంతో ఉత్పాదకతను డిమాండ్‌కు అనుగుణంగా సమతౌల్యం చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇలావుంటే, నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో, మన దేశంలో గిగ్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 7.7 మిలియన్ గిగ్ కార్మికులు ఉన్నారు, సంఖ్య 2029–30 నాటికి 23.5 మిలియన్లకు చేరుతుందని అంచనా. ఈ రంగం తక్కువ, మధ్యస, అధికనైపుణ్యం కలిగిన ఉద్యోగాల మిశ్రమం. మధ్యస్థ నైపుణ్యంగల వారే గిగ్ మార్కెట్‌లో ఎక్కువ మంది ఉన్నారు. గిగ్ ఎకానమీ వృద్ధికి దోహదపడే ముఖ్య రంగాలలో ఇ–కామర్స్, రవాణా, డెలివరీ సేవలు ఉన్నాయి, సౌకర్యవంతమైన జీవనానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా, ఈ రంగాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేశంలో 936 మిలియన్ల మంది ఇంటర్నెట్ సబ్‌స్క్రైబ్ చేసుకున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ విస్తృతమైన ఇంటర్నెట్ సదుపాయం గిగ్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిగా మారింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గడంతో, తక్కువ ఆదాయ వర్గాలకు కూడా ఇంటర్నెట్ వినియోగం అందుబాటులోకి వచ్చింది. దేశంలోని సుమారు 65 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. ఇకామర్స్ ఎదుగుదలకు, గిగ్ మార్కెట్ పెరుగుదలకు ఇది కూడా ఒక కారణం. నగరాలు, పట్టణాలలో ఫుడ్ డెలివరీ, ఇ–కామర్స్ వంటి శీఘ్ర సేవలకు పెరిగిన డిమాండ్ సహజంగానే గిగ్ వర్కర్లకు అవకాశాలను సృష్టిస్తున్నది. లాంఛనప్రాయ ఉద్యోగావకాశాల కొరత కారణంగా గిగ్ వర్క్ తీసుకోవడానికి ఇష్టపడే సెమీస్కిల్డ్, నైపుణ్యం లేని కార్మికులు ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నరు. స్థిరమైన ఉద్యోగం లేదా ఉపాధి లేనప్పుడు, జీవనోపాధి కోసం దొరికిన పని చేయడం తప్పుకాదన్న అభిప్రాయం ప్రజల్లో, ప్రత్యేకించి యువతలో వేళ్లానుకుంటున్నది. ఈ కారణంగానే గిగ్ వర్కర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది.

> గిగ్ వర్కర్లు సాధారణంగా వ్యవస్థీకృత మరియు అసంఘటిత కార్మికుల మధ్య, 'గ్రే జోన్'లో ఉంటారు. ఆరోగ్య సంరక్షణ, పెన్షన్, బీమా వంటి ప్రయోజనాలు దాదాపుగా ఉండవు. సకాలంలో చెల్లింపులు కూడా ఉండడం లేదని 25 శాతానికిపైగా గిగ్ వర్కర్లు ఆరోపిస్తున్నారు. చేసిన పనికి వెంటనే చెల్లింపులు జరపకుండా కాంట్రాక్టు కంపెనీలు లేదా వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. చెల్లింపుల్లో ఆలస్యం చేయడం వల్ల, సదరు వర్కర్లు ఇతరత్రా పనులకు వెళితే, ఆ మొత్తాలు తమ వద్దే ఉండిపోతాయన్నది కాంట్రాక్టర్ల వ్యూహంగా కనిపిస్తున్నది. ముందుగా చెప్పిన లేదా వివరించిన దాని కంటే ఎక్కువ పని చెప్పడం, తక్కువ చెల్లింపులు చేయడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. నైపుణ్యం పెంచుకునే మార్గాలు గిగ్ వర్కర్లకు తక్కువ. కెరీర్‌లో ముందుకు వెళ్లడం లేదా పదోన్నతి పొందడం అనేవి ఉండవు.

> తాత్కాలిక ఉపాధి పొందుతున్న వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం గిగ్ మార్కెట్‌లో ప్రధాన సమస్య. 20 శాతం మంది అసంతృప్తితో ఉన్న గిగ్ కార్మికులు దీనిని ప్రధాన సమస్యగా పేర్కొంటున్నారు. 30 శాతం కంటే ఎక్కువ మంది ఈ గిగ్ వర్క్‌ను అత్యంత సంక్లిష్టమైన ఉద్యోగ ప్లాట్‌ఫామ్‌గా అభివర్ణిస్తున్నారు. వృత్తి నైపుణ్యం లేక లేదా వయసు, ఆరోగ్యం సహకరించక సెక్యూరిటీ గార్డులు వంటి పనుల్లో చేరిన వారు ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటున్నారు. గిగ్ వర్క్‌లో ఆదాయాన్ని అంచనా వేయడానికి వీల్లేదు. డిమాండ్, పోటీ, కాలానుగుం ధోరణులపై వచ్చే ఆదాయం ఆధారపడి ఉంటుంది. దీని వల్ల ఆర్థిక ప్రణాళిక దాదాపు అసాధ్యం. అప్పులు తీసుకోవడం, చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడడం సామాన్యమవుతుంది. సమగ్రమైన చట్టంగానీ, నిర్దిష్టమైన నియంత్రణగానీ లేకపవడంతో, గిగ్ కార్మికులు న్యాయమైన వేతనాలను, హక్కులను కోల్పోతున్నారు. ఏ విధంగానే రక్షణ లేకుండా, అసంఘటిత కార్మికులుగా కొనసాగుతున్నందువల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు.




## రెండో ఎఎన్‌ఎంలపై అదనపు పనిభారం తగదు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లాలోని సెకండ్ ఎఎన్‌ఎంలతో వారి పనితో పాటు ఆశావర్కర్లు చేసే ఎలెసిడిసి సర్వే పనులు అధికారులు చేయించుకుంటున్నారని, దీంతో ఎఎన్‌ఎంలకు పనిభారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం ములుగు జిల్లాలో పనిచేస్తున్న 2వ ఎఎన్‌ఎంలు ఎలెసిడిసి సర్వే అదనపు పనులను చేయించద్దని కోరుతూ ర్యాలీగా వెళ్లి డిఎంహెచ్‌ఓ గోపాల్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఏ జిల్లాలో కూడా ఎఎన్‌ఎంలతో ఎలెసిడిసి సర్వే పని చేయించడం లేదని, ములుగు జిల్లాలో మాత్రం చేయించడం అనేది సరైంది కాదని, అంతేకాకుండా ఇప్పుడు ఎఎన్‌ఎంలు చేసే పనే ఒత్తిడితో కూడుకున్నదని, సర్వే నుంచి ఎఎన్‌ఎంలను మినహాయింపు ఇవ్వాల ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా నాయకులు ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.సరోజన, ప్రధాన కార్యదర్శి కోడి సుజాత తదితరులు పాల్గొన్నారు.



## నియంతలా వ్యవహరిస్తున్న ఐసిడిఎస్ అధికారులపై చర్యలు

ఎఐటియుసి గౌరవాధ్యక్షుడు గౌస్, డిహెచ్‌పిఎస్ జిల్లా కన్వీనర్ దినేష్ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** నియంతల్లాగా వ్యవహరిస్తున్న ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి కాంట్రాక్టు గౌరవ అధ్యక్షులు ఎంఎ గౌస్, డిహెచ్‌పిఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ డిమాండ్ చేశా రు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి కాంట్రాక్టు గౌరవ అధ్యక్షులు ఎంఎ గౌస్, డిహెచ్‌పిఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ మాట్లాడుతూ గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం(113)లో 12 ఏళ్లుగా జగదీశ్వరి ఆయాగా పనిచేస్తుంది. సెంటర్‌కు సంబంధించిన టీచర్ బదిలీ అయిందని, తనకు పదో తరగతి అర్హత ఉందని, ఇదే సెంటర్కు తనను ప్రమోట్ చేయాల్సి ఉండగా, మార్కండేయ కాలనీలోని ఓ సెంటర్లో విధులు నిర్వర్తిస్తున్న మరో హెల్పర్ కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడి తీసుకొని ప్రమోట్ చేశారని ఆరోపనలు ఉన్నాయన్నారు. కాగా ఈ వ్యవహారంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు జగదీశ్వరి ఫిర్యాదు చేసినప్పటికీ సంబందించినశాఖ ఉన్నతాధికారులు డిబ్ల్యుఒ, సిపిడిఒ, నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విఠల్ నగర కేంద్రంలోని ఆయా జగదీశ్వరికి పదోన్నతి ఇవ్వడంలో అవకతవకలు జరిగినట్లు హెల్పర్లు ఆరోపిస్తున్నారని, ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు బయట పడుతాయని, అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లు నిరసనలు తెలుపుతున్న సిడిపిఒ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, నేను మంత్రులు, ఎమ్మెల్యేతో మాట్లాడతా, నా గురించి మీకు తెలియదు అని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పనిఒత్తిళ్లతో పాటు వేధింపులు ఎక్కువైనట్లు ఆరోపణలు వస్తున్నాయని, స్థానిక సిడిపిఒ, యుడిసి, డి డబ్ల్యుఓపై సమగ్ర విచారణ చేసి, ఆయా జగదీశ్వరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఐసిడిఎస్ కమిషనర్ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీలకు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.



## 'మధ్యాహ్న' కార్మికులకు హామీలు అమలెప్పుడు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ ధ్వజం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్‌డిఒ కార్యాలయం ముందు చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహార దీక్షలకు సోమవారం మద్దతు తెలిపి ఆయన మాటాడారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. వంట కార్మికులకు జనవరి నుండి కోడిగుడ్ల బిల్లులు ఇంకా చెల్లించలేదన్నారు. రూ.2000 వేతనము జూన్ నుండి ఇవ్వాలని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రతి పాఠశాలలో వంట షెడ్లుచ వంట పాత్రలు లేక మధ్యాహ్న భోజన కార్మికుల ఇబ్బందులకు గురవుతున్నారు. వంట పాత్రలకు బడ్జెట్ వచ్చి నెలలు గడుస్తున్నా టెండరింగ్ అయింది అంటూ అధికారులు చెబుతున్నాడు తప్పా ఇప్పటివరకు ఒక్క పాఠశాలకు కూడా వంట పాత్రలు అందలేదని ఆయన తెలిపారు. ఒక్కో విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం కోడి గుడుకు ఐదు రూపాయలు చెల్లిస్తున్నది బహిరంగ మార్కెట్లో ఏడు రూపాయలకు కోడి గుడ్డు దొరుకుతున్నది, నాణ్యమైన భోజనం పెట్టమంటున్నారు, మేము పెట్టడానికి సిద్ధంగా కానీ పురుగుల బియ్యం పంపించి సకాలంలో కోడిగుడ్ల బిల్లు ఇవ్వకపోవడంతో వేతనాలు ఇవ్వకపోవడంతో మేము కోడిగుడ్లు పెట్టలేకపోతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన చెందుతున్నారన్నారు. గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరపర చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నెలసరి వేతనం రూపాయలు రూ.10000 ఇవ్వాలని, వంట కార్మికులను పాఠశాలలలో ఉపాధ్యాయులు మనుషులుగా చూడాలని, తక్షణమే కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని, పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఒక వంట కార్మికురాలను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటివరకు రాగి జావా బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు రాకపోవడంతో పది నెలలు వేచి చూసి మధ్యాహ్న భోజన కార్మికులు రిలే నిరాహార దీక్షకు దిగారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, ఎఐటి=యుసి జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్, జిల్లా నాయకులు, అన్నిమండల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్

**ప్రజాపక్షం/కాళేశ్వరం :** భవన నిర్మాణ రంగంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఎఐటియుసి భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులతో సోమవారం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్ అడ్డాలు ఏర్పాటు చేసి షెడ్లను నిర్మించి ఇవ్వాలని, అదే విధంగా కార్మిక భవనం కోసం రెండు గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బొల్లి శ్రీను, అశోక్, రాజబాబు, రాజన్న, దుర్గరాజు, శంకర్, సారయ్య, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




## పేద ప్రజల అండ ఎర్రజెండానే

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు ఎర్రజెండా అండగా నిలిచిందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డిసెంబర్ 26 నుంచి ఏడాది పాటు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని శత జయంతి ఉత్సవాలను పార్టీ శ్రేణులు,ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక భాస్కరరావు భవన్లో జరిగిన సిపిఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదవారి పక్షాన అనేక పోరాటాలు నిర్వహించి అనేక త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని వంద సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీ కూడా అని పేద ప్రజల అభ్యున్నతికి అనేకమంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలను సైతం చేశారన్నారు. దున్నే వాడికే భూమి కావాలని నినదించి లక్ష ఎకరాల భూములను పేద ప్రజల కు పంపిణీ చేసిన ఘనత భారతదేశంలో ఒక సిపిఐకే దక్కిందనిన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి నిజాం నవాబులను, రజాకార్లను తరిమికొట్టిన ఘనత సిపిఐకే దక్కిందన్నారు. ఈనెల 12న పెద్దపల్లి జిల్లాలోని సిపిఐ శాఖా కార్యదర్శులకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గోదావరిఖనిలో ఈనెల 15న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2025 పార్టీ సభ్యత్వం డిసెంబర్ 31 లోపు పూర్తి చేయాలని కోరారు. సిపిఐ నాయకులు నగర సహాయ కార్యదర్శి తాళ్ళ పెల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, కార్యవర్గ సభ్యులు మడి కొండ ఓదెమ్మ, టి.రమేష్ కుమార్, అసాల రమ, శనిగరపు చంద్ర శేఖర్, మార్నాపురి సూర్య, రేనికుంట్ల ప్రీతం, పడాల కనక రాజు, సిరిసిల్ల మల్లేష్ పాల్గొన్నారు.



## డిమాండ్ల సాధనకు సంఘటిత పోరాటాలే శరణ్యం

ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** డిమాండ్ల సాధనకు సంఘటిత పోరాటాలే శరణ్యమని ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమయ్య అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల 2వ మహాసభ సో మవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభు త్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




## మహిళల హక్కులే మానవ హక్కులని చాటుదాం

జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలలో భాగంగా దేశంలో సగ భాగంగా ఉన్న మహిళల హక్కులే మానవ హక్కులని 1975లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునివ్వడం జరిగిందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. డిసెంబర్ 10 మానవ హక్కుల రోజును పురస్కరించుకుని జ్యోతి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మానవ హక్కుల దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని మహిళలపై జరిగే అన్ని వివక్షతలను పీడనను దోపిడీని, అత్యాచారాలను, హత్య లను, శారీరక మానసిక హింసల్ని నిరోధించడానికి పాలకవర్గాలు చిత్తశుద్ధితో మహిళ హక్కుల్ని అమలుపరచడానికి మానవహక్కుల రోజు మహిళల రోజు అని ఆకాంక్షిద్దాం అని పేర్కొన్నారు. బీజింగ్‌లో 1995లో జరిగిన అంతర్జాతీయ సదస్సు మహిళా సాధికారిత సాధిస్తేనే మానవ హక్కులు రక్షింపబడతాయని పేర్కొందని గుర్తు చేశారు. మహిళల హక్కుల్ని రాజ్యం హరించకుండా పాలకులు నిర్వర్తించినప్పుడు మహిళల హక్కులే మానవ హక్కులుగా వర్ధిల్లుతాయన్నారు. భారత రాజ్యాంగంలో మహిళకు చట్ట రూపంలో హక్కులు ఉన్నప్పటికీ పురుషాధిక్యత వలన చట్టం ధనవంతుల యొక్క సవరణల యొక్క చుట్టంగా మారి అడుగడుగునా మహిళా హక్కుల్ని కాల రాయడం జరిగిందన్నారు. రాజ్యాధికారంలో మహిళల భాగస్వామ్యం పెంచడం ద్వారా కొనసాగుతున్న మహిళా చట్టాల్ని కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా చట్ట వ్యవస్థపై నమ్మకం పెరిగి మానవ హక్కులకు రక్షణ ఉంటుందనే భావాన్ని పాలకులు కల్పించాలన్నారు. స్త్రీ యొక్క శక్తి సామర్థ్యాలను వినియోగించాలని సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలలో స్త్రీలు సమానంగా పాల్గొనడం విద్య వైద్య రంగాల్లో స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్త్రీ పురుషుల భాగస్వామ్యంతో సామాజిక వైఖరులను ఆచార వ్యవహారాలను మార్చడం స్త్రీలకు ఆడపిల్లలకు ఎదురవుతున్న అన్నిరకాల వివక్షతలను హింసను రూపుమాపడంపై పోరాటాలే శరణ్యమన్నారు. పౌర సమాజంలో స్త్రీ చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారికకు దోహదపడుతుందన్నారు. పాలకవర్గాలు చిత్తశుద్ధితో మహిళ హక్కుల్ని అమలు పరచడానికి పురుష సమాజంలో మౌలిక మార్పులు రావాలని మానవ హక్కుల రోజు మహిళల రోజు అని ఆకాంక్షిద్దామన్నారు.



## సుప్రీం చర్యతో మత సామరస్యంపై ప్రభావం : సిపిఐ

**న్యూఢిల్లీ :** మైనారిటీ ప్రార్థనా ప్రదేశాలు లక్ష్యంగా కింది కోర్టులు తొందరపాటు సర్వే ఉత్తరువులు జారీ చేసిన ఉదంతాలు భారత లౌకికవాద స్ఫూర్తిపై తాజా దాడిగా సిపిఐ ఖండించింది. ఈఈ చర్యలు ప్రార్థనా ప్రదేశాల (ప్రత్యేక నియమాల) చట్టం 1991 భావన, ఆత్మను పూర్తిగా ఉల్లంఘించటమే కాకుండా రాజ్యాంగం హామీ ఇచ్చిన లౌకిక నిర్మాణాన్ని ప్రమాదంలోకి నెట్టివేయస్తుందని పేర్కొంది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. 1947 ఆగస్టు 15వ తేదీ నాటికి ప్రార్థనా ప్రదేశాలు కొనసాగిన స్థితినే యథాతథంగా పరిరక్షించేందుకు, భారతదేశంలోని విభిన్న సమూహాల మధ్య శాంతి, సామరస్యతను కాపాడేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపింది. ప్రార్థనా ప్రదేశాల సర్వేను అనుమతించటం ద్వారా మత పరమైన ఏకీకరణకు న్యాయవ్యవస్థ తలుపులు తెరవడమే కాకుండా రాజ్యాంగంలోని లౌకిక సూత్రాలను బలహీన పరిచిందని వ్యాఖ్యానించింది. ఇలాంటి నిర్లక్ష్య వైఖరి మన సమాజాన్ని విభజించే, బహుళత్వ లక్షణాలను అస్థిరపరిచే ముప్పుకు దారి తీస్తుందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదకర ధోరణిని ప్రోత్సహించటంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలో సుప్రీం కోర్టు పాత్రను సిపిఐ ప్రశ్నించింది. ప్రార్థనా ప్రదేశాల చట్టాన్ని మత సహనాన్ని పరిరక్షించే చర్యగా సుప్రీం కోర్టు సమర్థించకుండా, దానిపై రివ్యూ పిటిషన్‌ను అనుమతించాలనే నిర్ణయం ద్వారా తేనెతుట్టెను కదిపిందని, దీంతో దేశంలో మతసామరస్యంపై దీర్ఘకాలిక పర్యవసనాలను ఉంటాయని పేర్కొంది. కోర్టు చర్యలు మితవాద శక్తుల విభజన ఎజెండాలకు వేదికను కల్పించడమే కాకుండా మైనారిటీ, మెజారిటీ అనే తేడా లేకుండా అన్ని సమూహాల ప్రార్థనా ప్రదేశాలకు కల్పించిన సురక్షిత కవచాన్ని బలహీనపరిచిందని సిపిఐ వ్యాఖ్యానించింది. మన దేశ లౌకిక యోగ్యతను ప్రశ్నార్థకంగా మార్చే విధంగా తిరోగమన న్యాయ ప్రకియకు సుప్రీం కోర్టు పాల్పడవద్దని, భారత దేశ లౌకిక చట్రాన్ని గౌరవించాలని, ప్రార్థనా ప్రదేశాల చట్టం సమగ్రతను బలపరచాలని ఈ సందర్భంగా సిపిఐ విజ్ఞప్తి చేసింది.

## అధికార, విపక్షాల..ఆరోపణలు ప్రత్యారోపణలు

### నిరసనలతో హోరెత్తిన పార్లమెంట్
### ఉభయ సభలు : నేటికి వాయిదా



**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాల నిరసన హోరు మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమవగానే ప్రతిపక్షాలు తమ స్థానాల నుంచి ముందుకు వచ్చి పలు అంశాలపై చర్చకు పట్టుబట్టాయి. వారిని తమ తమ స్థానాలకు వెళ్ళి కూర్చోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయం కీలకమైనదని, సభ నడిచేందుకు సహకరించాలని కోరారు. అయినా ప్రతిపక్షాలు పట్టువీడకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైన తరువాత కూడా నిరసనలతో హోరెత్తడంతో మధ్యాహ్నం రెండు గంటలకు, మరోసారి మూడు గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మధ్యాహ లోక్‌సభ తిరిగి ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ సభ్యులు లోక్‌సభ వెల్‌లోకి వెళ్ళి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొద్దిసేపటికి సమాజ్‌వాదీ సభ్యులు కూడా వెల్‌లోకి వెళ్ళి నిరసన వ్యక్తం చేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేసిన బిజెపి ఎంపి నిశికాంత్ దూబెకు వ్యతిరేకంగా ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఏమైందని కాంగ్రెస్ సభ్యులు నిలదీశారు. "మోదీ సర్కార్ డౌన్ డౌన్", 'మోదీ సర్కార్ షేమ్ షేమ్", "వీ వాంట్ జస్టిస్" అంటూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. టిఎంసి, ఆర్‌జెపి సభ్యులు తమ సీట్లకు వద్ద నిలబడి నిరసనకు మద్దతు పలికారు. ఎస్‌పి సభ్యుడు ధర్మేంద్రయాదవ్ రైతు ఉద్యమానికి మద్దతుగా నినాదాలు చేశారు. 'పూరే దేశ్ కా కిసాన్ పరేషాన్ మే హై' (దేశ రైతులంతా ఆందోళనగా ఉన్నారు' అని ఆయన గట్టిగా అరిచారు. ప్రతిపక్షాల నిరసనల సమయంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లోక్‌సభలోనే ఉన్నారు. పార్లమెంటరీ పత్రాలను సభ ముందు ఉంచిన తరువాత స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ కాంగ్రెస్ సభ్యులు ఇచ్చిన నోటీసులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. నిరసనల మధ్య సభ వాయిదా పడింది.

**రాజ్యసభలోనూ రగడ..** ప్రతిపక్ష, అధికార పక్షాల పరస్పర ఆరోపణ,పత్యారోపణల హోరు మధ్య రాజస్యభ మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం సభ ప్రారంభమవగానే అమెరికా బిలియనీర్‌జార్జ్‌సోరస్‌తో కాంగ్రెస్ నేతలు కుమ్మక్కయ్యారని బిజెపి సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు చర్చకు పట్టుబడుతూ ఇచ్చిన నోటీసును చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు. దీనికి రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షు డు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ బిజెపి సభ్యులు ఇచ్చిన నోటీసులు తిరస్కరణకు గురైనప్పటికీ చైర్మన్ అధికార పక్ష సభ్యులు నిరసనలకు ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ మాట్లాడుతూ అదానీని రక్షించేందుకు, ఆ అంశం నుంచి దృష్టి మళ్ళించేందుకే బిజెపి ఇలాంటివి తెరమీదకు తీసుకువస్తుందని విమర్శించారు. సిపిఐ(ఎం) సభ్యుడు బికాశ్ రం జన్ భట్టాచార్య మాట్లాడుతూ అధికార పక్షమే ఒక అంశాన్ని సభలో లేవనెత్తుతున్నాయంటే, అది వారి వైఫల్యమేనని అన్నారు. ప్రధాని ఎందుకు ఈ అంశాలపై ఒక ప్రకటన చేయరని ప్రశ్నించారు. బిజెపి ఆరోపణలు తిప్పికొడుతూ కాంగ్రెస్‌సభ్యులు తిప్పికొడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సభనిర్వహణ కొవిడ్ సమయం కంటే తీవ్రంగా ప్రభావితమవుతుందని రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ హెచ్చరించారు. మూడు సార్లు సభ వాయిదా పడి, తిరిగి మధ్యా హ్నం 3 గంటలకు సమావేశమైనప్పటికీ నిరసనలు కొనసాగడంతో సభను మంగళవారానికి వాయిదే వేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. అంతకుముందు ఆయన ఛాంబర్‌లో సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడితో సమావేశాన్ని నిర్వహించారు. సభను సజావుగా నిర్వహించే ఉద్దేశ్యంతో ఇరువురితో సమావేశం నిర్వహించానని, ఇరు వైపుల నిర్మోహమాటంగా చర్చలు జరిగాయని ధన్‌ఖడ్ తెలిపారు. మరోసారి మంగళవారం సభ ప్రారంభానికి ముందు ఉదయం 10:30 గంటలకు వారిరువురితో సమావేశం కానున్నట్లు వెల్లడించారు.

## పంజాబ్‌లోని గోశాల షెల్టర్‌లో 20ఆవులు మృతి

### అస్వస్థతకు గురైన మరో 28 ఆవులు.. బంద్ పిలుపు 'సంపూర్ణం'

**ఫగ్వారా(పంజాబ్):** ఫగ్వారాలోని శ్రీకృషన్‌గోశాల ఆశ్రయం(షెల్టర్)లో 20 ఆవులు చనిపోగా, 28ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. ఆవుల దాణా విషపూరితంగా ఉన్న కారణంగానే ఆవులు చనిపోయాయని ఆరోపిస్తూ సోమవారం బంద్‌కు పిలుపు ఇచ్చిన వివిధ హిందూ సంఘాల నిరసనలకు కారణమయ్యాయి.ఈఘటన వెనకఎలాంటి దురుద్దేశం లేదని అధికారులు తెలిపారు.ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సోమవారం పోలీస్ అధికారిణి చెప్పారు. ఫగ్వారా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రూపిందర్ కౌర్ భట్టి మాట్లాడుతూ శ్రీకృషన్ గోశాల వద్ద ఆదివారం రాత్రి 20ఆవులు చనిపోయాయని, 28సఅస్వస్థతకు గురయ్యాయని తెలిపారు. గుర్ అంగడ్‌దేవ్ వెటర్నరీ, యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ(జిఎడివిఎస్‌యు)కి చెందిన వెటర్నేరియన్స్ బోర్డు మృతిచెందిన ఆవుల కళేబరాలకు పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తున్నారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక వచ్చిన తర్వాతనే వాటి మరణానికి గల కారణాలు తెలుస్తాయని భట్టి చెప్పారు. ఈ సంఘటన వెనక ఎలాంటి దురుద్దేశం ఉన్నదనే విషయాన్ని మేం ఇంకా కనుగొనలేదని, కానీ ఈ సంఘటనపై అన్ని కోణాలలో విచారణ జరుపుతున్నామని ఆమె చెప్పారు. ఆవుల మృతి వెనక దురుద్దేశ కారణాలు ఏమైనా దాగిఉన్నాయా అనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు గోశాలలో ఉన్నటువంటి సిసిటివి పుటేజీని నిశితంగా గమనిస్తున్నామని రూపిందర్ కౌర్ భట్టి తెలియజేశారు. అస్వస్థతకు గురైన ఆవులకు వెటర్నరీ డాక్టర్ల బృందం చికిత్స చేస్తున్నదని వివరించారు. ఆవులషెల్టర్ మేనేజర్ సత్నామ్ సింగ్ అందజేసిన ఫిర్యాదుపై కేసు రిజిస్టర్ చేశామన్నారు. ఇదిలాఉండగా ఈ ఘటనను ఆక్షేపిస్తూ హిందూ సంఘాలునిరసన బంద్‌పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఆవులకు ఇచ్చే దాణాలో విషం కలిపినందువల్లే చనిపోయాయని హిందువుల సంఘాల ఆరోపిస్తూ నిందితులను అరెస్ట్ చేయాలని డిమా ండ్ చేశారు. సోమవారం ఇచ్చిన బంద్ పిలుపు సందర్భంగా పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల కార్యకర్తలు పాల్గొని మార్కెట్లను బంద్‌చేయించి నిరసన తెలిపారు. మాజీ కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులైన సోమ్ ప్రకాష్, విజయ్‌సాంప్లా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపి రాజ్‌కుమార్ చబ్బేవాల్, ఇతర నాయకులు ఆవుల షెల్టర్‌ను సందర్శించారు.

## జంతర్‌మంతర్ వద్ద మణిపూర్ ఇండియా కూటమి పార్టీలు ఆందోళన

### రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించాలని, సిఎంను బర్తరఫ్ చేయాలని డిమాండ్




**న్యూఢిల్లీ :** హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ప్రధాని మోదీ పర్యటించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం రాష్ట్రానికి చెం దిన ఇండియా కూటమి పార్టీలు ఆందోళన చేశారు. ఘటనలకు నైతిక బాధ్యత వహించి హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్‌ను బర్తరఫ్ చేయాలని కేంద్రంపై ఒత్తిడితేస్తూ మణిపూర్‌లో శాంతి, సాధారణ స్థితిని తక్షణం పునరుద్ధరింప జేయాలని జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన నిర్వహించాయి, గత 19 నెలలు నుంచి మణిపూర్ అల్లర్లతో తగులబడుతోందన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్, ,సిపిఐ ప్రధాన కార్యదర్శి డి?రాజా సహా పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనంతగా గం దరగోళం పరిస్థితులు నెలకొన్నాయని, కర్ఫ్యూ కొనసాగుతోందని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారని, నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయని, ఔషధాలు కొరత ఏర్పడిందని, హింస, రోడ్ల దిగ్బంధనం కొనసాగుతోందని, దోపిడీ పెరుగుతోందని జైరామ్ రమేష్ ఎక్స్ పోస్ట్‌లో ఆరోపించారు. జీవించే హక్కు, ఆస్తిపై 'పూర్తి ఉల్ల ంఘన' జరిగిందని విమర్శించారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వృత్తిపరమైన సంస్థల సజావుగా పనిచేయడానికి పూర్తిగా అడ్డంకులు ఏర్పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. మణిపూర్‌లోని ఇండియా కూటమి తమ డిమాండ్లు నెరవేరడం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు రమేష్ తెలిపారు. మణిపూర్ ప్రాదేశిక సమగ్రతను ప్రభావితం చేయకుండా రాష్ట్రంలో శాంతి, సాధారణ స్థితిని తక్షణమే పునరుద్ధరించడానికి ప్రధాన మంత్రి మణిపూర్‌ను అత్యవసరంగా సందర్శించాలన్నదే ఇండి యా కూటమి డిమాండ్లు అని రమేష్ చెప్పారు. 'మణిపూర్‌లో కొనసాగుతున్న అల్లకల్లోలానికి, రాష్ట్రంలో 19నెలలుగా కొనసాగుతున్న హింసకు భారత ప్రధాని బాధ్యత వహించాలి. గత 19గా మణిపూర్‌లో ప్రస్తుతం జరుగుతున్న హిం సను ఎదుర్కోవడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహించి కేంద్ర హోంమంత్రి తక్షణమే రాజీనామా చేయాలి. గత 19 నెలలుగా మణిపూర్ మండుతూనే ఉం డటానికి కారణమైన మణిపూర్ ముఖ్యమంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలి' అని మణిపూర్ ఇండియా కూటమి డిమాండ్లను ఉటంకిస్తూ రమేష్ పేర్కొన్నారు.శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు, మణిపూర్‌లోని ఇండియా కూటమి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. కాగా, మణిపూర్‌కు చెందిన ఇండియా కూటమి పార్టీలు శుక్రవారం నాడు హింసాత్మక రాష్ట్రాన్ని వీలైనంత త్వరగా సందర్శించాలని ప్రధాని మోదీని కోరిన విషయం తెలిసిందే.

## పంజాబ్‌లో రైతుల రోడ్ల దిగ్బంధాన్ని తొలగించేలా ఆదేశాల జారీ

### అభ్యర్థనను 'సుప్రీం' తిరస్కృతి
### ఇలాంటి రిపిటేటివ్ పిటిషన్లు దాఖలు చేయొద్దని పిటిషనర్‌పై ధర్మాసనం ఆగ్రహం

న్యూఢిల్లీ : పంజాబ్‌లోని జాతీయ, రాష్ట్ర రహదారులపై రైతులు నిరసన చేపడుతూ రోడ్ల దిగ్బంధం చేస్తున్నారని, వాటిని మధ్యవర్తిత్వంతో తొలగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కంత్, మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ సందర్భంగా ఈ విషయం ఇప్పటికే కోర్టు వద్ద పెండింగ్ ఉన్నదని, ఇదే సమస్యపై ఈ తరహా పిటిషన్లను అనుమతించలేమని బెంచ్ స్పష్టం చేసింది. 'మేం ఇప్పటికే ఈ అతిపెద్ద సమస్యను పరిశీలిస్తున్నాం. మీరు ఒక్కరే ఈ సమాజం మన:స్సాక్షి సంరక్షకుడు కాదు. ఇలాంటి తరహా పిటిషన్లనను దాఖలు చేయవద్దు. కొంతమంది ప్రచార ప్రయోజనాల కోసం పిటిషన్లు దాఖలు చేస్తే, మరికొందరు గ్యాలరీ ఆటకోసం పిటిషన్లు దాఖలుచేస్తున్నారు. ఒకే సమస్యపై ఇలాంటి రిపిటేటివ్ పిటిషన్లను దాఖలు చేయవద్దు' అని ధర్మాసనం సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న పంజాబ్‌కు చెందిన పిటిషనర్ గౌరవ్‌లూథ్రాను మందలించింది. పిటిషన్‌ను ఈ పెండింగ్ విషయంతో ట్యాగ్ చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) బ్యానర్ల కింద రైతులు ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య శంభుకనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద నిరసనలు తెలియజేస్తున్న విషయం విదితమే. దేశ రాజధాని ఢిల్లీకి వారు చేపడుతున్న మార్చ్‌ని భద్రతా బలగాలు నిలిపివేశాయి. రైతులు, వారి యూనియన్లు పంజాబ్‌లోని జాతీయ, రాష్ట్ర రహదారులను నిరవధికంగా దిగ్బంధం చేస్తున్నారని పిటిషనర్ తన అభ్యర్థనలో ఆరోపించారు. దీనిపై ఆదేశాలు జారీచేయాలని సుప్రీంకోర్టును కోరగా బెంచ్ తిరస్కరించింది.

## ఆప్ 2వ జాబితాలో 18మంది సిట్టింగ్‌లకు ఉద్వాసన

### మరో కొత్త నియోజకవర్గం నుంచి మనీష్ సిసోడియా పోటీ




**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇప్పటికే తొలి జాబితాను విడుదల చేయగా తాజాగా సోమవారం 20 మంది అభ్యర్థులతో రెండవ జాబితాను విడదల చేసింది. అయితే అందులో 18 మంది సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు ఉద్వాసన పలకగా, ఇద్దరికి స్థానం చలనం కలిగించింది. పార్టీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా కొత్త నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. సిసోడియా ఇప్పుడు జంగ్‌పురా నుంచి పోటీ చేయనుండగా, విద్యావేత్త , ఇటీవల ఆప్‌లో చేరిన అవధ్ ఓజా సిసోడియా పట్‌పర్ గంజ్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. తనకు రాజకీయాలు విద్య, నిజాయితీ, ప్రజా సంక్షేమానికి సాధనాలని, జంగ్‌పురాలోనూ పట్‌పర్‌గంజ్‌లో చేసిన పనిని పునరావృతం చేయడానికి సిద్ధంగా ఉన్నానని సిసోడియా పేర్కొన్నారు. సిసోడియాకు మరో సీటు కేటాయించడంపై ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ మనీష్ సిసోడియా ఢిల్లీలో ఎక్కడైనా గెలవగల సమర్థుడని ప్రశంసించారు. రెండవ జాబితాలో అభ్యర్థిగా పేర్కొనబడిన మరో ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లాను మంగోల్‌పురి నుండి మాదిపూర్‌కు మార్చారు. ఆమె ప్రస్తుతం స్థానం నుంచి రాకేష్ జాతవ్ ధర్మరక్షక్ పోటీ చేయనున్నారు. మాదిపూర్ ఎమ్మెల్యే గిరీష్ సోనీని తప్పించారు. నరేలా ఎమ్మెల్యే శరద్ కుమార్ చౌహాన్ స్థానంలో దినేష్ భరద్వాజ్, తిమార్పూర్ ఎమ్మెల్యే, అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ దిలీప్ కె పాండే స్థానంలో సురేంద్ర పాల్ సింగ్ బిట్టును నియమించారు. పవన్ శర్మ స్థానంలో ఎంసిడిలో సభాపక్ష నాయకుడు ముఖేష్ గోయెల్ ఆదర్శ్ నగర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. ముండ్కాలో ధరంపాల్ లక్రా స్థానంలో జస్బీర్ కరాలా ఎంపికయ్యారు. 2020లో బిజెపికి చెందిన విజేందర్ గుప్తా చేతిలో ఓడిపోయిన రోహిణి నియోజకవర్గం నుంచి ప్రదీప్ మిట్టల్ బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన దీపు చౌదరికి గాంధీనగర్ టిక్కెట్ లభించింది. రాఖి బిడ్లాన్‌కు మదిపూర్, ప్రవీణ్ కుమార్‌కు జానక్‌పురి టిక్కెట్ లభించింది. 18 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు రెండో జాబితాలో చోటు దక్కలేదు. వారిలో శరద్ చౌహాన్, దిలీప్ పాండే, పవన్ శర్మ, ధర్మపాల్ లక్ర, ప్రహ్లాద్ సింగ్ సాహ్నీ, గిరీష్ సోని, రాజేష్ రిషి, భూపిందర్ సింగ్ జూన్, భావనా గౌర్, ప్రకాష్ జార్వాల్, రోహిత్ కుమార్ మెహ్రౌలియా, ఎస్‌కే బగ్గా, హాజి యూనుస్ ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ 11 మంది అభ్యర్థులతో ఇటీవల తొలి జాబితాను విడుదల చేసింది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి 2025 ఫిబ్రవరికి ముందే ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.

## ప్రతిపక్షాల మాక్ ఇంటర్వ్యూ పార్లమెంట్ మకరద్వారం వద్ద మళ్లీ ఆందోళన



**న్యూఢిల్లీ :** అదానీ వివాదంపై ఇండియా కూటమి పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు సోమవారం కూడా పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఆందోళన చేశారు. ప్రధాని నరేంద్రమోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మాస్క్‌లను ధరించి అదానీ వివాదంపై కాంగ్రెస్ సభ్యులతో కలిసి ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాక్ ఇంటర్వ్యూ నిర్వహించారు. పార్లమెంట్ మకరద్వారం వెలుపల ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర ప్రతిపక్షపార్టీలకు చెందిన ఎంపిలు నిలబడి 'మోదీ, అదానీ ఎక్ హై, తమకు న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపు పెద్ద ఎత్తున నినదించిన తరువాత కాంగ్రెస్ నేతలతో కలిసి రాహుల్‌గా ంధీ మాక్ ఇంటర్వ్యూ నిర్వహించారు. పార్లమెంటును ఎందుకు అనుమతించడం లేదని అ దానీ మాస్క్ ధరించిన పార్టీ సభ్యుడిని రాహుల్ ప్రశ్నించగా, కాంగ్రెస్ ఎంపి మాట్లాడుతూ తా ము అమిత్ భాయ్‌ను అడిగాలని, అయితే ఆయ న కనిపించడం లేదని జవాబిచ్చారు. మోదీ, అదానీ మధ్య ఏమిటి సంబంధం అని రాహుల్ ప్రశ్నించగా, కాంగ్రెస్ ఎంపి బదులిస్తూ తాము ఇద్దరం ఒక్కటేనన్నారు. అదానీ మాస్క్ ధరించిన కాంగ్రెస్ సభ్యు డు మాట్లాడుతూ తాను ఏది కా వాలన్నా అది విమానాశ్రయమే కావచ్చు, ఇంకా ఏదైనా కావచ్చి దానిని మోదీ ఇచ్చేసాడన్నారు. మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారనే దానిపై కాంగ్రెస్ ఎంపి అదానీలా ఫోజులిస్తూ 'ఈరోజు ల్లో ఈ వ్యక్తి టెన్షన్‌లో ఉన్నాడు' అంటూ నవ్వు లు పూయించారు. మీ తదుపరి ప్రణాళిక ఏమి టి, ఇప్పుడు ఏమి కొనాలని ప్రతిపాదించారు అ ని అదానీ ముసుగు ధరించిన కాంగ్రెస్ ఎంపిని అడగగా, 'మేము ఇంకా నిర్ణయించుకోలేదు, ఈ సాయంత్రం మీటింగ్ ఉం ది' అని అన్నారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పా ర్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు నిరసనలో పాల్గొనలేదు. అయితే, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ, కొంతమంది నాయకులు గైర్హాజరు కావడం గురించి పెద్దగా ఏమీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ప్రతిపక్ష కూటమిలో 'అంతా బాగానే ఉంది' అని స్పష్టం చేశారు. వామపక్షాలు, డిఎంకె, శివసేన (యుబిటి), ఆర్‌జెడి, ఎన్‌సిపి ఎంపిలు నినాదాలు చేస్తూ అదానీ గ్రూప్‌పై చర్చించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ సెక్రటేరియట్ మెట్లపై నిరసన చేయకూడదని సూచించినప్పటికీ పార్లమెంటు మకర ద్వారం మెట్ల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ అంశంపై విపక్షాల ఆందోళనలు పార్లమెం ట్ ఆవరణలో కొనసాగుతున్నాయి. అమెరికా కోర్టులోఅదానీ,ఇతర కంపెనీ అధికారులపై అభియోగాలు మోపిన నేపథ్యంలో కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్షాలు సంయుక్త పార్లమెంటరీ కమి టీ (జెపిసి) విచారణను డిమాండ్ చేస్తున్నాయి.

## విశ్వాస పరీక్షలో నెగ్గిన ఫడ్నవీస్ సర్కార్

**ముంబయి :** దేవేంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని 'మహా యుతి' కూటమి ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో జరి గిన విశ్వాస పరీక్షలో నెగ్గి ంది. ఏక్‌నాథ్ షిండే నాయక త్వంలోని శివసేన ఎమ్మెల్యే ఉదయ్ సామంత్, ఎన్‌సిపి నేత దిలీప్ వాల్సే పాటిల్, బిజెపి నేత సంజయ్ కుటే తదితరులు అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవే శపెట్టారు. మూజువాణి ఓటుతో విశ్వాస తీర్మానాన్ని సభ ఆమోదించింది. 237 మంది ఎమ్మెల్యేలు విశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. విశ్వాస తీర్మానం మెజారిటీతో సభామోదం పొందినట్టు అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ ప్రకటించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ డిసెంబర్ 5న ప్రమాణ స్వీకారం చేశారు. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఉపముఖ్య మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముంబై ఆజాద్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. కాగా, అధికారికంగా డిసెంబర్ 7 నుంచి మహారాష్ట్ర 15వ లెజిస్లేటివ్ అసెం బ్లీ పదవీకాలం ప్రారంభమైంది. 288 మంది సభ్యుల అసెంబ్లీలో 230 మంది సభ్యుల బలం 'మహాయుతి'కి ఉండటంతో లాంఛప్రాయంగా సభా విశ్వాసం నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్‌గా నార్వేకర్ నియమితులు కావ డంతో, చిన్న పార్టీలు, స్వతంత్ర్య ఎమ్మెల్యేలతో కలిసి మహాయుతి కూటమికి అసెంబ్లీలో 229 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విపక్ష 'మహా వికాస్ అఘాడి'లోని ఉద్ధవ్ థాకరే శివసేన (యుబిటి)కి 20, కాంగ్రెస్‌కు 16, శరద్ పవార్ ఎన్‌సిపి (ఎస్‌పి)కి 10 మంది సభ్యుల బలం ఉంది. సమాజ్ వాదీ పార్టీకి 2, పిడబ్ల్యుపి, ఎఐఎంఐఎంకు ఒక్కో సభ్యుడు ఉన్నారు.

## ఆస్తుల దగ్ధం, లూటీ, ఆక్రమణల సంఖ్య వివరాలు ఇవ్వండి

### మణిపూర్ హింసపై సమగ్ర సీల్డ్ కవర్ నివేదిక అందజేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ' సుప్రీం' ఆదేశం
### తదుపరి విచారణ 2025, జనవరి 20కి వాయిదా

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో జరుగుతున్న జాతి హింసాకాండలో పూర్తిగా లేదా పాక్షికంగా చోటు చేసుకున్న ఆస్తులు పూర్తి లేదా పాక్షిక దగ్ధం వివరాలు, లూటీ, ఆక్రమణలకు సంబంధించిన ఆస్తుల సంఖ్యపై సవివరమైన సీల్డ్‌కవర్ నివేదికను అందజేయాలని సుప్రీంకోర్టు సోమవారం మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ సందర్భంగా మణిపూర్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. నిర్వాసితుల ఫిర్యాదులను పరిష్కరించి, వారి ఆస్తులను పునరుద్ధరించడానికి తగిన చర్యలను తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా ప్రాతినిథ్యం వహిస్తున్న మణిపూర్ ప్రభుత్వానికి 'పూర్తిగా లేదా పాక్షికంగా అగ్నిప్రమాదాలకు గురైన భవనాలు , భవనాల దోపిడీ, భవనాలలోనికి అనుమతిలేనిదే ప్రవేశించడం, ఆక్రమించడం తదితర నిర్దిష్టమైన వివరాలను అందజేయాలి' అని కోరింది. ఈ ఆస్తుల యజమానులు, ప్రస్తుత నివాసితుల గురించి అక్రమార్కులపై తీసుకున్న చట్టపరమైన చర్యల వివరాలతో పాటుగా నివేదికను అందించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తుషార్‌మెహ్‌తాకు తెలియజేశారు.మేము ఈ కింది వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. (1) కాలిపోయిన, పాక్షికంగా కాలిపోయిన భవనాలు, (2) లూటీ చేయబడిన భవనాలు (3) అనుమతిలేనిదే భవనాలలోకి ప్రవేశించడం, ఆక్రమణలకు పాల్పడినవి' అని సుప్రీం కోర్టు తన ఆర్డర్‌లో పేర్కొంది. వీటన్నింటిలో ఆస్తిని ఆక్రమించిన వ్యక్తి పేరు, చిరునామా వివరాలను తెలియజేయాలని, అక్రమంగా చొరబడిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అయితే ఆ జాబితాను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. 'ఏ తరహా క్రిమినల్ చర్యలు తీసుకోవాలనేది (ఆస్తుల ఆక్రమణదారులను) మీరు నిర్ణయం తీసుకోండి. ఆక్రమణ వినియోగానికి 'మెస్నే ప్రాఫిట్స్' చెల్లించాలని మీరు అడగాలి. దానిపై మీరు నిర్ణయం తీసుకోవాలి' అని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది. మెస్నే లాభాలు అనేది చట్టవిరుద్ధంగా ఆధీనంలో ఉన్న వ్యక్తి ఆస్తి యొక్క నిజమైన యజమానికి చెల్లించే పరిహారం. 'మెస్నే ప్రాఫిట్' పై స్పందించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జమ్ముకశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులను తాత్కాలిక, శాశ్వత హౌజింగ్ నిధుల విడుదల సమస్యను ప్రస్తావిస్తూ ఫ్లాగ్ చేసింది. న్యాయమూర్తుల కమిటీ తరపున హాజరైన విభా మఖిజా మాట్లాడుతూ కొంతమంది అధికారుల మద్దతుతో నిర్వాసితులైనవారి పునరావాసం, నైపుణ్యాలను పెంపొందించడం తరహా అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సంక్షోభ సమస్యను పరిష్కరించడానికి 2023 నుండి కమిటీ 34 నివేదికలను అందజేసిందని తెలిపారు. దాని ఉచిత ప్రయత్నాలను ప్రశంసించిందని మఖీజా వివరించారు. తదుపరి పరిష్కార మార్గాలను సులభతరం చేయడానికి కమిటీ నివేదికలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, మణిపూర్ ప్రభుత్వంతో పంచుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. మీడియాలో తప్పుడు వ్యాఖ్యానంపై మెహ్‌తా ఆందోళన లేవనెత్తిన తర్వాత సిజెఐ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం కోల్పేయేలా మేం ఎటువంటి ప్రకటనలు చేయలేదని తెలిపారు. అనంతరం ధర్మాసనం దీనిపై జనవరి 20, 2025కు తదుపరి విచారణ తేదీని నిర్ధారించింది.

## న్యాయం కావాలని అర్థిస్తున్న రైతులు

### ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ :** నరేంద్రమోదీ ప్రభుత్వం తమకు పదే పదే ద్రోహం చేసినందువల్లే రైతులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిందిం చారు. జరిగిన అన్యాయంపై గళమెత్తే హక్కును వారి నుంచి మోదీ ప్రభుత్వం దూరం చేయలేదని హెచ్చ రించారు. రైతు కుటుంబాలు మళ్లీ మళ్లీ ఢిల్లీ గుమ్మానికి ఎందుకు రావాలని ఖర్గే ప్రధాని మోదీని ప్రశ్నిం చారు. 'ఈరోజు (సోమవారం) మీరు హర్యానా, రాజస్థాన్ రాష్ట్రలలో పర్యటనలో ఉన్నప్పుడైనా వ్యవ సాయ పోరాటాలను అర్థం చేసుకోవడానికి కచ్చితంగా ప్రయత్నిస్తారని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. మీ ప్రభుత్వం పదేపదే ద్రోహం చేసినందువల్లే రైతులు న్యాయం కోసం వేడుకుంటున్నారు' అని మల్లికార్జున ఖర్గే సోమవారం తన 'ఎక్స్' పోస్ట్ హిందీలో పేర్కొన్నారు. 2022సంవత్సరం నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయని ద్రోహం, స్వామినాథన్ నివేదిక ప్రకారం ఇన్‌పుట్ కాస్ట్ + 50% కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని అమలుచేయకపోవడం, ఎంఎస్‌పికి హోదా కల్పించేందుకు కమిటీ వేసినా చర్యలు తీసుకోకపోవడం ద్రోహం కాక మరేమిటని ఖర్గే నరేంద్రమోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. సరిపడా కొనుగోళ్లు జరగడం లేదని, సరసమైన ధరలకు కొనుగోళ్లు జరగడం లేదని, పైగా డిఎపి ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మల్లికార్జున్‌ఖర్గే మోదీపై నిప్పులు చెరిగారు.ప్రధానమంత్రి మోదీ రైతుల బాటలో ముళ్లవల వేసి, ఢిల్లీ సరిహద్దును కంటోన్మెంట్‌గా మార్చారని ధ్వజమెత్తారు. వారి శాంతియుత యాత్రను టియర్‌గ్యాస్‌తో ఆపేందుకు ప్ర యత్నించారని, ఇంతకుముందు రైతులపై బుల్లెట్ల వర్షం కురిపించి, వారిపై లాఠీలను ప్రయోగించడం ఆక్షేపణీయమని ఖర్గే అన్నారు. పార్లమెంట్‌లో రైతులను 'ఆందోళన జీవి'అని వ్యాఖ్యానిస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. 750మంది అమరులైన రైతులకోసం ప్రధానమంత్రి మోదీ రెండు నిమిషాలు మౌనం పాటించడం సముచితంగా భావించడంలేదని ఖర్గే ఆరోపించారు.

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, డిసెంబరు 10

# సిరియాలో ప్రయాణం ఎటు?

సిరియాలో దీర్ఘకాల అంతర్యుద్ధంలో కంపన సహిత పరిణామాలు సంభవించాయి. తిరుగుబాటుదారులు పక్షంరోజుల్లోనే రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవటం, అధ్యక్షుడు బషీర్ అల్ – అస్సాద్ దేశం వదిలి పలాయనం చిత్తగించటంతో 13 ఏళ్లుగా సాగుతున్న అంతర్యుద్ధం ముగింపుకు వచ్చిందని భావించవచ్చు. ప్రపంచ అగ్రరాజ్యాల ఆధిపత్య రాజకీయ వ్యూహాలు – ఎత్తుగడల చదరంగంగా దీర్ఘకాలంగా కొనసాగుతున్న పశ్చిమాసియాలో రాజకీయశక్తుల పొందికలో, ఆధిపత్యరాజ్యాల పలుకుబడి ప్రభావంలో ఎన్నో మార్పులకు ఈ పరిణామం దారితీయవచ్చు. సిరియాలో తీవ్రవాద ఇస్లామిక్ సంస్థ హయత్ తహ్‌రిర్ అల్–షామ్ నాయకత్వంలో తిరుగుబాటుదారుల కూటమి అధికారం చేజిక్కించుకుంది. అంతర్యుద్ధం విజృంభించిన గత దశాబ్దంలో రష్యా, అమెరికా, ఇరాన్, టర్కీ ప్రత్యక్ష సహాయ సహకారాలతో సాగిన హింసాకాండ, విధ్వంసంతో పోల్చుకుంటే ఇస్లామిస్టుల అంతిమదాడిలో జరిగిన నష్టం బహుతక్కువ. సిరియా ప్రభుత్వ సైన్యాలు పెద్దగా ప్రతిఘటన లేకుండానే లొంగిపోయాయి. ఉక్రేన్‌తో ప్రత్యక్షంగా, నాటోతో పరోక్షంగా యుద్ధంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మిత్రదేశం రష్యా ఏ విధంగానూ సిరియా అధ్యక్షుడు అస్సాద్‌కు అండగా రాలేకపోయింది. లెబనాన్‌లోని హిజ్‌బుల్లా తీవ్రవాదుల స్థావరాలపై బాంబుదాడులతోపాటు దాని ముఖ్యనేతలను ఏరికోరి చంపిన ఇజ్రాయిల్ దురాగతాలను అడ్డుకోవటంలో, పోరాట విరమణ ఒప్పందం సాధించటంలో తలమునకలుగా ఉన్న ఇరాన్ సిరియాకు ఆపన్నహస్తం అందించలేకపోయింది. మరోవైపున కుర్దిస్థాన్ అంశంతో టర్కీ సిరియాను ఇబ్బందిపెడుతూనే ఉంది. అమెరికా తటస్థంగా ఉన్నట్లు కనిపించినా అది అసాద్‌కు బద్ధవ్యతిరేకి, టెర్రరిస్టు ముద్ర ఉన్న తిరుగుబాటుదారులను సమర్థించనూలేని సందిగ్ధంలో ఉంది. పైగా అమెరికాలో పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వం, 40రోజుల్లో అధికారంలోకి రానున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధ విధానాలమధ్య వైరుధ్యం ఉంది. 'అది మన యుద్ధం కాదు' అన్నది ట్రంప్ వైఖరి. కాబట్టి సిరియాలో అసాద్ ప్రభుత్వ పతనంతో లాభపడింది ఇజ్రాయిల్.

సిరియా వివాదంలో వచ్చిన మలుపు పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాలపై విస్తృత ప్రభావం చూపుతుంది. అధికార శూన్యత తీవ్రవాద గ్రూపులకు ప్రోత్సాహకారి కావచ్చు. అవి పొరుగుదేశాల్లో అస్థిరీకరణకు ప్రయత్నించవచ్చు. శాంతి పునరుద్ధరణకు జరిగే అంతర్జాతీయ ప్రయత్నాలకు ఇబ్బందులు కలిగించవచ్చు. తిరుగుబాటు గ్రూపుల్లో ఒకటైన 'సిరియన్ నేషనల్ ఆర్మీ'కి టర్కీ తోడ్పాటు ఉంది. ఇరాక్, లెబనాన్ వంటి ప్రాంతీయ పాత్రధారులు తమ భద్రతా ప్రయోజనాల రీత్యా సిరియా పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నాయి. గల్ఫ్ దేశాలు ముఖ్యంగా కటార్, సౌదీ అరేబియా ప్రతిపక్ష గ్రూపులను బలపరుస్తున్నాయి.

భవిష్యత్‌లో ఏమి జరగబోతుందో సిరియన్‌లలో ఎన్నో సందేహాలున్నాయి. లెబనాన్, ఇరాక్, ఎమెన్, లిబియా వంటి దేశాల్లో సాయుధ మిలీషియాలు అధికారం చేజిక్కించుకోవటంలో సఫలమైనాయి కాని సమర్థవంతమైన పాలన అందించలేక సతమతమవుతున్నాయి.

అస్సాద్ ప్రభుత్వ పతనంతో సిరియాలో ఇస్లామిస్టులు పైచేయి సాధించారు. ఇస్లామిక్ కోయిలేషన్ అనే సంకీర్ణంలో హయత్ తహ్‌రిర్ అల్–షామ్ (హెచ్‌టిఎస్) బలమైన గ్రూపు. సిరియన్ నేషనల్ ఆర్మీ వివిధ భావజాలాలు గల డజన్లకొలది గ్రూపుల సమ్మేళనం. దీనికి టర్కీ నుండి నిధులు, ఆయుధాలు లభిస్తున్నాయి. షరియా ప్రకారం ఇస్లామిక్ రాజ్యం ఏర్పాటు చేయటం లక్ష్యంగాగల తహ్‌రిర్ అల్–షామ్ మరో భాగస్వామి. ఈ గ్రూపుల్లో కొన్ని కుర్దిష్ దళాలపై పోరాటం చేయటం పరిస్థితిని గందరగోళ పరుస్తున్నది.

ఐరాస, అమెరికా, టర్కీ తదితర దేశాలు హెచ్‌టిఎస్‌ను టెర్రరిస్టు సంస్థగా ముద్రవేశాయి. హెచ్‌టిఎస్ 2011లో అల్‌ఖైదాకు నేరుగా అనుబంధంగా జబ్బత్ అల్–నుస్రా అనే కొత్త పేరు పెట్టుకుంది. దాని నాయకుడు అబు మహమ్మద్ అల్–జూలాని 2016 లో అల్–ఖైదాతో సంబంధాలు తెంచుకుని అల్–నుస్రాను రద్దు చేశారు. హయత్ తహ్‌రిర్ అల్ –షామ్ పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేశాడు. ప్రధానమంత్రి సామరస్యంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు తిరుగుబాటుదారులను ఆహ్వానించారు. పశ్చిమాసియాపై ప్రభావం చూపే సిరియా పరిణామాలు ఆసక్తితో గమనించదగినవి.

# అయోధ్య తీర్పు విస్మరణ – కొత్త వివాదాలు!

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

సరిగ్గా 32 ఏళ్ళ క్రితం, 1992 డిసెంబర్ 6న అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేశారు. కూల్చివేసిన చోట రామమందిరాన్ని నిర్మించాలని సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం 2019 నవంబర్ 19న తీర్పునిచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 జనవరి 22న రామ మందిరాన్ని ప్రారంభించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా హిందూ, ముస్లింల మధ్య తీవ్ర మతతత్వ ఉద్రిక్తతలను సృష్టించేందుకు, సామరస్యతను చెడగొట్టే దాడులకు అనేక మసీదులు, దర్గాలు (ముస్లింల ఆరాధన ప్రదేశాలు) కొత్త లక్ష్యాలుగా మారాయి. ఇవి అయోధ్య తీర్పుతో ఏర్పడిన ఆకాంక్షలకు విరుద్ధంగా జరుగుతున్న పరిణామాలు.

అయోధ్య రామ జన్మభూమి – బాబ్రీ మసీదు అంశాన్ని 1989 లో బిజెపి తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చినప్పటి నుంచి 35 ఏళ్ళకు పైగా రాజకీయ అంశంగా కొనసాగింది. ఆ పార్టీ మ్యానిఫెస్టోలో "1948లో భారత ప్రభుత్వం సోమనాథ మందిరం నిర్మించిన తరహాలోనే అయోధ్య రామమందిరాన్ని పునర్ నిర్మించేందుకు అనుమతించకపోవడం ద్వారా అది (ప్రభుత్వం) ఉద్రిక్తతలను పెంచేందుకు అనుమతించింది. తద్వారా సామాజిక సామరస్యత తీవ్రంగా దెబ్బతిన్నది." అయినప్పటికీ, దేశంలోని ప్రస్తుత పరిస్థితి వారిని సమర్థించలేకపోవచ్చు. రామ మందిరంపై రాజకీయాలు కొనసాగాయి. 1990లలో లాల్ కృష్ణ అద్వానీ చేపట్టిన రథయాత్రకు భారీ స్పందన లభించిన తర్వాత బిజెపి ఆ అంశాన్ని 1991 ఎన్నికల్లో రాజకీయ ప్రచారాస్త్రంగా మలుచుకుంది. 2024 బిజెపి మ్యానిఫెస్టోలో మందిర నిర్మాణంతో "ప్రజల ఐదు శతాబ్దాల స్వప్నం" వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు.



మతతత్వ ఉద్రిక్తతలను సృష్టించడం, రెచ్చగొట్టడాన్ని నిలిపి వేయాల్సింది. కానీ, బిజెపి సైద్ధాంతిక మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలపై హైడ్రా మాదిరిగా దాని బహుముఖ మతతత్వవాదులపై నియంత్రణ లేకపోయింది. వారు కాశీ, మథురలోని మసీదు, దర్గాల ను లక్ష్యంగా చేసుకొని, అక్కడ మందిరాలను నిర్మించాలనే పాత డిమాండ్‌లను ముందుకు తీసుకువస్తున్నారు. సోమనాథ మందిరం నిర్మాణ సమయంలో ఇతర మసీదులు, దర్గాలను లక్ష్యంగా చేసుకోవద్దని హిందూ, ముస్లిం సమూహాల మధ్య అవగాహన కుదిరింది. అయోధ్య తీర్పు సందర్భంగా సుప్రీం కోర్టు ప్రార్థనా ప్రదేశాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991ని సమర్థిస్తూ, ఇది భారత రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని పరిపూర్తి చేసినట్లుగా ప్రకటించింది.

ఈ శక్తుల దాడి ఎక్కుపెట్టిన అనేక లక్ష్యాలలో ఎక్కువగా ప్రచారంలో ఉన్నవి ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలోని టీలేవాలి మసీదు, ఢిల్లీ కుతుబ్ మినార్‌లోని ఖువ్వత్ ఉల్ ఇస్లాం మసీదు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని జ్ఞానవాపీ మసీదు, మధ్యప్రదేశ్ భోజశాల కాంప్లెక్స్‌లోని కమాల్‌మౌలా మసీదు, ఉత్తర్‌ప్రదేశ్ బదౌన్‌లోని శంషీ షాహీ మసీదు, జౌన్‌పూర్‌లో అతాలా మసీదు, మథురలోని షాహీ ఈద్గా మసీదు, సంభల్‌లోని జామా మసీదు, ఫతేపూర్ సిక్రీలోని షేఖ్ సలీం చిస్తీ దర్గా, రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గా.

అయోధ్య తీర్పును వెలువరించిన ఐదుగురు న్యాయమూర్తులు – జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ డాక్టర్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన నాలుగు నెలలకే జస్టిస్ గొగొయ్‌ను 2022 మార్చిలో బిజెపి రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేసింది. మసీదును కూల్చివేసిన ప్రదేశంలో మందిరాన్ని నిర్మించేందుకు అనుమతిస్తూ ఇచ్చిన తీర్పును అనేక రిటైర్డ్ న్యాయమూర్తులు విమర్శించారు. ఆ తీర్పు 'న్యాయం పట్ల గొప్ప అధిక్షేపణ' అని, 'లౌకికవాదానికి దక్కాల్సింది దక్కలేదు' అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్ వ్యాఖ్యానించారు.

అయినప్పటికీ, మతతత్వ ఉద్రిక్తతలు, వైరుధ్యాలకు ముగింపు పలికేందుకు సంబంధించినంత వరకు ప్రార్థనా ప్రదేశాల చట్టాన్ని సమర్థించటం అయోధ్య తీర్పులోని ముఖ్య అంశాలలో ఒకటి. అయితే, ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ 2022లో తీవ్రమైన పొరపాటు చేశారు. అయోధ్య తీర్పులోని అసలైన అంశాలైన ప్రార్థనా ప్రదేశాల చట్టం, భారత రాజ్యాంగాన్ని గమనంలోకి తీసుకోలేదు.

ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట 2022లో వచ్చిన కాశీ జ్ఞానవాపీ మసీదు కేసులో ప్రార్థనా ప్రదేశాల చట్టం 1991 'కట్టడం ఉపయోగించుకుంటున్న తీరును మార్చవద్దన్నప్పటికీ, దాని మతపరమైన స్వభావాన్ని నిర్ధారించటాన్ని నిషేధించలేదని' వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య మసీదులు, దర్గాలకు వ్యతిరేకంగా కేసుల వరదకు గేట్లు తెరిచినట్లయింది. అది చివరకు మతఘర్షణలకు దారి తీస్తున్నది. అయోధ్య తీర్పునిచ్చిన జడ్జిలలో ఒకరిగా ఉన్న జస్టిస్ చంద్రచూడ్ స్వయంగా ఆ తీర్పుకు వ్యతిరేకంగా వెళ్ళారు.అయోధ్య తీర్పు ప్రార్థనా ప్రదేశాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991కి సంబంధించి వివరణాత్మకంగా స్పష్టతనిచ్చింది. చట్టం శీర్షికలోనే దూరదృష్టి కలిగిన పార్లమెంటు ఉద్దేశం స్పష్టమవుతుందని పేర్కొంది. ఆ చట్టంలో "1947 ఆగస్టు 15వ తేదీ నాటికి కొనసాగుతున్న ప్రతి ఒక్క ప్రార్థనా ప్రదేశాల మతపరమైన స్వభావాన్ని కొనసాగిస్తూ , ఏ ప్రార్థనా ప్రదేశాన్నైనా మార్చే చర్యను మరియు అందుకు సంబంధించిన అంశాలను లేదా సంభవించే పరిణామాలను నిషేధించింది" అని పేర్కొనబడింది.

అయోధ్య తీర్పు ఇలా పేర్కొంది – "రెండు ఉద్దేశ్యాలతో ఈ చట్టాన్ని రూపొందించారు. మొదటిది, ఈ చట్టం ఏ ప్రార్థనా ప్రదేశాన్నైనా మార్పు చేయడాన్ని నిషేధించింది. అలా చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రజల ప్రార్థనా ప్రదేశాల మతపరమైన స్వభావానికి మార్పులు చేర్పులు చేయవద్దని ఆదేశించినట్లయింది. రెండవది, ప్రతి ప్రార్థనా ప్రదేశం యొక్క మతపరమైన స్వభావాన్ని కొనసాగించే విధంగా సానుకూల కర్తవ్యాన్ని మోపింది."

ప్రార్థనా ప్రదేశాల చట్టంలో, దాని నిబంధనల వర్తింపు నుంచి ఒకే ఒక మినహాయింపు ఉన్నట్లు అయోధ్య తీర్పు గుర్తించింది. ఆ మినహాయింపు "సామాన్యంగా పిలిచుకునే రామజన్మభూమి– బాబ్రీ మసీదు అనే దానికి" మాత్రమే. చట్టంలో పేర్కొన్నట్లుగా 'ప్రార్థనా ప్రదేశాలను మార్చటంపై నిషేధాన్ని, అందుకు రెచ్చగొట్టే ప్రయత్నం లేదా చర్యకు పాల్పడడం వంటి నిబంధనలను ఉల్లంఘిస్తే విధించే శిక్ష గురించి అదే చట్టంలోని సెక్షన్ 6లో నిబంధనలు ఉన్నాయి.

చట్టం రెండు స్థిరమైన, ఆజ్ఞాపూర్వక నియమాలను విధించిందని తీర్పు పేర్కొంది. మొదటిది, ప్రార్థనా ప్రదేశాలను మార్పు చేయటంపై నిషేధం; రెండవది ప్రతీ ప్రార్థనాస్థలం యొక్క మతపరమైన స్వభావాన్ని పరిరక్షించటం. ఈ ఉద్దేశ్యాలను సాధించేందుకు కేసులు, న్యాయపరమైన చర్యలను తగ్గింపునకు వీలు కల్పించింది. దీనితోపాటు ప్రార్థనా ప్రదేశాల చట్టం కొత్త కేసులు వేయడం లేదా న్యాయపరమైన చర్యలపై నిషేధం విధించింది. 1991లో ఈ చట్టం అమలులోకి వచ్చిన నాటికే, 1947 ఆగస్టు 15 తరువాత ప్రార్థనా ప్రదేశాల మార్పు జరిగిందనే ఆధారాలతో వేసిన పెండింగ్ కేసులు, అప్పీళ్ళు, న్యాయపరమైన కార్యకలాపాలకు మాత్రమే ఆ చట్టం నుంచి మినహాయింపు ఉన్నది.

"కొత్త గొడవలను సృష్టించడం, ప్రజల స్మృతిపథం నుంచి చెరిగిపోయిన పాత వివాదాలను రెచ్చగొట్టడం" అనేది ప్రార్థనా ప్రదేశాల చట్టం ఉద్దేశ్యం కాదని అయోధ్య తీర్పు స్పష్టం చేసింది. "1991లో పార్లమెంటు చేసిన ప్రార్థనా ప్రదేశాల చట్టం, రాజ్యాంగం మౌలిక విలువలను పదిలపరుస్తూ, పరిరక్షిస్తుంది. ఆలోచన చేసే, భావ వ్యక్తీకరణ, విశ్వాసం, నమ్మకం ప్రార్థన స్వేచ్ఛలను పరిరక్షించాల్సిన అవసరాన్ని రాజ్యాంగ పీఠిక బలంగా పేర్కొంది. మానవ గౌరవం, సౌభ్రాతృత్వాన్ని నొక్కి చెబుతోంది. సకల మతాల విశ్వాసాల సమానత్వం పట్ల సహనం, గౌరవం, ఆమోదనీయత సౌభ్రాతృత్వం యొక్క ప్రాథమిక సూత్రం" అని అయోధ్య తీర్పు వివరించింది.

"లౌకికవాదాన్ని రాజ్యాంగం విలువ"గా అయోధ్య తీర్పు సమర్థించింది. ఇందుకు ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తొమ్మిది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయాన్ని ఉట్టంకించింది. ఆ తీర్పు ఇలా పేర్కొంది – "ప్రార్థనా ప్రదేశాల చట్టం స్వాభావికంగా లౌకిక రాజ్యం విధులకు సంబంధించింది. ఇది అన్ని మతాల సమానత్వానికి భారతదేశ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అన్నిటికి మించి, అన్ని విశ్వాసాల సమానత్వాన్ని తప్పనిసరి రాజ్యాంగ విలువగా కాపాడే, పరిరక్షించే పవిత్రమైన విధిని ప్రార్థనా ప్రదేశాల చట్టం రాజ్యంపై ఆదేశపూర్వకంగా మోపింది. ఇది రాజ్యాంగ మౌలిక లక్షణం. ఈ ఉద్దేశ్యమే ప్రార్థనా ప్రదేశాల చట్ట రూపకల్పనకు మూలాధారం."

"మన చరిత్ర, దేశ భవిష్యత్తు గురించి చట్టం మాట్లాడుతుంది. మన చరిత్ర, దానిని దేశం ఎదుర్కోవాల్సిన అవసరం గురించి మనకు ఎరుక ఉంది. గతం చేసిన గాయాలను మాన్పేందుకు స్వాతంత్ర్యం ఒక ముఖ్యమైన మలుపు. ప్రజలు చట్టాన్ని వారి చేతులలోకి తీసుకోవడం చారిత్రక తప్పిదాలకు పరిహారం కాదు. ప్రజల ప్రార్థనా ప్రదేశాల స్వభావాన్ని పరిరక్షించటంలో, అలాగే చరిత్ర, అది చేసిన తప్పిదాలను వర్తమాన, భవిష్యత్తులను అణిచివేసేందుకు పరికరాలుగా ఉపయోగించుకోరాదని పార్లమెంటు సందిగ్ధతకు తావు లేకుండా చేసిందని" అయోధ్య తీర్పు పేర్కొంది.

# ప్రపంచ కార్మికోద్యమంలో...డబ్ల్యుఎఫ్‌టియు



ఎస్.బాల్‌రాజ్
8074246685

1945లో రెండవ ప్రపంచ యుద్ధం జరగటంతో ప్రపంచ దేశాల ప్రగతిశీల కాముకులు, కార్మిక నాయకులు యుద్ధాల వల్ల మిగిలేది బూడిదే అని 'యుద్ధం వద్దు, ప్రపంచశాంతి ముద్దు' అని ప్రజా సంక్షేమం, కార్మికవర్గం రక్షణలకు 1945లో 40కి పైగా వివిధ దేశాల కార్మిక సంఘాల నాయకులతో ప్రతినిధుల సభ జరిగింది. ప్రపంచంలోని పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ధనదాహంతో తమ ఆధిపత్యాన్ని పెంచి గుత్తాధిపత్యంతో ప్రపంచాన్ని శాసించాలన్న స్వార్థంతో పొరుగుదేశాల ఖనిజ సంపదపై కన్నేసి, యుద్ధాలకు ప్రేరేపించి, శాంతికి విఘాతం కల్పిస్తున్నందున లండన్‌లో సమావేశమై వివిధ దేశాల కార్మిక సంఘాల ఏకాభిప్రాయంతో ఒక నూతన విశాల దృక్పథంతో, పెట్టుబడిదారుల, గుత్తపెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ప్రపంచ సంస్థను స్థాపించాలని కార్మికులను ఏకంచేసి వర్గ దృక్పథంతో ప్రపంచవ్యాపితంగా కమ్యూనిజాన్ని స్థాపించాలని నిర్ణయించారు.

సెప్టెంబర్ 25, 1945 నుండి అక్టోబర్ 9 వరకు 15రోజుల పాటు ప్యారిస్‌లో కార్మిక సంఘాల ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టియు) ప్రథమ మహాసభ జరిగింది. అక్టోబర్ 3న డబ్ల్యూఎఫ్‌టియు ఉద్దేశ్యాలను, ఆశయాలను అమలుకు లక్ష్యాలను ఆమోదించబడినవి. భారతదేశం నుండి మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి పాల్గొని డబ్ల్యూఎఫ్‌టియు ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించింది. నేటికి కూడా ప్రపంచ కార్మికుల ఐక్యత కొరకు అనేక త్యాగాలను చేసింది. అదే విధంగా భారతదేశం కార్మిక వర్గాన్ని ఏకం చేస్తుంది. గురుదాస్ దాస్‌గుప్తా గారు భారతదేశంలోని కార్మిక సంఘాలను ఐక్యంచేసి ఉద్యమాలు చేశారు.

యుద్ధ ప్రేరేపితమైన కారణాలపై పోరాటం, ప్రపంచ శాంతికోసం కృషి చేయడం. ప్రపంచ శాంతికి భంగం కలిగించే అన్ని చర్యలను అడ్డుకోవడం. డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన ఉద్దేశం. ట్రేడ్ యూనియన్ల మౌలిక హక్కుల రక్షణ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ప్రపంచ ప్రజల సంఘీభావం, మద్దతుతో ఆయా దేశాల ప్రభుత్వాల మెడలు వంచి చట్టాలు సాధించుకోవటం. చట్టాల అమలుకు పోరాటాలు, ఉద్యమాలు చేయడం నిత్యకృతం అయ్యింది. జాతి, కులం, రంగు, లింగ, మతం, ప్రాంతం వివక్షతల నుండి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం పనిచేసే హక్కు, రాజ్యాంగ హక్కుగా ఉండాలని, నిజ వేతనంతో కూడిన సెలవులు, ఉన్నత జీవన ప్రమాణాలు ఇల్లు, బట్టలు, ఆహారం, ఆరోగ్యం, రక్షణ, నిరుద్యోగ నిర్మూలనా, నిరుద్యోగ భృతిసాధన వ్యాధిగ్రస్త వృత్తిపరమైన ప్రమాదాలకు నష్టపరిహారం, వృద్ధాప్య పెన్షన్ల హక్కులు కల్పిస్తూ సామాజిక భద్రత, శ్రమజీవుల హక్కులపై తీర్మానం చేయటం జరిగింది. సాధించేందుకు పోరాటాలు, ఉద్యమాలు ప్రపంచవ్యాపితంగా జరిగేలా చూస్తుంది.

డబ్ల్యుఎఫ్‌టియు నాయకత్వంలో ప్రపంచ కార్మికవర్గం నిర్వహించిన పోరాటాల ఫలితంగా సమిష్టి బేరసారాల హక్కుకై ప్రపంచ కార్మిక సంస్థ ఐఎల్‌ఓతో ఒప్పందం జరిగింది. తద్వార అనేక దేశాలలో కార్మికుల పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ, యాజమాన్యాలపై వివిధ రూపాలలో కార్మికవర్గం పోరాటాలు సాగిస్తుంది. చాలాసార్లు యాజమాన్యాలపై పైచేయి సాధించింది. కార్మికుల హక్కులు డిమాండ్ల సాధన కొరకు కార్మిక పోరాటాలకు శక్తివంతమైన తోడ్పాటు డబ్ల్యుఎఫ్‌టియు అందించింది. వామపక్ష సోషలిస్టు భావాలతో.. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా.. సమానత్వం.. సామాజిక న్యాయం కొరకు పాటుపడాలనే లక్ష్యంతో మునుముందుకు సాగుతుంది.

కొన్ని కార్మిక సంఘాలు మితవాదుల ఆధిపత్యంగల అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఉండాలని నిర్ణయించాయి. అమెరికన్ సామ్రాజ్యవాదం తన ప్రాబల్యాన్ని పెంచుకునే విధానాన్ని అనుసరించాలని భావించి డబ్ల్యుఎఫ్‌టియును చీల్చేందుకు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడింది. 1949 చివర్లో ఒక నూతన అంతర్జాతీయ సంస్థ, స్వేచ్ఛా కార్మిక సంఘాలు కలిసి అంతర్జాతీయ మహాసభ ఇండిపెండెంట్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్ (ఐసిఎఫ్‌టియు) ఏర్పడింది. పెట్టుబడుదారి యజమాన్యాలకు అనుకూలమైన సంఘాలు ఒక్కటై ఫ్రీ ట్రేడ్ యూనియన్ పేరు కార్యక్రమాలను కొంతకాలం నుండి నిర్వహిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయి.




పోరాటాల ద్వారా శ్రామికుల విముక్తికి కృషి చేయడం తన ప్రాథమిక లక్ష్యంగా డబ్ల్యుఎఫ్‌టియు ప్రకటించింది. అదే ఆశయం కొరకు సదా పనిచేస్తుంది. భారతదేశం నుండి ఎఐటియుసి ఫౌండర్ మెంబర్‌గా ఉంటూ వస్తుంది. క్రియాశీలకపాత్ర పోషిస్తుంది.

సిఐటియు, ఎఐయుటియుసి కార్మిక సంఘాలు డబ్ల్యూఎఫ్‌టియులో భారతదేశ ప్రతినిధులుగా, భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. ప్రపంచ కార్మికుల ఐక్యతే ధ్యేయంగా పనిచేస్తున్న, రాజకీయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలు, కార్మికులు ఐక్యం అయితేనే భారతదేశంలో కూడా కార్మిక రాజ్యం వస్తుందని తెలిసికూడ భారతదేశ కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు చేస్తున్నాయి తప్ప ఐక్యంకాకపోవడం విచారకరం. ఐక్యం అయివుంటే భారతదేశంలో కార్మిక రాజ్యస్థాపన జరిగేది.

2016 అక్టోబర్ 5–8 తేదీలలో17వ మహాసభ దక్షిణాఫ్రికాలోని టూరిస్ట్ వాణిజ్య కేంద్రమైన ధర్బన్ పట్టణంలో జరిగింది. ప్రపంచంలోని ఐదు ఖండాల నుండి 111 దేశాలకు చెందిన 240 కార్మిక సంఘాల నుండి 92మిలియన్ల సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహించిన కాకలుతీరిన కార్మిక పోరాట యోధులు 1500మందితో పాటు 350మంది ప్రపంచ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. 2022 మే 68, ఏథేన్స్ (గ్రీస్)లో జరిగిన 18వ మహాసభకు 105 మిలియన్స్ సభ్యత్వానికి ప్రాతిథ్యం వహిస్తున్న వందకు పైగా దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికోద్యమాలకు సంఘీభావంగా కార్మికుల ఐక్యత, కార్మిక సంఘాల సంబంధాలు, ఐక్యంగా యాజమాన్యాలతో భేరసారాలు జరపాలని, సాంఘిక భద్రత కావాలని, కార్మికుల హక్కుల రక్షణ, ప్రైవేటీకరణను వ్యతిరేకించటం, కార్మికుల పిల్లలకు విద్య, ఉపాధి హక్కుల కొరకు పోరాటా లు, అందరికీ ఉచిత ఆరోగ్య సదుపాయాలు కల్పించడం, కనీస వసతుల కోసం కృషి చేస్తుంది .. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య.

ఇటీవలకాలంలో యజమానులు అక్రమ పద్ధతుల్లో పనులు లేవని ఎలాంటి ముందస్తు నోటీస్ ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా కార్మికులను తొలగించటం (రిట్రెంచ్‌మెంటు), చేయడం జరుగుతుంది. కనీస రిట్రెంచ్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. తాత్కాలిక కార్మికులను నియమించుకొని శ్రమ దోపిడికి పాల్పడుతూ, పెట్టుబడిదారులు తమ ఆస్తులను పెంచుకుంటున్నారు. కార్మిక వర్గానికి మరింత బలమైన, చురుకైన ప్రజా పునాది గల వర్గ దక్పథం గల ట్రేడ్ యూనియన్‌ల ఉద్యమం ఎంతో బలబడాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యాపితంగా బలోపేతమైన పోరాటాలు, ఉద్యమాలు సాగుతున్నాయి.

ట్రేడ్‌యూనియన్ హక్కులను కాపాడకుండా పెట్టుబడిదారీ వర్గం సృష్టించిన నిరుద్యోగం, పేదరికం, యుద్ధాలకు వ్యతిరేకంగా తమ సమకాలీన అవసరాలను సాధించుకునేందుకు పోరాటాలతో, ఉద్యమాలతో ప్రపంచ వ్యాపితంగా కార్మికుల, కార్మిక సంఘాల సమైక్యతను కాపాడాలని డబ్ల్యూఎఫ్‌టియు కార్మిక వర్గానికి పిలుపునిస్తుంది.

# మానవ హక్కుల పరిరక్షణతోనే ప్రపంచ శాంతి స్థాపన

1948లో ఐరాస సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రకారం ప్రతి ఏటా 10 డిసెంబర్‌న మానవ హక్కుల దినోత్సవం(హ్యూమన్ రైట్స్ డే) పాటించుట ఆనవాయితీగా మారిం ది. మానవ హక్కుల దినం–2024 థీమ్‌గా మన హక్కులు, మన భవిష్య త్తు, ఈ క్షణమే అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం, అవగాహన చేస్తున్నారు. పౌర సమాజ సమగ్రాభివృద్ధికి మానవ హక్కుల పరిరక్షణ చర్యలతో ప్రపంచ శాంతి సౌభాగ్యాల స్థాపనకు తోడ్పడతాయి. అసమానతలను రూపుమాపడానికి మానవ హక్కుల ను గౌరవించడం మన కనీస ధర్మం. మానవ హక్కుల దినం కేంద్రంగా హక్కుల ఉల్లంఘనలను నివారించడం, సంరక్ష ణ, సకారాత్మక మార్పులను తీసుకురావడం జరగాలి.




మానవ హక్కులను బలోపేతం చేయడం అంటే మరింత శాంతియుత సమాజ స్థాపనకు ఊపిరి పోయడమే అని తెలుసుకోవాలి.

**మానవ హక్కులు గౌరవించడం అంటే ఉజ్వల భవిష్యత్తును కాంక్షించడమే:**

పేదల శ్రమ దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, ఆకలి చావులు, యుద్ధాల్లో పిల్లలను వినియోగించడం, భౌతిక హింస, స్వేచ్ఛను హరించడం, మారణహోమాలు, లైంగిక వేధింపులు, మానవీయ చేయూత ఇవ్వకపోవడం, కనీస అవసరాల కొరత, వివక్ష పాలన, లింగ అసమానతలు, అకారణ అరెస్టులు, హత్యలు, మత ఘర్షణలు, గొంతు నొక్కడం, పని కల్పించకపోవడం, చట్టాల ఉల్లంఘనలు, మహిళలు/బాలికపై వేధింపులు, నిర్బంధించడం లాంటి పలు అంశాలు మానవ హక్కుల హననంలోకి వస్తాయి. నేటి ప్రపంచం పలు సంక్షోభాలమయం. యుద్ధాలు, సగం ఘర్షణలు, వాతావరణ మార్పులు, అసమానతలు రాజ్యమేలుతున్నవేళ మానవ హక్కులు అనాధలుగా బిత్తరపోతున్నాయి, కనీస మానవ హక్కులకు విఘాతం కలుగుతున్నది. మానవ హక్కులు మానవాళిని ఏకం చేస్తాయి. మానవ హక్కుల పరిరక్షణతోనే ఆశావ హ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. హక్కుల దుర్వినియోగం, ఉల్లంఘనలు, అమానవీయ పోకడలతో నేటి సమాజం దుఃఖమయంగా, దయనీయంగా మారడం చూస్తూ చలించిపోతున్నాం.

మానవ హక్కులను కాపాడడం అంటే మనల్ని మనమే గౌరవించుకోవడం అని అర్థం చేసుకోవాలి. అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత అభివృద్ధి సాధనకు మానవ హక్కులను గౌరవించడం తప్పనిసరి. మానవ హక్కులతో వ్యక్తులు బలోపేతం కావడం, సమాజంలో శాంతి నెలకొనడం ఫలిస్తాయి.

(10 డిసెంబర్ మానవ హక్కుల దినోత్సవం)

# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ బకాయిల చెల్లింపు ఎప్పుడు?

లేఖ

సింగరేణి యాజమాన్యం 2013 –2014 ఆర్థిక సంవత్సరంలో 61,778 మంది కార్మికులతో 50.47 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో 170.29 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టిని/ఓవర్ బర్డెన్‌ను తొలగించింది.

2023–2024సం.లో 41,837మంది కార్మికులతో 70.02మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 420.29 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించింది. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ, కార్మికులపై పనిభారం మోపుతూ బొగ్గు ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవడానికి ఎనలేని శ్రద్ధను చూపుతుంది. కాని కార్మికుల శ్రమ ఫలితాలను వర్తింపచేయడానికి ఏండ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తుంది. భారతదేశవ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికులకు "జెబిసిసిఐ"(జాయింట్ బైపార్టీయేట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ) సంప్రదింపుల ద్వారా "ఎన్‌సిడబ్ల్యూఎ"(నేషనల్ కోల్ వేజు అగ్రిమెంట్)లతో వేతన ఒప్పందాలు అమలు అవుతాయి.

కేంద్ర కార్మిక శాఖ, యాజమాన్య, జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి సంప్రదింపులతో "సిఐఎల్" (కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కంపెనీ, ఇంకా టిస్కో( టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ)లాంటి ప్రైవేటు కంపెనీల కార్మికులకు, ఉద్యోగులకు వేతన, భత్యాల చెల్లింపులను, పని కేటాయింపులను, పదోన్నతుల వర్తింపులను నిర్ణయించుతారు. అందులో భాగంగా "'11వ, నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ 23నెలలు ఆలస్యంగా 2023, మే 20న ఒప్పందం అయింది. 2021 జులై నుండి 2023 మే 31 మధ్యకాలంలో రిటైర్ అయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులకు, డెత్ కార్మికుల కుటుంబాలకు "సిఎంపిఎస్"(కోల్ మైన్స్ పెన్షన్ స్కీం) బకాయిలను చెల్లించడానికి చేతులు రావడం లేదు.

బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం 23 నెలలు ఆలస్యంగా జరిగింది. అందువలన తేది 2021, జులై 1 నుండి 2023 , మే 31 మధ్యకాలంలో రిటైర్ అయిన, మెడికల్ అన్ ఫిట్ అయిన, చనిపోయిన కార్మికులకు 2021 జూన్ 30 వరకు అమలులో ఉన్న బొగ్గు గని కార్మికుల 10వ వేతన ఒప్పందంలోని వేతన, భత్యాలకు అనుగుణంగా పెన్షన్ లెక్కించి చెల్లించారు. ఇప్పుడు సిఎంపిఎస్ 98 ప్రకారంగా నేషనల్ కోల్ వేజు అగ్రిమెంట్ 11లో పెరిగిన వేతన భత్యాలకు అనుగుణంగా రివైజ్డ్ /పునరుద్ధరణ పెన్షన్ ను లెక్కించి బకాయిలను చెల్లించవలసి ఉన్నది. 11వ వేతన ఒప్పంద కాలపరిమితి 2026 జూన్ 30తో ముగుస్తుంది. అంటే 2021 జులై నుండి 2024 డిసెంబర్ 31 నాటికి రిటైర్డ్ అయిన కార్మికులకు 42నెలల కోల్‌మైన్స్ పెన్షన్ బకాయిలను చెల్లించవలసి ఉన్నది. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ బకాయిలను సిఎంపిఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమీషనర్స్ గోదావరిఖని, కొత్తగూడెం మరియు సెంట్రల్ కమీషనర్ ధన్‌బాద్ ద్వారా చెల్లించుతారు. సింగరేణి యాజమాన్యానికి అదనంగా ఎటువంటి ఆర్థిక భారం ఏమి లేదు. కాకపోతే 2021 జులై నుండి 2023 మే 31వరకు గల 23 నెలల కాలంలో రిటైర్డ్ మెడికల్ అన్‌ఫిట్, డెత్ కార్మికులకు పునరుద్ధరణ కోల్ మైన్స్ చెల్లింపుకై "సహజ్ ఫారం" ద్వారా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కోల్‌మైన్స్ పెన్షన్ రిఫండ్ వివరాలతో కూడిన ప్రతి రిటైర్డ్ కార్మికునికి సంబంధించిన 10 నెలల "నోషనల్ సాలరీని, ఒక నెల యావరేజీ సాలరీ వివరాల సమాచారాన్ని రామగుండం ఏరియాలోని 1,2,3/మూడు డివిజన్లు, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ల కార్మికుల నోషనల్ సాలరీ సమాచారాన్ని "గోదావరిఖని సిఎంపిఎఫ్ కమీషనర్‌కు, అలాగే కొత్తగూడెం మైన్స్, కార్పొరేట్, ఇల్లందు, మణుగూరు డివిజన్ల కార్మికుల 10 నెలల నోషనల్ సాలరీని, ఒక నెల యావరేజ్ సాలరీ సమాచారాన్ని సిఎంపిఎఫ్ కమీషనర్ కొత్తగూడెంకు పంపించాలి. సింగరేణి యాజమాన్యం పంపించిన సమాచారాన్ని మరల వాళ్లు ఆడిట్ చేసి సెంట్రల్ రీజనల్ కమీషనర్ ధన్‌బాద్‌కు పంపిస్తారు. అప్పుడు కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో నగదుగా పెన్షన్ బకాయిలను జమచేయడం జరుగుతుంది. సింగరేణి అధికారులు కార్మికులకు క్రమశిక్షణ రాహిత్య చర్యల పేర ఉద్దేశ్యపూర్వకంగా నత్తనడకగా పని చేశారని, సమయపాలన పాటించలేదని, అజాగ్రత్తగా పనిచేశారని, అధికారులతో వాగ్వివాదం చేశారని ఇలా చిన్న కారణాలను భూతద్దంలో చూపించి సకాలంలో కార్మికులకు బకాయిలను చెల్లించడానికి అధికార యంత్రాంగం ఇష్టానుసారంగా విధులు నిర్వహించుచున్నారు. మాపై ఎవరూ చర్యలు తీసుకోరనే ధీమాతో పర్సనల్ ఆఫీసర్లు, కాలరీ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లు కార్మికులకు ప్రయోజనమైన పనుల నిర్వహణలో, పర్యవేక్షణలో తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడుతున్నారు. సిఎంపిఎఫ్ రీజనల్ కమీషనర్స్, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ విభాగ డైరెక్టర్ సమన్వయంతో సమీక్షలు చేసి సత్వరంగా రిటైర్డ్ మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు, డెత్ కార్మికుల కుటుంబానికి 42 నెలల పునరుద్ధరణ కోల్ మైన్స్ బకాయిలను చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

మేరుగు రాజయ్య

# 70వ వసంతంలోకి 'సాగర్' ప్రాజెక్ట్

**ప్రజాపక్షం/నందికొండ:** రెండు తెలుగు రాష్ట్రాలకు జీవనాడి లక్షల ఎకరాలకుసాగు నీరందించే బృహత్తర, బహుళార్ధ సార్ధక ప్రాజెక్టు నాగార్జున సాగర్. కోట్లాది తెలుగు ప్రజలకు జీవనాధారంగా మారిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు నేటితో 69 ఏళ్లు పూర్తి తీసుకొని 70వ వసంతంలోకి అడుగుపెట్టింది. తెలుగు రాష్ట్రాలను అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఈ మహా కట్టడం మహోన్నతమైన మానవ ప్రయత్నానికి మరుపురాని నివాళిగా నిలుస్తోంది. కరువు కాటకాలతో అల్లాడుతున్న రాష్ట్రానికి అటు సాగునీరు ఇటు త్రాగు నీటితో పాటు , విద్యుత్ ఉత్పత్తి అవసరాల కోసం ఇక్క డ ప్రాజెక్టు అవసరమని భావించి నల్లగొండ జిల్లా నందికొండ వద్ద కృష్ణానదిపై ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి పాలకులు నడుం బిగించారు. ఇంతటి అపురూపమైన ఈ ప్రాజెక్టుకు సరిగ్గా 70 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ద్వారా 1955 డిసెంబర్ 10వ తేదీన నాగార్జునసాగర్ వద్ద ప్రాజెక్టుకు బీజం పడింది.ఈ బహులార్ధ సార్ధక ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పూర్తి మానవ నిర్మిత



రాతి కట్టడాల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ జలాశయ విస్తీర్ణం 110చధరపు మైళ్లు కాగా, గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు. ప్రాజెక్ట్ కుడి కాలువను జవహర్ కాలువగా, ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువగా నామకరణం చేయడం జరిగింది. 70 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాలకు ఆధునిక దేవాలయంగా నిలిచింది.



## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అర్జీలను రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలసి జిల్లాల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 34 ఆర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 22, జిల్లా గ్రామీణ అభివృద్ధి 3, జిల్లా వ్యవసాయ శాఖ 3, ఎంప్లాయిమెంట్ 2, మున్సిపాలిటీ, సర్వే ల్యాండ్ రికార్డ్, బీసీ వెల్ఫేర్, వైద్యశాఖకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా ఉద్యమాలకు కేరాఫ్ సిపిఐ

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజా ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్‌గా భారతకమ్యూనిస్టు(సిపిఐ)పార్టీ నిలిచిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఈనెల 30వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాల గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండల పరిధిలోని వేపల సింగారంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఉద్యమాలకు, ప్రజాపోరాటాలకు, పార్లమెంట్‌లో లోపల,బయట అనేక చారిత్మాత్మకమైన పోరాటాలు నిర్వహించిన పార్టీ సిపిఐ పార్టీ అని తెలిపారు. 1925 డిసెంబర్ 26న పారిశ్రామిక పట్టణమైన కాన్పూర్‌లో మొదటి మహాసభ జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి ముడెం ధన్‌రాజ్ రెడ్డి,గ్రామాశాఖా కార్యదర్శి గుజ్జుల శంభిరెడ్డి,భవన నిర్మాణ కార్మిక నాయకుడు కామళ్ళ ఆనంద్,సీనియర్ నాయకుడు జాన్,కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) నిర్వహించే చలో అసెంబ్లీకి విద్యార్థులు, సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కెజి నుండి పిజి వరకు ఉన్న విద్యాసంస్థలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సూరం విజయ్, వినయ్, మాతంగి విజయ్, వివేక్, సాయి పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యంతో ముందడుగు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని చదువులో ముందుకు సాగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ళ యాదయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అధ్యపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చరవాణితో చెలిమి చేయకుండా పుస్తకాలతో స్నేహం చేయాలన్నారు. ఉన్నతాధికారుల సూచనలతో 90రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు, వారి తల్లిదండ్రులు సమన్వయంతో ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడాలని దిశనిర్ధేశం చేశారు. ఈ సమావేశంలో ఎజిఎంఓ విడిఎస్ ప్రసాద్, స్టూడెంట్ కౌన్సిలర్స్ వాసు, బసునున్నిసబేగం, సైదులు, గురువయ్య, ఎస్ఎస్ ఆఫిసర్లు చికూరి కృష్ణ, నవీన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఈనెల 14,15తేదీల్లో అనంతపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అక్కెనపల్లి వీరస్వాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బుద్దుడి నుండి అంబేద్కర్ వరకు మానవ హక్కుల దేశీయ మూలాలు వెతుకుంటూ దేశ విదేశాల్లో జరిగే హక్కుల ఉల్లంఘనలను ప్రశ్నించారన్నారు. మహాసభలో కుల గణన ఎందుకు అవసరం, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన, ఎన్ఈపి 2020 కాషాయికరణ, కార్పొరేటీకరణ అంశాలపై ఎస్ఎన్ సాహు, మాజీ రాష్ట్రపతి కెఆర్ నారాయణ, మాలిని సుబ్రమణ్యం, కొప్పర్తి వెంకట రమణమూర్తిలు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చింతమళ్ళ గురువయ్య, మాంద్ర మల్లయ్య యాదవ్, ధరావత్ వీరేష్, బి గోపి, చంద్రకాంత్, వేణు పాల్గొన్నారు.

## 'జయ' హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ఒలంపియాడ్ ఫైనల్ లెవల్‌లో జాతీయ స్థాయిలో జయ పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు పాఠశార కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. సోమవారం ర్యాంకులు సాధించిన 9మంది విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 5,6 తరగతి విభాగంలో పి వేదాన్షి, కె రిష్వక్ సాయిలు జిల్లా మొదటి ర్యాంకు, 8వ తరగతిలో వై వీక్షణ ఆల్ ఇండియా రెండవ ర్యాంకు, వి గౌతమ్ జిల్లా మొదటి ర్యాంకు, వి జయసూర్య రెండవ ర్యాంకు, 9వ తరగతిలో కె కార్తికేయ శ్రీవాత్సవ్ మొదటి, వి వైష్ణవి రెండవ ర్యాంకు సాధించారని తెలిపారు. 10వ తరగతిలో పి జయేంద్ర, కె అభినవ్‌లు మొదటి, రెండవ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చేలా కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.




# భోజనంలో పరిశుభ్రత ,నాణ్యత లేకుంటే చర్యలు

### కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో వంటగది,పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ నల్లగొండ (కనగల్):** కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టల్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య లోపం, మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత ,నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.జిల్లా, కనగల్ మండలానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జూనియర్ కళాశాలను మంజూరు చేయగా సర్వేనెంబర్ 591లో కెజిబివి పక్కన స్థలాన్ని చూశారు. అంతేకాక 339 సర్వే నెంబర్లో పల్లె ప్రకృతి వనం వద్ద కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గతవారం కనగల్ ,తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే .అయితే కనగల్ మండలంలో జూనియర్ కళాశాల తో పాటు, ప్రతిక్ ఫౌండేషన్ సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని చూడాలన్న రాష్ట్ర రోడ్లు,భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆర్డిఓ అశోక్ రెడ్డి ,తాసిల్దార్ పద్మ లతో కలిసి స్థలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి వెళ్లి వంటగదిని,పాఠశాల పరిస



రాలను, పాత్రలు శుభ్రం చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. కిచెన్,పాఠశాల ఆవరణలో పరిశుభ్రత లోపించడంపై ప్రిన్సిపాల్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కనగల్ కేజీబీవీలో మొత్తం 230 మంది విద్యార్థులు ఉండగా, 3 తరగతి గదులలో బెంచీలు లేక విద్యార్థులు కింద కూర్చోవడం గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే బెంచీల ఏర్పాటు కై బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కు లేఖ రాయాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. అంతేకాక కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు.

## గొల్ల కురుమలకు నగదు బదిలీతో గొర్రెలు పంపిణీ చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గొల్ల కురుమలకు రూ. 2లక్షల నగదు బదిలీతో రెండవ విడత గొర్రెలను పంపిణీ చేయాలని జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు గడెం లింగయ్య, ప్రధాన కార్యదర్శి వీరబోయిన రవిలు అన్నారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పి రాంబాబుకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి సంవత్సరం గడుస్తున్న గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పశువైద్యశాఖలో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు అందించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపరులకు నెలకు రూ. 5వేల పింఛన్, ప్రమాదాల్లో మరణించిన వారికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. దీంతో పాటు గొల్ల కురుమలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కంచుగట్ల శ్రీనివాస్, కుక్కల సాంబయ్య, వజ్జ వినయ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజాపాలన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్దిదారులు నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జెడ్‌పి సిఈఓ వివి అప్పారావుతో కలిసి వివిధ సమస్యలపై ప్రజల నుండి 49 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో రూరల్ ప్రాంతాల నుండి ఇందిరమ్మ ఇళ్ళ కోసం 2,50,684, అర్బన్ ప్రాంతం నండి 58,378 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులన్నింటిని ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ళ ఇన్‌స్ట్రక్షన్ మొబైల్ యాప్ ద్వారా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్య



దర్శులు, మున్సిపాలిటిలో వార్డు అధికారులు పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారునికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని, అర్హులా, ప్రస్తుత గృహానికి సంబంధించిన వివరాలు, పోటో, ఇంటి లోపల, బయట, కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డిసెంబర్ చివరి నాటికి దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కోటాచలం, డిటిడిఓ శంకర్, డిఈఓ అశోక్ కుమార్, అధికారులు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, ఎల్ కిషన్ నాయక్, లత, సతీష్ కుమార్, రవి కుమార్, సీతారాం నాయక్, నరసింహరావు పాల్గొన్నారు.

## ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం



**ప్రజాపక్షం/యాదాద్రి :** యస్.సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ డిసెంబర్ 11 తేది విచారణ కమిషన్ డా॥ జస్టిస్ షమీమ్ అఖ్తర్ షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా (నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి) పరిధిలో బహిరంగ విచారణకు డిసెంబర్ 11న నల్లగొండ జిల్లాకు రానున్నారు. ఉమ్మడి నల్లగొండ (నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి) ఎస్సి కులాల సంఘ నాయకులు, అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయము నందు హాజరై తమ తమ వినతులు ఇవ్వాలని షెడ్యూల్ కులాల సంఘ నాయకులను కోరారు. ఈ యొక్క విచారణ ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు డా॥ జస్టిస్ షమీమ్ అఖ్తర్ స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## బాల మల్లేష్ త్యాగాలు మరువలేనివి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** బాల మల్లేష్ అకాల మరణం తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చిన్ననాటి నుండి బాల మల్లేష్ ఏఐఎస్ఎఫ్ ఉద్యమాల నుండి వెలుగులోకి వచ్చి ప్రజాసంఘాలలో నిర్మాణాత్మకమైన పాత్ర వహించారని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, కార్యదర్శి వర్గ సభ్యునిగా కొనసాగారని అన్నారు. బాల మల్లేష్ పార్టీ నాయకత్వంలో ప్రధానంగా భూ పోరాటాలు నిర్వహించారని, నిరుపేదలకు వ్యవసాయ భూములతో పాటు ఇంటి నివేషణ స్థలాలు హైదరాబాద్ నగర శివారులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూ పోరాటాలు నిర్వహించి భూములు



ఇప్పించారని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీలో బీసీ హక్కుల సాధన సమితికి నిర్మాణ బాధ్యులుగా ఉండి ఈ మధ్యకాలంలో బీసీల సమస్యలపై అలాగే రాష్ట్రస్థాయి అఖిలపక్ష కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, సిపిఐపట్టణ కార్యవర్గ సభ్యులు పెంటయ్య, నాయకులు చిక్క నరసయ్య, ఎండి. బాబా, సత్యనారాయణ, సుమన్ పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయాలి

### మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు డిమాండ్

**ప్రజాపక్షం/చింతపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల పరిధిలోని ఘడియాగౌరారం గ్రామంలో ఆదివారం రాత్రి ఆ పార్టీ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఘడియాగౌరారం గ్రామంలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి యాదగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 26న దేవరకొండలో రెడ్‌షర్ట్ వాలంటరీ కవాతును విజయవంతం చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతుబంధును



వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన వడ్లకు బోనస్ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వాలు ఏవైనప్పటికీ ప్రజల పక్షాన నిలిచేవి కమ్యూనిస్టు పార్టీలే అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ ఘనంగా నిర్వహించే శతాబ్ధి ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, శేఖరాచారి, మల్లేష్, కిష్టఫర్, రామకృష్ణ పాల్గొన్నారు.



## ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** జిల్లాలో ప్రతిభా కలిగిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 పోటీలలో భాగంగా రెండవ రౌండ్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురి క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కింద మేమేంటో, చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిభకు వెలిగిన క్రీడాకారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రీడా పోటీలకు విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి, ఆర్గనైజర్స్ ముత్తినేని నాగేశ్వరరావు, బోనగిరి ప్రభాకర్, శ్రీధర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, కోమటిరెడ్డి శేఖర్ రెడ్డి,కంచర్ల ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరు లోపు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన

### కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

**ప్రజాపక్షం/ నల్లగొండ :** నెలాఖరులోపు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనపై సోమవారం ఆమె సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని,జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో 3 లక్షల ,60 వేల, 205 దరఖాస్తులు, పట్టణ ప్రాంతంలో 71626, మొత్తం 4,31,831 దరఖాస్తులు రావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శిలు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులు పరిశీలించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి,వార్డ్ అధికారులు లేనిచోట టిఎ




లేదా ఇతర నియమించిన అధికారులు దరఖాస్తులను పరిశీలించాలని చెప్పారు. జిల్లాలోని 844 గ్రామపంచాయతీలు, 182 వార్డు పరిధిలలో పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమాన్ని నెలాఖరులోపు పూర్తిచేయాలని చెప్పారు.ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని, ఇందిరమ్మ కమిటీలు సైతం పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనను పరిశీలించవచ్చని తెలిపారు. దరఖాస్తుదారు బిపిఎల్ వర్గం , ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం,చిరునామా, అన్ని వివరాలతో పాటు, ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫోటో, ఇంటి పరిస్థితిపై లోపల,బయట ఫోటోలు,అలాగే కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, జెడ్పి సి ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి , ఈ డి ఎం దుర్గా రావ్, ఆర్డీవోలు,మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, ఎంపిఓలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, సర్వేయర్లు హాజరయ్యారు.

# వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల బిల్లులను క్లియర్ చేయకుండా పక్కన పెట్టి నిర్లక్ష్యంగా చేస్తున్న ఎకౌంట్స్ అధికారుల నిర్లక్ష్యం విడనాడాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేట్ సివిల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య మాట్లాడుతూ తక్షణమే వేతనాలు చెల్లింపుకు అన్ని విభాగాల ప్రధాన అధికారులు చర్యలు తీసుకోవాలని, బిల్లులు క్లియర్ కావడానికి అవసరమైన కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహారావు, వినోద, అనసూర్య, విజయలక్ష్మి, శంకర్, శేఖర్, శ్రీను, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సుదీర్ఘ పోరాటం తర్వాత.. న్యాయమే గెలిచింది

హైకోర్టు తీర్పుపై స్పందించిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మాజీ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు పిటిషన్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు కొట్టివేయడంపై స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. రమేష్‌బాబు కోర్టును కూడా అనేకసార్లు తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. జర్మనీ పాస్‌పోర్టుపై దాదాపు 45 సార్లు ప్రయాణం చేసినట్లుగా కోర్టుకు ఆధారాలు సమర్పించానని తెలిపారు. జర్మనీ పౌరసత్వం కలిగి ఉండి, తప్పుడు పత్రాలు సమర్పించి ఎమ్మెల్యేగా గెలుపొందారని, 15 ఏండ్ల తన న్యాయపోరాటంతో చివరికి హైకోర్టు తీర్పుతో గెలిచానని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. దశాబ్దన్నర కాలంగా చెన్నమనేని రమేష్ ప్రభుత్వాన్ని, కోర్టును, వేములవాడ ప్రజలను మోసం చేశాడన్నారు. కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి, ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించిన రమేష్ బాబుకు హైకోర్టు 30 లక్షల జరిమానా విధించిందని, నెల రోజుల్లో ఆది తనకు రూ.25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీకి రూ.5 లక్షలు చెల్లించాలని ఆదేశించిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

# చిన్నకోడూర్ మండల పరిధిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలి

కేంద్ర రైల్వే మంత్రికి బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల వినతి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** కొత్తపల్లి– మనోహరబాద్ రైల్వేలైన్‌లో భాగంగా సిద్దిపేట నుండి కొత్తపల్లి వెళ్ళే రైల్వే మార్గంలో చిన్నకోడూర్ మండలం ఉందని మాజీ మంత్రి ఎంఎల్ఏ హరీష్‌రావు సూచన మేరకు మండల పరిధిలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావులు కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సిద్దిపేట జిల్లా నియోజకవర్గంలోని చిన్నకోడూర్‌లో రంగనాయకసాగర్‌తో పాటు ఇతర అభివృద్ధి ప్రాంతాలున్నాయని ప్రజలు ప్రయాణ దృష్ట్యా వ్యాపార నిమిత్తం కరీంనగర్,హైదరాబాద్‌లకు అనుకూలంగా ఉంటుందని, అందుకు చిన్నకోడూర్ వద్ద రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

# అనువాదం సాహిత్య సాంస్కృతిక వారధి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** భాష, భావాల సమాహారమే అనువాదమని, ఇతర బాషల విలువలను, సంస్కృతిని, రచన తత్వాన్ని మరో భాషలోకి తీసుకురావడం లక్ష్యంగా అనువాదం సాగుతుందని, అనువాదం ఒక వృత్తిగా మారిందని, తద్వారా ఎన్నో అవకాశాలు ఉన్నాయని కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. ఆచార్య కలువకుంట రామకృష్ణ అధ్యక్షతన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు అనువాద పద్ధతులపై ఒక రోజు కార్యశాల జరిగింది. కార్యక్రమంలోఆనంద్ విధ్యార్థులకు తెలుగు అనువాదంలోని మెలకువలను తెలియజేశారు. ప్రధానాచార్యులు ఆచార్య కలువకుంట రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డా.బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ అనువాదాలు చేసేవారు మాతృభాషా సాహిత్యాలను అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో అటానమస్ కో ఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, అధ్యాపకులు బూర్ల వెంకటేశ్వర్లు, డా.డి ప్రకాష్, డా.ఆర్ శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, డా.పాత అశోక్, డా.పి.చైతన్య, డా.పి.అనిల్ కుమార్, పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు అందుకున్న పాత సత్యం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాత సత్యం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డును సోమవారం ఢిల్లీలోని పంచశీల క్షేత్రంలో దళిత సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు , మాజీ గవర్నర్ డా.ఎస్‌పి సుమనాక్షర్ నుంచి అందుకున్నారు. అవార్డు గ్రహీత పాత సత్యం సర్పంచ్‌గా, సోషల్ వర్కర్‌గా పనులు చేస్తూ అంబేద్కర్ సంఘాలను బలోపేతం చేసినందుకు గాను ఈ అవార్డు ఇవ్వడం జరిగిందని ఢిల్లీలోని పెద్దలు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా పాత సత్యం మాట్లాడుతూ తనకు అవార్డు రావడానికి సహకరించిన జాతీయ సెలక్షన్ కమిటీ సభ్యులకు, రాష్ట్ర నాయకుడు పసుల రామ్మూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోలు బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు మేడి మహేందర్, మహమ్మద్ సలీం, తీన్మార్ మల్లన్న టీం కమిటీ నాయకులు మహమ్మద్ ముస్తఫా, పాత శ్రీనివాస్ తదితరులున్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధరణి పెండింగ్ దరఖాస్తులు, జాతీయ రహదారుల భూ సేకరణ చెల్లింపుల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డివిజన్ వారిగా పెండింగ్ ధరణి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి వెబ్ సైట్ లో నూతనంగా పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సెషన్ మొదలగు మాడ్యుల్స్ ను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నుంచి అదనపు కలెక్టర్ , రెవెన్యూ డివిజన్ అధికారులకు బదలాయించడం జరిగిందని, వీటిని వేగవంతంగా క్లియర్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ఆర్బిట్రేషన్ సంబంధిత రైతులకు వేగవంతంగా చెల్లింపులు చేయాలని, జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు నేషనల్ హైవే అథారిటీకి పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల అందజేత

**పెద్దపల్లి రూరల్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులకు తెలిపారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంట గ్రామానికి చెందిన బొంత పూజిత సింగరేణి ఓపెన్ క్యాస్ట్ మైనింగ్ క్రింద తమ గ్రామాన్ని తీసుకుందని, తాను తమ అమ్మమ్మ గారి ఊరు తుర్కల మద్దికుంటకు చ్చి గత ఆరు సంవత్సరాలు గడిపామని, తన పై చదువుల కోసం తనకు ఆదాయ కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరు గ్రామానికి చెందిన బి.సతీష్ ఎంపీడీవో కార్యాలయంలో గల దుకాణ సముదాయంలో జీవనోపాధి కోసం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సుల్తానాబాద్ ఎంపిడిఒ కు రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్గాం మండలం బ్రాహ్మణ పల్లి గ్రామానికి చెందిన పి.రాజేశం తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, కలెక్టరేట్ హెచ్ విభాగం సూపరింటెండెంట్ జగదీశ్వర్ రావు,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా అర్జీలకు సత్వర పరిష్కారం

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత





**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డితో కలసి లత స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 25 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, ఆర్డీవోలు మధు సూధన్, దివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 208 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ధరఖాస్తులు వెల్లువెత్తాయి. 208 మంది అర్జీదారులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజావాణిలో ధరఖాస్తులు సమర్పించారు. అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అర్జీదారుల నుంచి ధరఖాస్తులను స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. ఈ సంధర్భంగా అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పరిష్కారం కోసం బదిలీ చేసిన ధరఖాస్తులను అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో భారీ చోరీ

11 తులాల బంగారం, 80 తులాల వెండి అపహరణ

**ప్రజాపక్షం/రామగిరి :** కమాన్ పూర్ మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. కమాన్ పూర్ మండల కేంద్రంలోని పోస్టు ఆఫీస్ వీధిలో గల బిల్లా రాజయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. నవంబర్ 27న హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు ఇంటికి వెళ్లారు. ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి ముందు గేట్ తీసి ఇంట్లోకి వెళ్ళగా బెడ్‌రూం తాళం పగలగొట్టి ఉండడంతో పాటు బీరువా పగలగొట్టి అందులోని బట్టలు బయట పడేసే ఉన్నాయి. బీరువాలో ఉన్న 11 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ, 30 వేల నగదు దొంగిలించుక పోయారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు గోదావరిఖని టూ టౌన్ సీ. ఐ నక్క ప్రసాద్ రావు, కమాన్ పూర్ ఎస్. ఐ కొట్టె ప్రసాద్ లు పోలీస్ సిబ్బంది తో ఇంట్లో ఇంటి పరిసరాలను పరిశీలించారు. జాగిలాలను తీసుకువచ్చి పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్స్ పంపించారు. కాగా ఒకే వాడలో రెండు దొంగతనాలు జరగడంతో చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రంలో వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# పేదలకు న్యాయం జరిగేలా లబ్ధిదారుల ఎంపిక

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత





**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి పూర్తి వివరాలను పారదర్శకంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అకుల రజిత వెంకన్న అధికారులను అదేశించారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. ప్రజాలన కార్యక్రమంలో పట్టణానికి ఇప్పటి వరకు 4542దరఖాస్తులు వచ్చాయని వీటిని పరిశీలనకు 26 మంది సర్వేయర్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మీరు ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో విచారన జరిపి అందులో నిజమైన నిరుపేదలను ఏంపిక చేసి తుది నివేదిక అందచేయాలని సూచించారు. వారికి వార్డు అఫిసర్లు లందరు ఇల్లు లేని పేదను గుర్తించే విధంగా సహకరించాలని కొరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ మల్లికార్జున్, వైస్ చైర్మెన్ అనితరెడ్డి, ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మరవిందర్, కౌన్సిలర్లు నళినిదేవి, స్వర్ణలత, భాగ్యరెడ్డి, లావన్య, వేణు, రత్నమాల , రాజు, రమేష్, హరీశ్, సుప్రజా, శంకర్‌రెడ్డి, లలిత, అయుబ్, శ్రీలత, కమీటి సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

అదనపు కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/రామగిరి :** గ్రామ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీకి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఇతర శాఖల పని చేసే కార్యదర్శులకు సర్వేలకు కొన్ని లక్షణాలు మినహాయింపులు కల్పించి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యదర్శులు ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దరఖాస్తుల స్వీకరణ వాటిని ఆన్లైన్ చేయడం వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడం మిషన్ భగీరథ ఇంటింటి నల్ల సర్వే నిర్వహించడం ఎల్ఆర్ఎస్ సర్వే నిర్వహించడం ఇటీవల నిర్వహించిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులగడన సర్వేలో కీలకపాత్ర కార్యదర్శులు అని పేర్కొన్నారు. అలాగే డేటా ఎంట్రీలో కార్యదర్శులు కీలకపాత్ర వహించారని విధులు మరియు డేటా ఎంట్రీ విధులు విజయవంతంగా చేశామన్నారు. పది నెలలుగా గ్రామాలలో పాలకవర్గాలు లేకపోయినా నిధులు లేకపోయినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజల అన్ని సౌకర్యాలను తీరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రకారం ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల సహకారం చేయడానికి తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వే చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తూనే 5 ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలను తమరి ద్వారా జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి చేరవేయాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో మరియు ఎంపీవోలు పూర్తి సహకారం అందించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే గ్రామ కార్యదర్శిలకు పనులపై ఒత్తిడి తీసుకురాకూడదని సర్వే వంటి కార్యక్రమాలను పండుగ వేళ ఆదివారాల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నుండి పంచాయితీ కార్యదర్శి గ్రేడ్ 4 గా నియామకమైన వారికి ఎఫెక్టివ్ డేట్ ఆఫ్ అపాయింట్మెంట్ తో పాటు నాలుగు సంవత్సరాల సర్వీస్ కలపాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంతోష్ , సలావత్ భద్రు, కిరణ్, ఎండి షావుద్దీన్, రాజేష్ కుమార్, రమేష్ , శిరీష, నవ్య విజయలక్ష్మి , అంజద్ పాషా, నందు లాల్ , అంజలిధర్ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేవరకు సర్వే చేయం

అధికారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల వినతి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** తమ సమస్యలు పరిష్కరించేదాకా ఎలాంటి సర్వేలు చేయమని పంచాయతీ కార్యదర్శుల తెలిపారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించిన తరువాతనే ఇందిరమ్మ ఇండ్ల సర్వే చూపడతామని సోమవారం ఎంపిడిఒ, ఎంపిఒలకు వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం పూర్తయినప్పటికీ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని గత సంవత్సరం నుంచి ఎదురు చూస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చెప్పిన అన్ని పనులను అంకిత భావంతో పూర్తి చేస్తూ, మిషన్ భగీరథ సర్వే, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్, డిజిటల్ కార్డులు, కుల ఐన, ఆర్థిక సర్వే, ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ గృహ నిర్మాణం లబ్ధిదారుల ఎంపిక, సిఎం కప్, స్థానిక సంస్థల ఎలక్షన్స్ వార్డుల విభజన మొదలైన పనులు చేస్తున్నప్పటికీ తమ సమస్యలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ అయ్యి సంవత్సరం గడిచినప్పటికి ఇప్పటి వరకు ప్రొబేషన్ డిక్లేర్ చేయలేదని, ఈవిషయం ప్రభుత్వం దృష్టికి తీసుకపోయిన పట్టించుకోవడంలేదని తెలిపారు. గ్రామ పంచాయతీలలో నిధులు లేనప్పటికి పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులతో అభివృద్ధి పనులను చేస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల విధులను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇండ్ల లబ్దిదారుల సర్వే చేయడంతో ఇండ్లు రానివారి నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నం దున ఇందిరమ్మ ఇళ్ళ సర్వే నుంచి తమను మినహాయించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

# రైతులను వ్యాపారవేత్తలుగా మార్చేలా కృషికల్ప ఫౌండేషన్ సేవలు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** రైతులకు వ్యవసాయం ద్వారా ఆదాయం పెరుగుదల, మార్కెట్ సహాయం అందించి వ్యాపారవేత్తలుగా మార్చేందుగే కృషికల్ప ఫౌండేషన్ కృషి చేస్తుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఐడిఒసిలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సంయుక్తంగా కృషి కల్ప, జిల్లా యంత్రాంగా సహకారంతో నిర్వహించిన 'అగ్రిసినర్జీ 2024' కార్యక్రమానికి కలెక్టర్ హాజరై అగ్రిటెక్ స్టార్టప్‌ల ప్రదర్శన తిలకించారు, అనంతరం మాట్లాడారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకునేందుకు,మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పంటను ప్రోత్సహించి ఎక్కువ దిగుబడినిచ్చే పంటలను సాగుబడిలో అధునాతన సాంకేతిక పద్ధతుల వినియోగం తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించి (ఫార్మర్ ప్రోడ్యూసింగ్ ఆర్గనైజేషన్)తో కృషికల్ప ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, కృషికల్ప ఫౌండేషన్ సిఇఒ సిఎం పాటిల్, నాబార్డ్ డిడిఎం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలన

కెకె మహేందర్‌రెడ్డి





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీశ్రేణులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజా పాలనలో ప్రజా విజయోత్సవాలలో భాగంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 3, 2023 తేదినా జరిగిన ఎలక్షన్‌లో నియంతృత్వ నిరంకుశ పరిపాలనను అంతమొందించాలని తెలంగాణ ప్రజలు తిరగబడి తీర్పు నిచ్చారని అన్నారు. ఆర్థిక ఒడిదొడుకులు ఎదుర్కొని సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని అన్నారు. యువ వికాసం పేరిట స్పోర్ట్స్ కాలేజి, స్కిల్ యూనివర్సిటి రైతన్నలకు నేతన్నలకు గీత కార్మికులకు, సబ్బండ వర్గాలకు సమానంగా చూసి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో దోచుకుని తిని దాచిపెట్టుకున్నారని అన్నారు. ఇలాంటి పరిపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం చరమగీతం పాడుతుందన్నారు. ప్రజాస్వామ్య యువతమైన పరిపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని కేకే మహేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, సంగీతం శ్రీనివాస్, వెలుముల స్వరూప, గడ్డం నర్సయ్య, కాముని వనిత, కల్లూరి చందన, సూర దేవరాజు, మడుపు శ్రీదేవి, ఆకునూరి బాలరాజు, తిరుపతి రెడ్డి, నలినీ కాంత్, శ్రీకాంత్, కాసర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారం

టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్

సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్ అన్నారు. సోమవారం టిపిసిసి లీగల్ సెల్ ఆధ్వర్యంలో సిరిసిల్ల కోర్టు బార్ అసోసియేషన్ ప్రాంగణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. చైర్మన్ ఇరుకుల అశ్విన్, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీకి తెలంగాణ జాతి ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తిప్పవరం అనిల్, వివేక్, గోడిశెల భగవాన్, కరుణాకర్, అన్సర్ అలీ, బొద్దుల రాజేష్, కిషోర్, యమున, జైశ్వర్య, అంజూష, లీగల్ సెల్ బృందంతదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా పుల్లయ్య

### పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం (ఎస్‌జిపి ఏటి) సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులుగా పరిశ పుల్లయ్య, ప్రధాన కార్య దర్శిగా రాయల రవికుమార్ లు ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా కనపర్తి వెం కటేశ్వర్లు, సహాధ్యక్షులుగా కన్నెకంటి కృష్ణమూర్తి, ఐవి భాస్కరాచారి లు ఎ న్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షులుగా బి. కృష్ణకు మారి, వి. మేరీఏసుపాదం, టి. అంజలి, జి. లక్ష్మి సుజాత, వి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా పెదమా ళ్ల సత్యనారాయణ, కొల్లికొండ శరత్‌బాబు, పమిడిమర్రి వీరభద్రరావు, ఊ దుగు వెంకటేశ్వర్లు, జి. రామనాథం, పివిఆర్‌కె ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. సలహా మండలిగా ఐదుగురిని, కార్యదర్శులుగా ఆరుగురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రవికుమార్ లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారుల పట్ల సానుకూలత వ్యక్తం చేయడం లేదని పలు సమస్యలను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. డిఏ సహా పలు సమస్యల పరిష్కారం కోసం పింఛన్‌దారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యాచరణ చేపడతామన్నారు.

## 11న పాత పార్శిల్స్ వేలం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆర్‌టిసి కార్గో నందు పాత పార్శిల్స్‌ను ఈనెల 11న ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఏటిఎం ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం డిపో పరిధి లోని ఖమ్మం బస్టాండ్ నందు కార్గో అండ్ పార్శిల్ సర్వీస్ విభాగానికి సంబంధించి వినియోగదారులు తీసుకెళ్లని పాత పార్శిల్స్‌ను ఈనెల 11 న బుధవారం ఉదయం 11 గంటలకు ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పా టలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. లాజిస్టిక్ ఆఫీస్ పరిధిలోని పె ండి ంగ్ పార్శిల్స్ క్లియరెన్స్ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## లంచం అడిగి.. ఎసిబికి చిక్కి



### ఖజానా కార్యాలయంలో అవినీతి అధికారి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖజానా కార్యాలయంలో తిష్టవేసిన అవినీతి అధికారులు లంచాలు ఇవ్వనిదే కాగితం కదిపేది లేదన్న విషయానికి ఈ ఘటన అద్దంపడుతు ంది. పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగికి రా వాల్సిన మొత్తాన్ని ఇచ్చేందుకు 10 శాతం చొప్పున డిమాండ్ చేసిన ఓ అధికారి ఇప్పుడు ఏ సిబికి చిక్కి విచారణను ఎదుర్కొంటున్నారు. తిరుమలాయపాలెం మండ లంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్‌గా పనిచేసిన నాగయ్య పదవి విరమణ తర్వాత ఆయనకు రావాల్సిన పింఛన్, ఏరియ ర్స్‌కు సంబంధించి నాలుగు లక్షల కోసం కుటుంబ సభ్యులు ఖజానా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఖజానా శాఖలో సీ నియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నగేష్ 10 శాతం చొప్పున నాలుగు లక్ష లకు రూ. 40వేలు ఇస్తే మంజూరు చేయిస్తానని చెప్పాడు. నాగయ్య కుటుంబ సభ్యులతో పలుమార్లు లంచం కోసం డిమాండ్ చేసిన విష యాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఏసిబి అధికారులను ఆశ్రయించారు. నాగయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏసిబి అధికారులు సోమ వారం నూతన కలెక్టరేట్‌లోని ఖజానా కార్యాలయంలో వాయిస్ రికార్డు, వీడియో రికార్డుల ఆధారంగా నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### మత్తు జీవితాన్ని నాశనం చేస్తుంది

### డాక్టర్ ఉదయలక్ష్మి




**ప్రజాపక్షం/వైరా:**వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య సిబ్బందితో కళాశాల విద్యార్థు లకు వ్యక్తిత్వ వికాసం టెలీ, మానస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. డాక్టర్ ఉదయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి చిన్న విషయానికి కుంగిపో వడానికి డ్రగ్స్, మత్తు ధూమపానం మద్యపానం గుట్కాలకు బానిస కావ ద్దని పార్టీకి బానిసకావడం వలన విచక్షణ కోల్పోతారని తెలిపారు. ప్రిన్సి పాల్ నవీనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిళ్ళకు లోనుకా కూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వివిఎస్‌ఆర్‌కె శాస్త్రి, జి.ధనలక్ష్మి, ఎంవి.నర్సింహారావు, అనంతరాములు, ఎన్ఎస్ఎస్ పివో బి.ఈశ్వరరావు, స్టూడెంట్ కౌన్సిలర్ ఎన్.ప్రసాద్‌బాబు, లైబ్రేరి యన్ స్వప్న, పలువురు లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే షురూ...!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే సోమవారం ప్రారంభించారు. ప్రజాపాలన లో వచ్చిన ధరఖాస్తుదారుల ఇళ్ల కు వెళ్లి ఇంటి వివరాలు, స్థితిగతులను ప్రభుత్వం అందించిన యాప్ లో నమోదు చేస్తున్నారు. మండలం లోని నేలకొండపల్లి, బోదులబండ, కొత్త కొత్తూరు గ్రామాలలో సర్వే ను మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతా రాములు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, కొత్తకొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ లు సర్వే ను పరిశీ లించారు. అధికారులు సర్వే బృందాల కు పలు సూచనలు, సలహాలు అందించారు. లబ్ధిదారుల వివరాలలో నమోదు లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అప్రమతంగా చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సర్వేలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సర్వే పని తీరును పరిశీలించిన ఎంపిఒ సునీల్ శర్మ:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు సర్వే బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈ సర్వేను గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి, మండల పరిషత్ పంచాయితీ అధి కారి సునీల్ శర్మ పరిశీలించారు. స్థానిక పంచాయితీ కార్యదర్శి బాల య్యకు మొబైల్ యాప్‌లో సర్వే పనితీరుపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఇందిరా మహిళ నిర్మాణానికి సంబంధించి యాప్ ద్వారా సర్వే నిర్వహించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు అందించా లనే లక్ష్యంతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక సెక్రటరీలను బాధ్యులుగా చేశారని అన్నారు. సెక్రటరీ యాప్ ద్వారా ప్రజాపాలనాల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరా లను మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలలో సర్వే చేసి మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్ చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్ర మంలో కంప్యూటర్ ఆపరేటర్ రవి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

# అటు మబ్బులు...ఇటు కుప్పలు...!

*కంటి మీద కునుకు ఉంటే ఒట్టు

*కుప్పల వద్దనే జాగారం చేస్తున్న రైతులు.





**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**పండించిన ధాన్యం ను విక్ర యించుకోవటానికి రైతులు నానా అగచాట్లు పడుతు న్నారు. తేమ పేరుతో మిల్లర్లు ధాన్యం ను మిల్లులో దిం చుకోవటానికి కొర్రీలు పెడుతున్నారు. దీంతో కొనుగోలు నత్తనకడ సాగుతున్నాయి. దీనికి తోడు వాతావరణం లో మబ్బులు రావటంతో పాటు అక్కడక్కడ పడుతున్న వర్షా లతో అవస్థలు పడుతున్నారు. వారం రోజులు గా ఆకా శంలో వస్తున్న మబ్బులతో రైతుల గుండెల్లో గుబులు రే పుతుంది. రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద పడిగాపు లు కాయాల్సి వస్తుంది. వాతావరణం చల్లగా ఉండి మ బ్బులు రావటంతో తేమ రావటం లేదని ధాన్యం కొనుగో లు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో రైతులకు ఇబ్బ ందిగా మారింది. ఆదివారం ఉదయం నుంచి మబ్బులు పట్టి వర్ష సూచనలు కనిపించటంతో కుప్పలు వద్ద రైతు లు జాగరం చేశారు. ఉదయం ఆరబెట్టటం.... సాయ ంత్రం కుప్ప పోయటం తో తో రైతులు అవస్థలు పడుతు న్నారు. చేతికందిన పంట వర్షార్పణం అవుతుం దని...రైతులు కళ్లలో ఒత్తులు వేసుకుని పంట వద్దనే నిద్ర స్తున్నారు. నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం , బైరవునిపల్లి తదితర కేంద్రాల వద్ద రహదారులు వెంట ధాన్యం కుప్పలు కిలో మీటర్లు కొద్ది ఆరబెట్టారు. చినుకు పడితే అంతే సంగతి...రైతులు పంట ను వదులుకునే పరి స్థితులు కనిపిస్తున్నాయి. కారు మబ్బులు కమ్ముతుంటే ..రైతు కంటి మీద కునుకు లేకుండా ఆకాశం వైపు చూస్తున్నారు. ఎప్పుడు కొంప ముంచుతుందోనని ఆ ందోళన చెందుతున్నారు. నిబంధనలు సడలించి వెంటనే కొనుగోలు చేయకపోతే రైతుల పరిస్థితి దారుణంగా ఉం టుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

**పది రోజులుగా రాశుల వద్ద పడిగాపులు...**

కె.వెంకయ్య, బైరవునిపల్లి, కౌలురైతు.

పంట ఆరబెట్టి పది రోజులు అవుతుంది. ప్రతీ రోజు భ యం భయంగా జాగారం చేయాల్సి వస్తుంది. ఉదయం ఆరబెట్టటం...సాయంత్రం పోగేయటం....తోనే రోజు సరిపోతుంది. మబ్బులు కమ్మటంతో భయంతో వణికిపో తున్నాం. ఇప్పటికైనా కొనుగోలు త్వరగా చేపట్టాలి..

**నిబంధనలు సడలించాలి...**

ఖాజామోహినుద్దీన్, మాజీ ఎంపిటిసి, ముజ్జుగూడెం.

కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు సడలించాల్సిన అవ సరం ఎంతైనా ఉంది. తేమ పేరుతో రోజుల తరబడి ధా న్యం రాశుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం ని బంధనలు సడలించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రా లలో కాంటాలు వేగవంతంగా చేపట్టాలి. రైతులను ఆదు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**చివర గింజ వరకు కొనుగోలు చేయాలి...**

కర్నాటి భానుప్రసాద్, రైతు సంఘం నాయకులు, నేలకొండపల్లి.

రైతులు పండించిన పంట చివర గింజ వరకు కొనుగోలు చేయాల్సిందే. రైతులకు సబ్సిడీ పై పట్టాలు అందించాలి. కాంటాలు వేగవంతంగా చేపట్టి..మిల్లర్ల వద్ద తరుగు విషయం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. అవ సరమైతే తడిసిన ధాన్యం ను కూడ కొనుగోలు చేయాలి

## దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖా స్తులను త్వరితగతిన పరిష్క రించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధి కారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సంద ర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో రాజే శ్వరితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు చింతలచెరువు కోటేశ్వరరావు గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకం కోసం చెల్లించిన వాటా ధనం మాత్రమే తిరిగి చెల్లించారని ప్రభుత్వ హామీ ప్రకారం పథకాన్ని 100 రోజుల్లో నగదు బదిలీ రూపంలో అమలు చేయాలని దరఖాస్తు చేశారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన తోటకూరి భద్రమ్మ సర్వే నెం. 56/1లో 9.36 ఎకరాల భూమి తన భర్త పేరున ఉందని తన భర్త మరణించినందున సదరు భూమిని తన పేరున బదలాయించాలని దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం శ్రీరాం గిరి గ్రామానికి చెందిన లక్ష్మి తనకు ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్డును అందిం చాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం పుట్ట కోట ప్రాంతానికి చెందిన ఎస్‌కె సైదా తనకు ప్రమాదంలో ఎడమ కాలు విరిగిందని తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం ప్రకాష్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ సైదాబీ తాను దివ్యాంగురాలినని తన భర్త మృతి చెందాడని తనకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## తుదిశ్వాస వరకూ పేదల కోసం పోరాడుదాం..

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు:** తుది శ్వాస వరకు పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేద్దా మని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య అన్నారు. బాపనకుంట గ్రామంలో చింతల దశరథ ఆధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా బి అయోధ్య హాజరై మాట్లాడుతూ బాపనకుంట గ్రామంలో మున్సిపాలిటీ కావడం వలన వంద రోజుల పని లేక మహి ళలు, గ్రామ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ గ్రామాన్ని పంచాయ తీగా చేయాలని మేము కూడా కోరుతున్నామన్నారు. కమ్యూ నిస్టు పార్టీకి కంచుకోటగా ఉన్నటువంటి బాపన కుంటగ్రా మంలో అందరూ కలిసి పెద్ద ఎత్తున నల్లమల్ల గిరిప్రసాద్ స్థూపాన్ని నిర్మించుకొని ఆదర్శంగా నిలిచారని వారి పోరాటం స్ఫూర్తి ధాయకమన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పార్టీ నిరంతరం పని చేస్తుందని దీనిని కాపా డుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. మున్సిపాలిటీ గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా ఉందని సైడ్ కాలువ లేక వర్షం వస్తే మొత్తం ఇండ్ల మీదికి వచ్చే పరిస్థితి ఉందని, సైడ్ కాలువ నిర్మాణం చేపట్టాలని, కాలువలు కూడిక తీయక పోవడం వలన దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, క్లోరినేషన్ చేయాలని, వీధి దీపాలు లేని చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సంబంధిత మునిసిపల్ శాఖ కనీసం కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేదని, సైడ్ కాలవలు కడితే నీరు ఆగకుండా వెళ్ళిపోతుందన్నారు. మున్సిపాలిటీ అక్క డక్కడ పోయిన వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. మన పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా వాడవాడల పార్టీ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శిసరెడ్డి పుల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, జక్కుల రాజబాబు, కనతాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. శాఖ గౌరవ అధ్యక్షులుగా చింతల దశరథ శాఖ కార్యదర్శిగా, చల్ల కాంతరావు, సహాయ కార్యదర్శిగా పోతుల వెంకటరెడ్డి, కోశాధికారిగా కోర్సం సత్యం మరియు కమిటీ సభ్యులు ఎన్నుకు న్నారు.

## అన్ని ఆవిష్కరణలకూ సైన్సే కారణం

-* ప్రశ్నించడంతో పాటు పరిశోధనాత్మకంగా ఆలోచించాలి

* అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

* జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆదిమానవుల నుంచి నేటి వరకు అన్ని ఆవిష్కరణలకు సైన్స్ కారణమని అద నపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం బల్లేప ల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో విక్రమ్ సారాబాయి ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక, ఇన్‌స్పైర్‌ను ముఖ్య అతి థిగా హాజరైన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రశ్నించే గుణాన్ని పెంపొందించుకోవడంతో పాటు పరిశోధనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. ఆదిమానవుని నుంచి నేటి వరకు అన్ని ఆవిష్కరణలకు సైన్స్ మూల కారణ మని తెలిపారు. విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగా లలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. సమాజా నికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు విద్యార్థి దశ నుంచే శ్రీకారం చుట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మానవ ప్రగతికి కారణమైన చక్రం, నిప్పు, ఇంజన్ మొదలైన అంశాల ప్రదర్శనలతో మేడసాని శేషగిరిరావు రచించిన పాటకు విద్యార్థుల నృత్యం అద్భుతంగా ఉందని సైన్స్‌ను ఈవిధంగా చూపడం సంభ్రమాశ్చర్యా లకు గురి చేసిందని అదనపు కలెక్టర్ తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ టివిలు, సెల్‌ఫోన్లు మొదలైన సౌకర్యాలు సద్వినియోగం చేసుకుంటే మానవ ప్రగతికి ఉపయోగపడతాయని వాటిని దుర్విని యోగం చేయడం ద్వారా విద్యార్థులు నష్టపోతారని తెలి పారు. విజ్ఞాన ఆవిష్కరణలు మానవ ప్రగతికి ఉపయోగ పడాలని డిఈవో సోమశేఖర శర్మ తెలిపారు. వాటి సక్రమ వినియోగమే మానవ ప్రగతికి సోపానమని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక తను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంత గానో దోహదపడతాయన్నారు. ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట విద్యా , వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనను సంద ర్శించి విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనా లను పరిశీలించారు. నమూనాలకు సంబంధించి వివ రాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తక్కువ సమయంలో పెద్ద ఎత్తున నమూనాలు తయారు చేసి ప్రదర్శించిన విద్యార్థులను, గైడ్ టీచర్లను, ఎంఈవో లను, జిల్లా సైన్స్ అధికారిణి డిఈవో అభినందించారు. విద్యా, వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 530 ఎగ్జిబిట్లు, 119 ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఆక స్మాత్తుగా వచ్చే వర్షం నుండి పంటను కాపాడుకునేం దుకు చేసిన నమూనా, మల్టీ రిఫ్లెక్టర్ ద్వారా ఏర్పాటు చేసిన డిప్ వెల్, ఇతర నమూనాలు ప్రదర్శనను తిలకిం చడానికి వచ్చిన విద్యార్థులను, ఆహుతులను ఎంత గానో ఆకట్టుకున్నాయి.

## రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** రైలు కింద పడి విద్యార్థిని ఆత్మ హత్య చేసుకున్న ఘటన సోమవారం ఖమ్మంలో చోటు చేసుకుంది. స్థానిక హార్వెస్ట్ విద్యాలయంలో పదవ తర గతి చదువుతున్న లక్ష్మి నక్షత్ర (14) అనే విద్యార్థిని ఖమ్మం నగరంలోని వాణి ఐటిఐ కళాశాల సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి నక్షత్ర తండ్రి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాం ట్రాక్ట్ కార్మి కులకు ప్రతి నెలా 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, తీ వ్ర జాప్యం జ రుగుతున్న నేపథ్యంలో కా ంట్రాక్ట్ కార్మి కులకు చెల్లించాల్సిన వేతనా ల బిల్లులను క్లియర్ చేయకుండా పక్కన పెట్టి నిర్ల క్ష్యంగా చేస్తున్న ఎకౌంట్స్ అధికారుల ని ర్లక్ష్యం విడనాడాలని డిమాండ్ చే స్తూ సి ంగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవా రం కార్పొరేట్ సివిల్ కార్యాలయం వద్ద ని ర సన తెలిపారు. ఈ సంద ర్భంగా కొత్తగూ డెం రీజి యన్ కార్యదర్శి యర్ర గాని కృష్ణ య్య మాట్లా డుతూ తక్షణమే వేతనా లు చె ల్లింపుకు అన్ని విభాగాల ప్రధాన అ ధికారులు చర్యలు తీసుకోవాలని, బి ల్లు లు క్లియర్ కావడానికి అవసరమైన కృ షి చే యాలని డిమాండ్ చేశారు. లేని యె డ ల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హె చ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేసరిసింహారావు ,వినోద, అన సూర్య, వి జయలక్ష్మి ,పద్మ పా ల్గొన్నారు.

## వివాహితపై అత్యాచార యత్నం

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓ వివాహి తపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేష న్‌లో బాధిత మహిళ సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... రఘునాథ పాలెం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్‌కు చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయ కుని బంధువు ఒకరు అత్యాచార యత్నా నికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి సదరు మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడు కలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనం గా నిర్వహిం చారు. సోమవారం సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా జిల్లా అధ్య క్షు లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి బాణా సంచా కా ల్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సోనియా గాంధీ జన్మదిన సంద ర్భంగా నగ రంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్ర మంలో వృద్ధు లు, అనాథలకు , మానసిక విక లాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిపాటి వెంక య్య, పుచ్చకాయల వీర భద్రం, వడ్డెబోయిన నర్సింహారావు,కార్పొరేట ర్లు మలీదు వెంక , లకావత్ సైదులు, రా పర్తి శ రత్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**ఎంపి క్యాంపు కార్యాలయంలో :**సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఖమ్మం లోక్ సభ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి క్యాం పు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా పసాద్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్య క్రమంలో నాయకులు మద్దినేని స్వర్ణకు మా రి, కొప్పుల చంద్రశేఖర్, దొబ్బల సౌజన్య, మి క్కిలినేని నరేంద్ర, మందడపు మనోహర్, బోడ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

**సర్వజ్ఞలో గ్రీన్‌డే వేడుకలు:**ఖమ్మం నగరం లోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠ శాలలో గ్రీన్ డే వేడుకలను ఘనంగా నిర్వ హి ంచారు. సోమవారం పాఠశాలలో నిర్వ హిం చిన గ్రీన్ డే వేడుకల్లో విద్యార్థులు ఆకు పచ్చ దుస్తులు ధరించి ఆకుపచ్చని రం గు ల తో, బెలూన్లతో ప్రాంగణాన్ని పచ్చ దనంతో తీర్చిదిద్దారు. ఈ సందర్భ ంగా పాఠ శాల డై రెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకు మార్,నీలిమలుమాట్లాడుతూ విద్యా ర్థులంతాపచ్చనివ స్త్రాలు ధరించి గ్రీన్ డే నిర్వహి ంచడం సంతో షంగా ఉం దన్నారు.ఈకార్యక్రమంలోప్రి న్సిపా ల్ ,అధ్యాపకులు,సిబ్బందిపాల్గొన్నారు.

**కోయచలకలో :** ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కోయ చలక గ్రామంలో ఘనంగా నిర్వ హించారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు మాధంశెట్టి హన్మంతరావు, గ్రామశాఖ అధ్య ర్యంలో నిర్వహించిన సోనియా గాంధీ జన్మ దిన వేడు కలకు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మాను కొండ రాధాకిషోర్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్ల కాంగ్రెస్ కా ర్యకర్తల పోరాట ఫలితంగానే ప్రజా పరి పా లన వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కా ర ్యక్రమంలో నాయకులు మేళ్లచెరువు రాం ప్ర సాద్, చెరుకూరి పూర్ణచందర్‌రావు, ము త్త య్య, పా ల్గొ న్నారు.

## ఆంధ్రా నుండి ఛత్తీస్‌గఢ్‌కు రేషన్ బియ్యం అక్రమ రవాణ

### - భద్రాచలంలో పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం:**భద్రాచలం మీదుగా అక్రమంగా తరలించుకుపో తున్న 258 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం, ఏపిలోని హనుమాన్ జంక్షన్ నుండి భద్రా చలం మీదుగా సోమవారం తెల్లవారుఝామున సిజి 04 పిఎన్ 4289 నెంబర్ గల లారీలో 258 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలించుకుపోతు న్నారు. లారీ భద్రాచలం బ్రిడ్జి సమీపంలోనికి రాగానే దానిని ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ ఆపకుండా వేగంగా వెళ్లిపోతుండటంతో పోలీస్‌లు, సివిల్ సప్లై అధికారులు వెంటపడి స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో అడ్డ గించి పట్టుకున్నారు. అనంతరం లారీ డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చిన అధికారులు పత్రాలు చూపిం చాలని అడగటంతో నోరుమెదపడం లేదు. దీంతో లారీలో తనిఖీలు నిర్వహిం చగా అందులో బియ్యం బస్తాలు కనిపించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నట్లు నిర్ధారించుకున్న సివిల్ సప్లై అధికారులు బియ్యం లోడ్‌తో ఉన్న లారీని జిసిసి గోదాముకు తరలించి రేషన్ బియ్యాన్ని దింపించారు. అనంతరం లారీని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం విలువ సుమారు 10 లక్షలు ఉంటుం దని డిటి శ్రీనివాస్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ళ సర్వేకు జిల్లా ప్రజలందరూ సహకరించాలి

### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లా ప్రజలందరూ పాల్గొని సరైన సమాచారం అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాపాలన ఆరు గ్యారెంటీలలో భాగంగా 4వ గ్యారంటీ అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారి వివరాలను సేకరణను మొబైల్ యాప్ లో నమోదుకు సర్వే చేయబడుతుందని, జియో టాకింగ్ ఫోటో తీసుకోబడుతుందని, గతంలో ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ఇంటి స్థల ధృవీకరణ పత్రాలను, లబ్దిదారుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలు, ఖచ్చితమైన సమాచారం అందించాల్సిందిగా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల ను, ఎంపిడిఒలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 18004257109ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు

### స్త్రీవాద నాయకులు జ్యోతి, సుమాదేవి పిలుపు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అవకాశాలు వాటంతట అవి రావని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని, అప్పుడే దానికి సార్థకత వస్తుందని ప్రముఖ స్త్రీవాద నాయకులు జ్యోతి, సుమాదేవి అభిప్రాయ పడ్డారు. తెలంగాణ రాష్ట్ర కవుల సంక్షేమ సంఘం, ఏకశిలా కరోకే క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన 12వ సాహిత్య సంగీత సమ్మేళన కార్యక్రమం హనుమకొండలోని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ జగదీష్ బాబు హాస్పిటల్ సెమినార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సాహిత్య, సంగీత సమ్మేళనం ఎంతో మంది నూతన గాయనీ గాయకులకు, కవులకు వేదికగా నిలుస్తుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. శ్రవణానంద, నయనానంద భరితంగా జరిగిన కార్యక్రమంలో 15 మంది కవులు,15 మంది గాయనీ గాయకులు పాల్గొని వారి వారి కవిత్రయంతో, పాటలతో అలరించారు. అంతర్గతంగ నిర్వహించిన పోటీల్లో గెలిచిన గాయకులకు,కళాకారులకు,ప్రముఖులకు పర్యావరణ హితంగా ఉండాలని జూట్ బ్యాగులను బహుమతులుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థల వ్యవస్థాపకులు సిరాజుద్దీన్,రాజకుమార్,విజయ్ కుమార్, రవికుమార్, రేవతి, సుధారాణి, గాయకులు,కవులు, లక్ష్మి నారాయణ, శ్రీమన్నారాయణ, రవి, కిషన్, చంద్ర ప్రభాకర్, రామేశ్వర చారి, సుధాకర్, శ్రీలత, స్వప్న, శిరీష, విజయ నిర్మల, రెహమాన్, ప్రియాంక, స్వరూప, శిల్ప, వకుళ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాలలో బంద్ ప్రశాంతం

### వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు



**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు) :** ములుగు జిల్లా మారుమూల ఏజెన్సీ ప్రాంతాలైన వెంకటాపురం, వాజేడు మండలాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతుంది. ఏటూరు నాగారం మండలంలోని చల్పాకలోని పోల్ కమ్మ వాగు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని దానికి నిరసనగా ఈ నెల 9వ తేదీన మావోయిస్టులు బంద్‌కు పిలుపునివ్వడంతో బంద్ సంపూర్ణంగా కొనసాగింది. చిరు వ్యాపారులు సైతం దుకాణాలు తెరవకపోవడంతో నిత్యావసర వస్తువుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు తనిఖీలతో పాటు అడవుల్లో కూంబింగ్ సైతం చేపట్టారు. అంతేకాకుండా ప్రధాన రహదారులపై వాహన తనిఖీలు నిర్వహిస్తూ కొత్త వ్యక్తుల సమాచారాన్ని రాబడుతున్నారు. వెంకటాపురం సర్కిల్ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. మావోయిస్టులు దుశ్చర్యలకు పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలుస్తుంది. బంద్‌కు పిలుపునివ్వడమే కాకుండా పిఎల్‌జిఏ వారోత్సవాల ముగింపు సందర్భంగా మావోయిస్టులు ఏమైనా అఘాయిత్యానికి పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు, మావోయిస్టుల టార్గెట్‌లో ఉన్న పలువురిని అప్రమత్తం చేసి హెచ్చరించినట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే నైట్ హాల్ట్ బస్సు సర్వీసులను ఇప్పటికే రద్దు చేశారు. ఏది ఏమైనా ఏ క్షనం ఏం జరుగుతుందోనని ఏజెన్సీవాసులు బిక్కు బిక్కుమంటు జీవనం సాగిస్తున్నారు.

## 50 శాతం హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా పాత రేట్లపైన 50 శాతం హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ఎఐఎఫ్‌టియు(న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోడెం మల్లేశం అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐఎఫ్‌టియు న్యూ అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు పలు డిమాండ్‌తో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైస్ మిల్లులలో దిగుమతికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను రద్దు చేయాలని, 50 సంవత్సరములు నిండిన హమాలీ కార్మికుడికి నెలకు రూ.5వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని, కార్మికులు పనిచేయుచున్న పరిశ్రమలలో తాగునీటి సౌకర్యం, విశ్రాంతికి షెడ్ల నిర్మాణం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం తెచ్చి, పని భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఈర్ల పైడి, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు ఈరెల్లి రామచందర్, ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు బీరం రాము, గంటా శంకర్, మరియు కార్మిక సంఘం నాయకులు రొట్టె శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, చిన్న పేల్లి పోశాలు, మెరుగు జనార్ధన్, గడ్డం శ్రీనివాస్, మంద మల్లయ్య, బాస రాజేందర్, గాదం రవి, అజ్మీర చందర్, దుదేలా సధి, గాజ సాంబన్న, ఏకాంబరం, ఐలయ్య, భూక్య రాజు, కొలిపాక మొగిలి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

### ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించాలి సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ల ఆదేశాలు






**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డిఆర్ఒ విజయలక్ష్మి, నర్సంపేట ఆర్‌డిఒలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్‌పిసిఇఒ రామ్ రెడ్డిలు పాల్గొని ప్రజల సమస్యల పైన వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 104 రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై 53 దరఖాస్తులు, మిగతా శాఖల వారీగా డిఆర్‌డిఒ 2, జిడబ్ల్యుఎంసి 1, సివిల్ సప్లై 7, పోలీస్ డిపార్ట్మెంట్ 1, డిఎం అండ్ హెచ్ ఒ 3, డిడబ్ల్యు 1, రీజినల్ కోఆర్డినేటర్ టిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ 2, జిల్లా వ్యవసాయ శాఖ 7, జిల్లా పంచాయతీరాజ్ 3, జిల్లా విద్యాశాఖ అధికారి 4,జిల్లా ఉపాధి కల్పన శాఖ 3, జిల్లా పశుసంవర్ధక శాఖ 1, ఇరిగేషన్ 3, జడ్‌పి సిఇఒ 5, ఎల్‌డిఎం 2, డిటిడబ్ల్యుఒ1, ఆర్‌టిఎ 3, శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని వాటిని సంబదిత శాఖల అధికారులకు ఎండార్స్ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డిసిఒ నీరజ, వరంగల్ తహసిల్దాఆర్ ఇక్బాల్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ విధ్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, తదితర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 35 దరఖాస్తుల

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జి సంపత్‌రావు, ఆర్‌డిఓ వెంకటేష్‌లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖ 13, పెన్షన్లు 1, ఇందిరమ్మ ఇండ్లు 5, ఉద్యోగ ఉపాధి కొరకు 2, ఇతర శాఖలకు సంబంధించినవి 14,మొత్తం 35 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రకాష్, డిసిఒ సర్దార్‌సింగ్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి తుల రవి, డిసిఎస్ఒ షా ఫైజల్ హుస్సే ని, డిఎం డిసిఎస్ఒ రాంపతి, ఎటిడిఒ దేశిరాం, డిడబ్ల్యు ఒ ఇన్‌చార్జి శిరీష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

### ఆర్జీలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం /జనగామ ప్రతినిధి :** ప్రజావాణి ఆర్జీలపై వివిధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల్ని వారు స్వీకరించి ఆయా శాఖల అధికారులను బదిలీ చేశారు. పలు సమస్యలపై ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల నుండి వచ్చే ఆర్జీలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ ప్రజావాణిలో జనగామ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, హనుమాన్‌నాయక్, డిఆర్‌డిఓ వసంత, డిపిఓ స్వరూప, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సరస్వతి, డిడబ్ల్యుఒ డిఎఒ పోరెన్స్, డిఎఒ రామారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.



### పకడ్బందీగా క్రిస్మస్ వేడుకలు : అదనపు కలెక్టర్

క్రిస్మస్ వేడుకల్ని పకడ్బందిగా నిర్వయించాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సూచించారు. సోమవారం క్రిస్మస్ వేడుకలపై పాస్టర్లు, తహశీల్దార్లు, సబందిత అధికారులతో సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మాట్లాడుతూ క్రిస్మస్ వే డుకలను తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా పనులు జరగాలని, నియోజకవర్గం, మండలానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, ఎలాంటి పొరపా ట్లు జరగకుండా చూడాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను పకడ్బందిగా అమలుచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, అన్ని మండలాల తహాశీల్దార్లు, క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు.

## అక్రమ శాంపిల్స్ మందులు స్వాధీనం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన ఫిజీషియన్ శాంపిల్స్ మందులను అక్రమంగా అమ్ముతున్న మెడికల్ షాపును సీజ్ చేసి మందులను హనుమకొండ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్వాధీనపరుచుకున్నారు. వివరాల్లోకెళ్తే హన్మకొండ మండలం వేలేరు మండల కేంద్రంలోని క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ పై శనివారం సాయంత్రం హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో క్రాంతి మెడికల్ స్టోర్ లో అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్న రూపాయలు లక్ష రూపాయల విలువగల ఫిజీషియన్ శాంపిల్స్ మందులను స్వాధీనపరుచుకున్నారు. రోగులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది వీటిని అమ్మడం నిబంధన ప్రకారం నిషేధం ఉంది . డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలా హసన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించి 65 రకాల ఈ ఫిజిషన్స్ శాంపిల్స్‌తో పాటు మరికొన్ని కాలం చెల్లిన మందులను సైతం స్వాధీనపరుచుకున్నట్లు హనంకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ తెలిపారు. సంబంధిత మెడికల్ షాప్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తెలిపారు. హనుమకొండ పట్టణంలోనూ పలు ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఈ రకంగా నిబంధన లకు విరుద్ధంగా అక్రమంగా అమ్మకాలు కొనసాగుతున్నాయని వాటిపైన డ్రగ్ కంట్రోల్ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారించాలి

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్ని శాఖల జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఒసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంపై దృష్టి సారించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన 25 దరఖాస్తులను స్వీకరించి పరిష్కరానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం చాలా ముఖ్యమని, ప్రతి శాఖలో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సమస్యల పరిష్కారానికి సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం తర్వాత దరఖాస్తుదారునికి సమాచారం అందించాల్సి బాధ్యత ప్రతి అధికారి పై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులు పరిష్కరించిన వెంటనే ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ మంగిలాల్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి

### కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత రేవంత్‌దే : బండి సుధాకర్ గౌడ్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** అడుగడుగునా కష్టాలు, అధికార పార్టీ నిర్బంధం, ఒక వైపు కక్షసాధింపులను, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, మరోవైపు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి, పార్టీకి జవసత్వాలు తెచ్చి, ఏకతాటిపై నడిపించి, అధికారంలోకి తెచ్చి విజయవంతంగా సిఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడుతూ పదునైన వ్యూహ రచనతో పార్టీలోని అన్ని గ్రూపులను సమన్వయం చేసుకోవడం సిఎంకు వెన్నతో పెట్టిన విద్య అని, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి, అధికార పగ్గాలు చేపట్టి, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని, మంత్రిగా అనుభవం లేకున్నా, సిఎం పీఠం అధిరోహించి, తనదైన శైలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తూ అన్నివర్గాల ప్రశంసలందుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకం వలన రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, బిఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని దుస్థితి వ చ్చిందని, పాత ప్రభుత్వం కాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు 60 వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించాల్సిన బకాయిలున్నాయని, ఈ చిక్కుముడులన్నింటినీ ఒక్కొక్కటిగా విప్పుకుం టూ రేవంత్ సర్కారు ముం దుకు సాగుతున్నద న్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా ఏడాది అవుతున్నదని, ఇంత స్వల్ప కాలంలోనే దాదాపు 60 వేల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు పెట్టిన రేవంత్ తనదైన మార్కును, మార్పును కనబరిచారని, కేంద్రంతో సత్సంబంధాలు నెరుపుతూ తెలంగాణ అభివృద్ధి కొరకు పాటుపడుతున్న సిఎం రేవంత్ రెడ్డిని చూసి ప్రతిపక్ష నేతలు సైతం ప్రశంసించక తప్పడంలేదన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ, వారి దుష్ప్రచారాన్ని తిప్పకొడుతూ, వారి కుయుక్తులను చిత్తు చేస్తూ, ప్రజల ముందు ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులను దోషులుగా నిలబెట్టడంలో సిఎం రేవంత్ రెడ్డి సఫలీకృతుడయ్యారని, ముఖ్యమంత్రి పదవి అనేది అలంకార ప్రాయం కానేకాదని, కష్టపడి పనిచేసి, తెలంగాణ ప్రజలు తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యం, తపన అని స్పష్టంగా చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి, దాన్ని చేసి చూపిస్తున్నాడని, ఏడాది క్రితం 2023 డిసెంబర్ 7 నాడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిని సిఎం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తే, బిఆర్ఎస్ పసలేని ఆరోపణలు చేస్తున్నదని, తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి ఆగిపోయిందని, రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తూ, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను చెడగొడుతున్నాయని, వాస్తవంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఆర్థిక సంక్షోభం తలెత్తి సమస్యలు వస్తే, అవి ఒక్క తెలంగాణలోనే వచ్చినట్లుగా ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇక మూసీ విషయంలో ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి పార్టీలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలూ శ్రమిస్తున్న శ్రామికుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందరూ అండగా నిలువాలని కోరారు.



## వ్యవసాయ అధికారులూ.. మీరెక్కడా?



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట మండల కేంద్రంలో అగ్రికల్చర్ అధికారులు సిబ్బంది కానరావడం లేదు సోమవారం అవసరాలకోసం ఏ ఓ కార్యాలయం వచ్చిన రైతులు ఎవరిని సలహాలు సూచనలు అడగాలో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. కార్యాలయాలు తెరచి ఉంటాయి కానీ అందులో ఎవరు వుండటం లేదు. ఇట్టి విషయమై ఏ ఓ ను వివరణ కోరగా ఈ రోజు మీటింగ్ ఉంది అందరం మీటింగ్ వచ్చాము రేపు రండి అంటూ సమాధానం చెపుతున్నాడు. ఎప్పుడైనా సమావేశాలు ఉన్న యెడల గ్రామీణ స్థాయిలో ప్రజలకు తెలిసే విధంగా ప్రకటనలు జారీ చేసి విషయన్ని తెలియపరచాలి. లేకపోవడంతో అవసర నిమిత్తం గ్రామీణ ప్రాంతాల ప్రజలు కార్యాలయం చుట్టూ వలసలు తీరుతున్నారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



**ప్రజాపక్షం/రాయపర్తి :** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనీ కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గారే నర్సయ్య, బోనగిరి ఎల్లయ్య, కుక్కల భాస్కర్, కొదాటి దయాకర్ రావు, భూక్యా భద్రు, చిన్నాల వనజలక్ష్మినారాయణ, చిన్నాల తారశ్రీ రాజబాబులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేద్దామని ఆస్తులు అమ్మి, అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టి పనులు చేస్తే ఇప్పటివరకు మా బిల్లులు మాకు ఇవ్వడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో మా బిల్లులు అడిగే అర్హత మాకు లేదా అని,బిల్లుల విషయమై ప్రభుత్వంకు విజ్ఞప్తి చేయడానికి హైదరాబాద్‌కు పయనమైతే అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బందించడం ఎంతవరుకు సమంజసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి,మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు సురేందర్ రావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

## ఐసియులో నీతి.. బాడీ బిల్డర్‌లా అవినీతి..!

### హనుమకొండలో జ్వాల సంస్థ, లోక్ సత్తా వినూత్న ర్యాలీ

### డిసెంబర్9ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** నీతి, నిజాయితీ బక్క చిక్కి పోతున్నదని, కొన ప్రాణంతో ఐసియులో కొట్టు మిట్టాడుతోందని, బాడీ బిల్డర్ల లా కండలు తిరిగి అవినీతి పెరిగిపోతున్నదని, నీతి నిజాయితీని కాపాడుకుందాం.. అవినీతిపై పోరాడుదాం.. అంటూ వరంగల్ కేంద్రంగా గత 15 సంవత్సరాలుగా అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న జ్వాల సంస్థ వినూత్న ర్యాలీ నిర్వహించింది. అంబులెన్స్‌లో ఐసియు పేషెంట్‌ను నీతి నిజాయితీగా, కండలు తిరిగిన బాడీ బిల్డర్లను అవినీతిగా పోలుస్తూ.. హనుమకొండలో సోమవారం నిర్వహించిన ఈ ర్యాలీ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హనుమకొండ వేయి స్తంభాల గుడి ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ప్రదర్శనలో.. ఎన్‌సిసి విద్యార్థులు, జ్వాల సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీని లోక్ సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారుడు ప్రొఫెసర్ పి. కోదండ రామారావు జెండా ఊపి ప్రరంభించారు. ఈ సందర్భంగా జ్వాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. నీతి నిజాయితీ అధికారులకు సమాజంలో ప్రోత్సాహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణ దశలో ఉన్న నీతి నిజాయితీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. నానాటికి పెరిగిపోతున్న అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అవినీతి నిరోధక శాఖ ద్వారా పట్టుబడిన ప్రభుత్వ అధికారుల కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎసిబి ద్వారా పట్టుబడిన కేసులు నిరూపితం కాకపోవడంతో ప్రభుత్వ అధికారులకు భయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినం అయిన డిసెంబర్ 9 .. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం కావడంతో.. అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి ఏట రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేయాలని, వారి ఆస్తులను ప్రతి సంవత్సరం ప్రకటించి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉండాలని కోరారు. లోక్ సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారుడు ప్రొఫెసర్ పి. కోదండ రామారావు మాట్లాడుతూ.. చెరువులు, కుంటలను కాపాడేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసిన విధంగానే ఎసిబిని మరింత పట్టిష్ట పరిచేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిడిసిఎల్ ఎఇ అశోక్ కుమార్. ప్రకాష్, బుర్రి కృష్ణమూర్తి, అచ్చే అమర్నాథ్, బుద్దె సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మస్థైర్యంతో బాలికలు ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/నెక్కొండ :** బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ అన్నారు. సోమవారం నెక్కొండ మండలం అప్పలరావుపేట జెడ్‌పి హైస్కూల్‌లో సమగ్ర శిక్ష పథకంలో భాగంగా రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్ష ప్రశిక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. మూడు నెలలపాటు బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ గడ్డం రాజు విద్యార్థినిలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## పిడిఎఫ్ రైస్ నిల్వ ఉన్న ఇంటికి సీల్ వేసిన అధికారులు



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన బాజా తిరుమలయ్య ఇంట్లో పిడిఎఫ్ రైస్ అక్రమ నిల్వ చేశాడని సమాచారంతో సంబంధించిన సివిల్ సప్లై ఓ ఎస్ డి ద్రోణాచార్యులు ఆధ్వర్యంలో తిరుమలయ్య ఇంటిని ప్రజల సమక్షంలో తాళాలు వేసి సీల్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై విజిలెన్స్ ఓ ఎస్‌డి ఎస్పీ ద్రోనాచార్యులు తాహాసిల్దార్ ప్రభాకర్, ఎస్సై సాంబశివరావు, నిజాంపేట ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఈమాద్, పోలీస్ కానిస్టేబుల్ నాగరాజు, సాయిబాబా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బడిబయటి పిల్లలను బడుల్లో చేర్పించాలి: సిడిపిఒ



**ప్రజాపక్షం/ఎడపలి:** ప్రతీ చిన్నారిని బడుల్లోనే చదివించాలని బడిబయటి పిల్లలను బడుల్లో చేర్పించాలని బోధన్ సీడీపీఓ జానకీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఎడపల్లి మండల కేంద్రం శివారులో సాటాపూర్ గేటు వద్ద రైల్వే పనుల నిమిత్తం వచ్చిన కుటుంబాల్లోని పిల్లలు బడి బయట ఉన్నారనే సమాచారం మేరకు బోధన్ సీడీపీఓ, ఎడపల్లి మండల సూపర్ వైజర్ విజయ రాణితో పాటు సెక్రెటరీ సాయి, అంగన్‌వాడీ టీచర్లు సందర్శించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను స్థానిక దుబ్బాతండా అంగన్‌వాడీ కేంద్రంలో, బడి ఈడు వయస్సున్న పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను పనిలోకి తీసుకెళ్లరాదని, ప్రతీ ఒక్కరినీ చదివించాలని హెచ్చరించారు. అనంతరం దుబ్బాతండా అంగన్‌వాడీ కేద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ దశరథ్, ప్రాథమిక పాఠశాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** గ్రామాలలో గతంలో పనిచేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లు కోసం ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించతలపెట్టిన తాజా మాజీ సర్పంచ్‌లను జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకొని శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శివ్వంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు హెడ్‌కానిస్టేబుళ్లు సాయిలు, దేవదాసు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

## అక్రమంగా నిర్మించిన ఇండ్లపై చర్య తీసుకోవాలి



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ మునిసిపల్ పరిధిలోని జర్నలిస్టు కాలనీలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన రెండు ఇండ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతు సోమవారం బిజెపి నాయకులు సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టు కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో గుత్తేదారు అదనంగా రెండు ఇండ్లు నిర్మించడం జరిగిందని, నిర్మించిన ఇండ్లను ఇటీవల అధికార పార్టీకి చెందిన వ్యక్తి, మరొకరు మీడియా ప్రతినిదికి రెండు ఇండ్లను కట్టబెడుతున్నారని, ప్రభుత్వ స్తలాలను యథేచ్ఛగా కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన వాటిపై సమగ్రంగా విచారించి ప్రభుత్వ స్తలాలను అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడలని లేనిపక్షంలో బిజెపి పార్టీ ఆద్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. పట్టణంలో భువన్ సర్వే ద్వారా అదనంగా పన్నులు విధిస్తు, ప్రజలకు వంద రూపాయలు ఉన్న పన్నును, వెయ్యి రూపాయలకు పెంచి వసూలు చేస్తున్నారని, సర్వే వందశాతం పూర్తయిన తర్వాతనే పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, తుప్తి ప్రసాద్, సీనియర్ నాయకులుగంగారెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న మహిపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మండల కేంద్రమైన మనోహరాబాద్ లో పురం గిరిధర్ గురుస్వామి నిర్వహించిన 18 మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, మనోహరాబాద్ తాజా మాజీ సర్పంచ్ చిట్కుల మహిపాల్ రెడ్డి హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కావేరి వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు జూపల్లి మల్లారెడ్డి, నాగరాజ్ గౌడ్ రాహుల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీరబోయిన నరేష్ ముదిరాజ్, అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు.

## మందిరం స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** మందిరం స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కమిటీ సభ్యులు ప్రజావాణిలో సభ్యులు ఆనంద్, కృష్ణ ఫిర్యాదు చేశారు. న ందిపేట్ మండలం షాపూర్ గ్రామంలోని నల్ల పోచమ్మ ఆలయంకు సంబంధించిన స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని గ్రామ కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెం. 469 లో నాలుగు ఎకరాల 10 గుంటల భూమిని నలుగురు కొనుగోలు చేశారని, ఈ భూమి నుంచి నాలుగు గుంటల స్థలాన్ని నల్లపోచమ్మ ఆలయంకు గతంలోనే అమ్మిన వ్యక్తులు ఇవ్వటం జరిగిందన్నారు. ఆ తర్వాత ఇదే భూమిని తరులు కొనుగోలు చేయగా నల్లపోచమ్మ దేవాలయంకు సంబంధించిన స్థలాన్ని తమదంటూ కొనుగోలుదారులు కబ్జా చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి కొనుగోలుదారులు వెనక్కి తగ్గకపోవటంతో జిలత్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మందిరం భూమిని కబ్జా చేసుకోవటమే కాకుండా అక్కడికి వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని మందిరం స్థలాన్ని కబ్జా నుండి కాపాడాలని గ్రామ కమిటీ సభ్యులు కోరారు.

# ప్రజావాణి కార్యక్రమానికి 74 ఫిర్యాదులు

### కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 74 పిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదు దారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్‌ఓ పద్మజ రాణి ఆర్డీఓ రవీందర్ రెడ్డిలకు విన్నవిస్తు ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన**



ఎన్నికల నియమావళిని అనుసరించి , ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు మాసాలకు ఒకమారు ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలించాలి,. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు స్థానిక ఓల్డ్ ,డిఆర్‌డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ సమీప ప్రాంతంలోని భద్రతా ఏర్పాట్లను పోలీస్ బందోబస్తును సీసీ కెమెరాల పనితీరు, విద్యుత్ సౌకర్యం, స్ట్రాంవ రూమ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనిచేసే విధానాన్ని పరిశీలించి అవి నిరంతరం పనిచేస్తున్నాయా, విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగుతుందా అన్నది పరిశీలించి ఆవరోధ లేవైనా ఉంటే వెంటనే నివారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి పటిష్ఠమైన భద్రతా జాగ్రత్తలు పాటించాలంటూ కలెక్టర్ సూచనలు చేశారు. రిజిస్ట్రలను తనిఖీ చేసి తగిన సంతకాలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం భద్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మౌళిక వసతుల మెరుగుదలపై రూమ్ చుట్టూ పరిశీలించి ఎటువంటి ఆవాంఛనాయ పరిస్థిలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## అసెంబ్లీకి ట్రాక్టర్ మీద వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/బైంసా:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, అదిలాబాద్ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ వినూత్నంగా సమావేశాలకు హాజరయ్యారు. గతం లో ధోతి కట్టుకుని రైతుల పక్షాన వెళ్లారు. ఈ సారి వినూత్నంగా ట్రాక్టర్‌ను తానే స్వయంగా నడుపుతూ తీసుకెళ్లారు. అందరూ ఎమ్మెల్యేలు కాన్వాయ్, సెక్యూరిటీతో రాగా.. ఎమ్మెల్యేలు ట్రాక్టర్ మీద వచ్చారు. స్వయంగా తానే డ్రైవింగ్ చేస్తూ అసెంబ్లీలోకి ఎంట్రీ ఇచ్చిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంద్ది. ఈ విషయాన్ని రామారావు పటేల్ తెలిపారు. కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ సైతం ఉన్నారు.

## ఆర్మూర్ కౌన్సిలర్లు అక్రమవసూళ్ళు మానుకోవాలి

### సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** పట్టణంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపదుతున్న ప్రజల నుండి అనుమతుల కొరకు కౌన్సిలర్లు అక్రమంగా 50 వేల నుండి లక్ష రూపాయల వరకు వసూలు చేయడం మానుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరెపల్లి సాయిలు అన్నారు. సోమవారం ఆర్మూర్ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణ ప్రజలు వార్డు అభివృద్ధికి సహకరిస్తారని ఎంతో నమ్మకంతో మునిసిపల్ కౌన్సిలర్లను గెలిపిస్తే బరితెగించి డబ్బులు వసూలు చేయడం ఏంటని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై ఆర్మూర్ ప్రజలకు మునిసిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే పేద మధ్య తరగతి ప్రజలు అప్పులు తెచ్చుకుని సొంత యింటి కలను నెరవేర్చుకోవాలని ఆశతో ఉన్నా వారిపై బలహీనతను ఆసరాగా తీసుకొని డబ్బులు వసూలు చేయడం ఏంటని అన్నారు. ఒకపక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి వేస్తుంటే మరోపక్క కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేయడం ఏంటని ఆయన అన్నారు. తక్షణమే దీనిపై కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమలాపురం రాజన్న, సీను, నరేష్, రాజు, మంగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఇన్‌చార్జి డీపీఓ శ్రీనివాస్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 60 కేసులలో పట్టుబడిన గంజాయి ధ్వంసం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్ డీసీ ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ స్టేషన్ పరిధిలో 60 కేసులలో గంజాయి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. పట్టుబడిన దాంట్లో (1007.02) కేజీల ఎండు గంజాయి (35) కేజీల గంజాయి చాక్లెట్లు (7)కేజీల డైజోఫామ్ (8) కేజీల అల్ప్రాజోలం, (2) గంజాయి మొక్కలను జక్రాన్‌పల్లి మండలం మెడికల్ సర్వీసెస్ పడకల్ గ్రామం నందు ధ్వంసం చేయడం జరిగిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓలు సిబ్బంది ధ్వంసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులపై అక్రమ కేసులు...?

### ఆర్‌డిఓ ను నిర్బంధిస్తే .. వారి డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు..

### డ్రైవర్ ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన పోలీసులు..






**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** ఇథనాల్ ఫ్యాక్టరీని నిలిపివేయాలని దిలావర్పూర్ మండలం తో పాటు గుండంపల్లి, చర్లపల్లి తదితర గ్రామాల ప్రజలు బైంసా, నిర్మల్ జాతీయ రహదారిని దిగ్భంధించి తమ గ్రామాలకు న్యాయం చేయాలని, ప్రభుత్వాలు దిగివచ్చే వరకు తమ నిరసనను విరవించబోమని తెలియజేసిన రైతులకు మరోసారి మోసమే జరిగిందని చెప్పాలి. రెండు గ్రామాల మహిళలు ఆర్డీవోను చుట్టుముట్టి తమకు న్యాయం చేయాలని గోడు వెళ్ళబోచుకున్నారు. నాటకీయ పరిణామాల మధ్యలో సొమ్మసిల్లి పడిపోయిన ఆర్డిఓను వెంటనే అంబులెన్స్ ద్వారా నిర్మల్ తీసుకెళ్లారు. దీంతో ఆర్డిఓ డ్రైవర్‌ను అడ్డుకున్నారని వారిపై కేసులు నమోదు చేయడంపై పలు అనుమానాలు కూడా లేకపోలేదు. ఆర్డీవోను అడ్డుకున్న రెండు గ్రామాలకు చెందిన మహిళల పేర్లు ఆ డ్రైవర్ కు ఎలా తెలుసు..? దీని వెనుక కారకులు ఎవరు..?దేవుడని మొక్కుతే దయ్యమైనట్లు ..హారతులు పట్టుకుని ఎస్పిని, కలెక్టర్‌ను పూజించినందుకు ఇదో శిక్షే. న్యాయం చేస్తారునుకంటే నట్టేట ముంచే ప్రయత్నం చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో సారి ఉద్యమం తప్పదా..? వారేమైనా ఉగ్రవాదుల... దేశద్రోహుల.. నక్సలైట్ల.. ఆర్డీవో డ్రైవర్ చెప్పితే కేసు ఎలా పెడతారు.. డ్రైవర్ ని నిర్బంధించారా..? ఏ రకంగా కేసు నమోదు చేశారు. ప్రభుత్వం ఏమైనా కేసులు పెట్టమందా..? శాంతియుతంగా ధర్నాను విరమించి హారతులు పట్టుకుని పూజించినందుకు ఇలాంటి అక్రమ కేసులు పెట్టి మరింత హింసించే ప్రయత్నమే జరగుతుందని రెండు గ్రామాల ప్రజలలో మరోసారి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శాంతియుతంగా133 రోజులు నిరవధికంగా ఆందోళనలు చేస్తే ప్రభుత్వం దిగివచ్చి ఇథనల్ పరిశ్రమను రద్దు చేయగా ఇది రైతుల విజయంగా వారు భావించినప్పటికీ తిరిగి పోలీసులు మరోసారి రెచ్చగొట్టే విధంగా కేసులు నమోదు చేసి,సమస్యను జటిలం చేశారని, వీటన్నిటికీ సమాధానం చెప్పాల్సిన భాధ్యత ఎస్పి,కలెక్టర్ పైనే ఉందని పలువురు భావిస్తున్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు యువకుడి అర్ధనగ్న నిరసన..

**ప్రజాపక్షం/బైంసా:** కుబీర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు పార్టీ బి గ్రామానికి చెందిన దళిత యువకుడు శంకర్ పెట్రోల్ బాటిల్ పట్టుకొని అర్ధనగ్న నిరసన చేపట్టారు. ప్రధాన ద్వారం గేటుకు తాళం వేసి మార్కెట కమిటీ చైర్మన్ పదవి దళిత వర్గానికి ఉన్నందున్న చిన్న చూపుతో ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపిస్తూ గేటు బయట బైఠాయించారు.వెంటనే పదవిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అక్కడికి చేరుకున్న పోలీసులు యువకున్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్ పాత్ర కీలకం...

### అసెంబ్లీలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/బైంసా:** నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి బిజెపి ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్ పాత్ర అమోఘమని,స్వర్గీయ చిన్నమ్మని విస్మరించడం ఏంటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ప్రశ్నించారు.అసెంబ్లీలో పది సంవత్సరాల కు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసినందుకు ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే తెలంగాణ రాలేదని,ఎందరో అమరుల త్యాగమని ఆరోజు ప్రతిపక్ష నాయకురాలు తీర్మానానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.ఆదేవిధంగా గత ప్రభుత్వ తప్పిదాల వల్లే తెలంగాణ ప్రగతి ఆగిపోయిందని,మళ్లీ అలాంటి తప్పిదాలు చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు.నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ విస్మరిస్తూ మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం సరికాదని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు,మంత్రులకు సూచించారు.

## కస్తూర్బా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న కస్తూరిబా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎడి గ్యామ్మెల్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కస్తూరిబా ఎస్ఒలు మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, భావి భారత పౌరులుగా విద్యార్థులను దిద్దే తాము ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష మన రాష్ట్రంలోని విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. ఎన్నో ఏళ్లు గా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని ఇప్పటికైనా తమను గుర్తించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష సిబ్బందిని విద్యాశాఖలో విలీనం చేసి తమను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూపాయలు 10 లక్షల వరకు, ఆరోగ్య బీమా 10 లక్షల వరకు సౌకర్యం కల్పించాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారు అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు నలంద, నాగసుధ, అరుణ, స్వప్న, పవిత్ర, ప్రవీణ, సుమలత,రమాదేవి, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

## ఉద్యోగుల సమ్మెకు ఎస్‌టియుటిఎస్ మద్దతు..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఎస్టియుటీఎస్ ఉపాధ్యాయ సంఘం అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగ ఉపాధ్యాయుల రిలే నిరాహార దీక్షకు వారు సంఘీభావం తెలిపారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని,న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలన్నారు.

## సింగరేణి ఉద్యోగుల 55వ వార్షిక రక్షణవారోత్సవాలు



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతి సంవత్సరం వార్షిక రక్షణ పక్షోత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సూర్యానారాయణ అన్నారు. సోమవారం ఏరియాలోని సిహెచ్‌పిలో వార్షిక రక్షణ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయనతో పాటు ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జిఎం ఇ అండ్ ఎంపి ఎలీషా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు రక్షణ వారోత్సవాలలో మీ అందరితో పాటుగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఉద్యోగులందరి సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్స్ పై అవగాహన కలిగి, పనులలో వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ తమ యొక్క రక్షణతో పాటు ఇతరుల రక్షణను కూడా ఎల్లవేళలా చూస్తూ ఉండాలని సూచించారు. సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళుతుందని, దానిని సాధించే క్రమంలో రక్షణ ఎవరూ మరువకూడదని సూచించారు.అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పని విధానాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, వారు తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను గమనిస్తామని తెలిపారు. ప్రతిరోజు రక్షణతో పని చేయాలని సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని కోరారు. రక్షణ పక్షోత్సవాల ఇన్స్పెక్షన్ కమిటీ వారు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ సేఫ్టీ కమిటీ వారితో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో జరిగిన పూర్వపు ప్రమాదాలు, అటువంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఉండడానికి తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి కూలంకషంగా చర్చించారు. అనంతరం ప్లాంట్ లో తీసుకుంటున్న రక్షణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, చంద్రలింగం, ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు గాబ్రియల్ రాజు, డాక్టర్ పద్మ, మహేంద్రనాథ్, హనుమాన్ గౌడ్, వెంకటేశ్వర్లు, టి సతీష్ కుమార్, జి శ్రీనివాస్, తిరుపతి, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడ

# సౌతాఫ్రికా ఘన విజయం..

## టీమిండియాకు సంకటం!



సొంతగడ్డపై సౌతాఫ్రికా మరో సిరీస్ విజయాన్నందుకుంది. అసాధారణ ప్రదర్శనతో శ్రీలంకతో రెండు టెస్ట్ సిరీస్‌ను 2 0తో క్లీన్ స్వీప్ చేసింది. సోమవారం ముగిసిన రెం డో టెస్ట్లో సౌతాఫ్రికా 109 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. 348 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన శ్రీలంక 238 పరుగులకు కుప్పకూలింది. కేశవ్ మహ రాజ్(5/76) ఐదు వికెట్లతో శ్రీలంక పత నాన్ని శాసించగా.. కగిసో రబడా, డేన్ పీటర్సన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మార్కో జాన్సెనుకు ఓ వికెట్ దక్కింది. శ్రీలంక బ్యాటర్లలో కెప్టెన్ ధనుంజ డిసిల్వా(92 బంతుల్లో 7ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించగా.. కుశాల్ మెండీస్ (76 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 46) పర్వా లేదనిపించాడు. ఈమ్యాచోలో ముందుగా బ్యా టింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్‌లో 358 పరుగులు చేయగా.. శ్రీలంక కూడా 328 పరు గులతో ధీటుగా బదులిచ్చింది. రెండో ఇన్నింగ్స్లో సౌతాఫ్రికా 317 పరుగులు చేసి 348 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. ఈ విజ యంతో వరల్ టెస్ట్ ఛాంపియ న్షిప్ ఫైనల్ బెర్త్ అవ కాశాలను సౌతాఫ్రికా మెరుగుపరుచుకుం ది. తాజా విజయంతో పాయింట్స్ ఆస్ట్రేలి యాను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. డబ్ల్యూటీసీ 202325 సైకిల్లో 10 మ్యాచ్లు ఆడిన సౌతాఫ్రికా 6 విజయా లు, 63.33 విన్నింగ్ పర్సంటేజీతో అగ్రస్థా నంలో నిలిచింది. డబ్ల్యూటీసీ సైకిల్లో సౌతా ఫ్రికా మరో సిరీస్ ఆడనుంది. సొంతగడ్డపై డిసెంబర్ 26 నుంచి పాకిస్థాన్‌లో జరిగే రెండు టెస్ట్ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలిచినా సౌతాఫ్రికా డబ్ల్యూటీ సీ ఫైనల్ బెర్త్ ఖరారవు తోంది. సౌతాఫ్రికా తాజా విజయంతో టీమిం డియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవ కాశాలు సంక్లి ష్టంగా మారాయి. 60.71 విన్ని ంగ్ పర్సంటే జీతో ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతుం డగా.. 57.29 విన్నింగ్ పర్సంటేజీతో టీమిం డియా మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుత పరి స్థితుల్లో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే.. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోని మిగతా మూడు మ్యాచ్లను గెలవాలి. అప్పుడే ఎలాంటి సమీకర ణాలు లేకుండా టీమిండియాకు ఫైనల్ బెర్త్ దక్కుతుం ది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ ఓడినా టీమిండియా అవకాశాలు చేజారుతాయి. ఒక వేళ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ 32తో గెలి స్తే.. ఆస్ట్రేలియా వర్సెస్ శ్రీలంక టెస్ట్ సిరీస్ ఫలి తంపై ఆధారపడాల్సి ఉంటుంది. భారత్ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్‌ను శ్రీలంక 20తో గెలవాలి. శ్రీలంకపై టెస్ట్ సిరీస్ విజయంతో సౌతాఫ్రికా ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయమవ్వగా.. మరో బెర్త్ కోసంభారత్, ఆసీస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

# మహమ్మద్ సిరాజ్ షాకిచ్చిన ఐసీసీ..

## ట్రావిస్ హెడ్‌కు మందలింపు!



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సి రాజ్, ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్లపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్( ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. అడిలైడ్ వేది కగా జరిగిన పింక్ బాల్ టెస్టో ఈ ఇద్దరూ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించి ఐసీసీ నియామ వళిని ఉల్లంఘించిన విషయం తెలిసిందే. దాం తో ఐసీసీ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంది. మహమ్మద్ సిరాజ్ మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించిన ఐసీసీ.. ట్రావిస్ హెడ్ మందలిం చింది. గత 24 నెలల్లో తొలి తప్పిదం కావడంతో ఇద్దరికి ఒక్కో డీమెరిట్ పాయింట్ కేటాయిం చింది. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్టో విధ్వంసకర శతకంతో చెలరేగిన ట్రావిస్ హెడ్ను ఔట్ చేసిన సిరాజ్.. ఆగ్రహంగా సంబరాలు చేసు కున్నాడు. దాంతో సహనం కోల్పోయిన ట్రావిస్ హెడ్ అసభ్య పదజాలం ఉపయోగించగా.. సిరాజ్ 'ఛల్ పో బే.. పో'అన్నట్లు సైగలు చేశాడు.ఈ ఘటన తీవ్ర వివాదాస్పదమవ్వగా.. మాజీ క్రికె టర్లు సిరాజ్ను తప్పుబట్టారు. అయితే ఈ గొడవలో ఇద్దరిది తప్పు ఉందని, అభ్యంతకరమైన పద జాలం, అసభ్య సైగలు చేశారని ఐసీసీ పేర్కొంది. తమ తప్పిదాలను ఇద్దరు ఆటగాళ్లు మ్యాచ్ రిఫరీ ముందు అంగీకరించడంతో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. 'సిరాజ్ ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.5ని ఉల్లంఘించాడు. ఈ రూల్ ప్రకారం ఆటగా ళ్లతో పాటు ఆటగాళ్ల సపోర్ట్ స్టాఫ్‌లను అసభ్యకర పదజాలంతో దూషించడం, సైగలు చేయడం, ఆగ్రహంతో కూడిన రియాక్షన్ ఇవ్వడం తప్పిదం. దాంతో అతని మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధిస్తూ చర్యలు తీసుకున్నాం. ట్రావిస్ హెడ్ ఆర్టి కల్ 2.13ని ఉల్లంఘించాడు. ఈ నియమం ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్లో ఆటగాళ్లు, వారి సహాయక సిబ్బంది, అంపైర్లు, మ్యాచ్ రిఫరీలను తిట్టడం నేరం. దాంతో అతన్ని మందలించాం. గత రెండేళ్లలో తొలి తప్పిదం కావడంతో ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించాం. ఇద్దరు ఆటగాళ్లు తమ తప్పిదాలను మ్యాచ్ రిఫరీ ముందు అంగీకరించారు.'అని ఐసీసీ తమ ప్రకట నలో పేర్కొంది.ఈ పింక్ బాల్ టెస్టో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. దాంతో ఐదు టెస్ట సిరీస్లో ఇరు జట్లు 11తో సమంగా నిలి చాయి. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి మూడో టెస్ట్ బ్రిస్బేన్ వేదికగా ప్రారంభం కానుంది.

# మొహమ్మద్ షమీ ఆల్‌రౌండ్ షో..

## క్వార్టర్ ఫైనల్లోకి బెంగాల్

**బెంగుళూరు:** సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టో ర్నీలో భాగంగా చండీఘడ్‌తో జరిగిన మ్యాచ్‌లో మొహమ్మద్ షమీ ఆల్‌రౌండ్ ప్రద ర్శనఇచ్చాడు. తొలుతబ్యాటింగ్‌లో 17బంతుల్లో 32రన్స్ స్కోర్ చేశాడు. ఆ తర్వాత 4ఓవర్లలో అతను 13డాట్ బాల్స్ వేశాడు. ఆసక్తిక రంగా సాగిన మ్యాచ్‌లో బెంగాల్ 4పరుగుల తేడాతో విజయం సాధిం చింది. 34 ఏళ్ల షమీ ఎస్ ఎంటి టి20 టోర్నీలో 8వ మ్యాచ్ ఆడాడు. అత ను ఫుల్ కోటా బౌలి ంగ్ చేశాడు.ఫిట్‌నెస్ నిరూ పించుకుంటున్న షమీ..ప్రస్తుతంఆటోర్నీలో మెరుగ్గా రాణిస్తు న్నా డు. సందీప్ శర్మ వేసిన ఫైనల్ ఓవర్లో అతను 19 రన్స్ రాబట్టాడు. నిర్ణీత ఓవర్లలో బెంగాల్ 9 వికెట్ల నష్టానికి159రన్స్ చేసింది. 114 పరుగు లకే 8వికెట్లు కోల్పోయిన దశలో షమీ తన బ్యా ట్‌తో పవర్ షాట్లు కురిపిం చాడు. అతని ఇన్నిం గ్‌లో రెండు సిక్సర్లు, మూ డు ఫోర్లు ఉన్నాయి. 160టార్గెట్‌తో బరిలోకి ది గిన చండీఘడ్.. 9 వికెట్లు కోల్పోయి 156 రన్స్ చేసింది.



# 'పుష్ప-2'బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట..

రీల్

## 4రోజుల్లో రూ.829 కోట్లు!

ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర 'పుష్ప2' రికా ర్డుల వేట కొనసాగుతూ ఉంది. ఐకా న్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినే షన్‌లో తెరకెక్కిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ ప్రేక్ష కులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అ య్యింది. ఇక ఈ సినిమాను థియేట ర్లలో ఎంజా య్ చేసేందుకు ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. సినిమా రిలీజ్ అయిన నాలుగు రోజుల్లో ఈ 'పుష్ప2' మూవీ ఇండియన్ సినిమా రికార్డులను తిరగరాస్తూ దూసుకెళ్తోంది. తాజాగా ఈ సినిమా నాలుగు రోజుల వరల్ వైడ్ కలెక్షన్ల వివరాలు మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమా నాలుగు రోజుల్లోనే ప్రపంచ వ్యా ప్తంగా ఏకంగా రూ.829 కోట్ల గ్రాస్ వసూళ్లతో సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. నాలుగు రోజుల్లోనే రూ.800 కోట్ల మార్క్‌ను అందుకున్న ఫాస్టెస్ట్ చిత్రంగా 'పుష్ప2' చరిత్ర సృష్టించింది. ఇక ఈ సినిమా జోరు మరో వారం పాటు ఇలాగే కొనసాగడం ఖాయమని సినీ వర్గాలు చెబుతు న్నాయి. దీంతో ఈ సినిమా కలెక్షన్స్ ఎక్కడి వరకు వెళ్తాయా అనే ఆసక్తి అందరిలో నెలకొంది. అల్లు అర్జున్ నటవిశ్వరూపంతో ఈ సినిమా నెక్స్ట్ లెవెల్లో పెర్ఫార్మ్ చేస్తుందని అభిమానులు సంతో షాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించగా దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు.



# విలన్ పాత్రలపై క్రేజీ కామెంట్స్



విలక్షణనటుడిగా మనోజ్ బా జేయీకి మం చి పేరు ఉం ది. బాలీవుడ్‌లో తనకంటూ ఓ మార్క్ ను క్రియేట్ చేసుకున్న మనోజ్ బా జ్ పై యీ తాజా గా ఇచ్చిన ఇంట ర్వ్యూలో తన లైఫ్ గురించి, అలాగే తన కెరీర్ గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చాడు. తన ఫ్యా మిలీ గురించి మనోజ్ బాజ్‌పైయీ మాట్లాడుతూ.. 'నేను బీహార్‌లోని ఓ మారుమూల గ్రామానికి చెందిన ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. ఓ రైతు కుటుంబం నుంచివచ్చిన తను, ఈ రోజు స్థాయిలో ఉండడానికి ఎంతో మొం డిగా, ధైర్యంగా ఉండాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చాడు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. 'నా కెరీర్ మలుపు తిప్పిన సినిమా 'సత్య'. ఆ సినిమాలో భికూ మాత్రే పాత్ర నాకు లైఫ్‌ను ఇచ్చింది. ఆ సినిమా తర్వాత నాకు అవకాశాలు పెరి గాయి. కానీ వచ్చిన అవకాశాలన్నీ విలన్‌గానే. అందుకే ఆ మూస ధోరణి విలన్ పాత్రలకి ఫుల్‌స్టాప్ పెట్టాను. ఆ సమయంలో అలాంటి విలన్ పాత్రలు చేయడా నికి నాకు ఎక్కువ డబ్బును ఆఫర్ చేశారు దర్శకనిర్మాతలు. వారితో ఒక్కటే చెప్పా. నేను సినిమా ఇండస్ట్రీలో విలన్‌గా ఉండాలనుకోవట్లేదు అని క్లారిటీ ఇ చ్చాను. అప్పుడు ఆ పాత్రలు చేయలేదు కాబట్టే.. ఇప్పుడు నాకంటూ ఓ మార్క్‌ను క్రియేట్ చేసుకోగలిగాను' అంటూ మనోజ్ బాజ్‌పైయీ తెలిపాడు.

## టీజర్‌తో ఆకట్టుకుంటున్న

# 'ద గర్ల్ ఫ్రెండ్'



రష్మికమందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'దగర్ల్ ఫ్రెండ్'. ప్రముఖ నటుడు దర్శకుడు రాహుల్ రవీం ద్రన్ తీస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్ రిలీజ్ అయిం ది. ఎమోషనల్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ సినిమా టీజర్ చాల బాగా ఆకట్టుకుంది. పైగా విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్ తో ఈ టీజర్ సాగడం విశేషం. 'నీకని మనసుని రాసిచ్చేసా.. పడ్డా నేమో ప్రేమలో బహుశా' అని విజయ్ దేవరకొండ చెబుతుంటే..స్క్రీ రష్మిక విజువల్స్ చాలా బా గున్నాయి. మొత్తానికి టీజర్ సినిమాపై అంచనా లను మరింతగా పెంచింది. ముఖ్యంగా టీజర్ మొత్తం రష్మిక క్లోజప్ షాట్స్ కనిపి ంచాయి. మొత్తానికి ఈ మూవీలో రష్మిక యాక్టింగ్ అదరగొట్టేయ బోతుందని పిస్తోంది. కాగా 'ద గర్ల్ ఫ్రెండ్' సినిమాని గీతా ఆరట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇక హేసమ్ అబ్దుల్ సంగీత మం దించగా.. 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి.. రష్మికకు జోడిగా కనిపించబో తున్నాడు. బహుశా ఫిబ్రవరిలో ఈ మూవీ రిలీజ్ ఉండొచ్చని సమాచారం.

# 'అఖండ—2' షూట్‌కు బోయపాటి కసరత్తు!

నటసింహం బాలయ్య బోయపాటి శ్రీను కాంబినే షన్లో వచ్చిన 'అఖండ' అద్భుత విజయాన్ని సాధిం చింది. దీంతో 'అఖండ—2 తాండవం'పై భారీ అ ంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇప్పుడున్న సమాచారం ప్రకారం వచ్చే నెల నుంచి ఓ యాక్షన్ షెడ్యూల్‌ను షూట్ చేస్తారని.. ఈ షెడ్యూల్‌లో బాలయ్యతో పాటు మిగిలిన టీమ్ కూ డా జాయిన్ అవుతారని, ఈ షెడ్యూల్ కోసం బో యపాటి కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం ఈ సినిమాలో నటించే నటీనటుల ఎం పిక పై దర్శకుడు బోయపాటి దృష్టి పెట్టారు. ఆల్ రెడీ, ఇప్పటికే పలు కీలక పాత్రల్లో ఇతర భాషల నటులను తీసుకోవాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యాన్ప రామ్ ఆ చంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. థమ న్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బోయ పాటి శ్రీను బాలయ్య కాంబినేషన్ లో హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. దీంతో 'అఖండ 2 తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి.



# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు

## ఎఐడి ఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని ఎఐడిఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే డిమాండ్ చేశారు. రోజు రోజుకు దేశంలో విస్తరిస్తున్న ప్రైవేట్ రంగా న్ని ప్రభుత్వం అనేక రాయితులు కల్పిస్తున్నప్పటికీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో ప్రజలు ముఖ్యంగా దళితులకు ప్రాధా న్యత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్ బహూదుర్ గౌర్ హాల్‌లో ఎఐడిఆర్ ఎం రెండవ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో చేయాలని ఎఐడిఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం బాల నరసింహ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.యేసు రత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎ.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జె. కుమారస్వామి, మేడ్చల్ జిల్లా అధ్య క్షులు జి. లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి కె.సహదేవలు హాజర య్యారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మల్ పాండ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధి కారం చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా దళితుల పైన ఆదివాసులపైన దాదులు మరింత పెరిగాయన్నారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా చెందాల్సిన హక్కులను సైతం మోడీ ప్రభుత్వం కల రాస్తోం దని అగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను ఆలంబిస్తూ దేశ సంపదను వారికి కట్టబెడుతోందని విమర్శించారు. ఈదేశంలో అనేక సంవత్స రాలుగా సమాజానికి దూరం గా ఉన్న దళితులకు ఈ దేశ సంపదలో వాటా దక్కకుండా అభివృద్ధికి ఆమడ దూరంగా చేసే విధంగా మనుధర్మ విధానాలను ఆలంబిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం. బాలనరసింహా మాట్లాడుతూ అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2 వ జాతీయ మహా సభలు 2025 జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జర గనున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 1000 మంది ప్రతినిధులు పాల్గొనున్నరన్నారు. ఈ మహాస భల్లో దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీ ర్ఘంగా చర్చించి దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యచరణ రూపొందించుకో వడానికి ఈ మహాసభలో వేదిక కానున్నాయని ఆయన వెల్లడించారు.

# తెలంగాణ తల్లి విగ్రహానికి అధికారిక ముద్ర

హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధి కారికంగా ఆమోదిస్తూ ప్రభుత్వం తెలుగులో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపా లని నిర్ణయించింది. తెలంగాణ తల్లి జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక కాబట్టి.. చిత్ర రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూప డాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ తల్లి చిత్రాన్ని బహిరంగంగా లేదా సామాజిక మాధ్యమాల్లో మాటలు, చేతలతో అగౌరవపర చడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం, కించపరచడాన్ని నేరంగా పరిగణించనున్నట్లు జిఒలో పేర్కొంది. డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్స వాన్ని రాష్ట్ర, జిల్లా, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార కార్యక్రమంగా జరుపు కోవాలని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర బహుజ నుల పోరాట పటిమ, సాంస్కృతిక, సంప్ర దాయ, వ్యవసాయ పద్ధతులను, శ్రమించే జీవన శైలిని, భావితరాలకు స్ఫూర్తిని కలిగించే చిహ్నంగా తెలంగాణ తల్లి ఉండాలని ప్రభుత్వం భావించినట్లు జిఒలో పేర్కొంది.

# ఉభయ సభలు 16కు వాయిదా

## ఈనెల 11,12న శాసనసభ వ్యవహారాలపైన ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలకు అవగాహన కార్యక్రమాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ,శాసనమండలి సమావే శాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. శాసనసభ, శాసనమండలి సమా వేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనంతరం 'తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు' అంశంపైన శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, శాసనమండ లిలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ప్రకటన చేశారు. ప్రకటన అనం తరం ఉభయ సభలలో చర్చలో సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఉభయ సభలు వాయిదాపడ్డాయి. కాగా శాసనభ వ్యవహారాలపైన హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో ఈ నెల 11,12న రెండు రోజులపాటు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ప్రొటోకాల్‌పై బిజెపి వర్సెస్ కాంగ్రెస్ గెసఎంఎల్‌ఏ వెంకటరమణారెడ్డి నిరసన శాసనసభ సమా వేశం ప్రారంభం కాగానే బిజెపి సభ్యులు కాటిపల్లివెంకటరమణారెడ్డి అధికా రులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదని నిరసిస్తూ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీటులో కూర్చున్నారు. దీనిని గమనించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇది ప్రొటోకాల్ ఉల్లంఘన కిందకు వస్తుందని, ఏదైనా సమస్య ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంఎల్ఏకు గౌరవం లేకుండా పోయిందని అందుకే తాను నిరసన తెలిపేందుకు శాసనసభ వ్యవహా రాల శాఖ మంత్రి స్థానంలో కూర్చున్నానని వెంకటరమణరెడ్డి అన్నారు. ప్రోటో కాల్ విషయమై చర్చ జరగాలని బిజెపి సభ్యులు పాయల్ శంకర్, వెంకటరమ ణారెడ్డి కోరారు. దీనిపైన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ ఒక్క రోజు తెలం గాణ తల్లి విగ్రహ ప్రకటనకే పరిమితం కావాలని, ఆ తర్వాత జరిగే సమావే శంలో ఈ విషయమై చర్చిద్దామని, ప్రోటోకాల్ సమస్య రాకుండా చర్యలు తీసు కుంటామని హామీనిచ్చారు. అయినా బిజెపి సభ్యులు చర్చకు పట్టుబట్టారు. మంత్రి శ్రీధర్‌బాబు పలు మార్లు చెప్పినా సభ్యులు చర్చకు పట్టుపడుతుండడం తో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకున్నారు. ప్రోటోకాల్ విషయమై తానే స్వయంగా 'మీమ్మల్ని' మంత్రిని తన ఛాంబర్‌కు పిలిచి సమస్యను పరి ష్కారమయ్యేలా చూస్తామని అన్నారు.తెలంగాణ తల్లి విగ్రహ ప్రకటనపై జరి గిన చర్చలో కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఎంఎల్‌ఏల గౌరవ అం శాన్ని తాను ప్రస్తావిస్తున్నానన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎంఎల్‌ఏల స్థానానికి గౌవరం ఇవ్వాలనే అంశంపై తాను మాట్లాడుతున్నాన న్నారు. తాను ఎన్నికల్లో గతంలో ఓడిపోయి ఉండొచ్చని, కానీ తనకు 25 ఏళ్ల కు పైగారాజ కీయ అనుభవం ఉందని, 'రేపు' తప్పనిసరిగా శాసనసభలో ఈ అంశంపై చర్చ కు అవకాశంకల్పించాలని,లేకపోతే తాము ఊరుకోమనిఆయన స్పష్టం చేశారు.





(మొదటి పేజీ తరువాయి)

# బహుజనుల అమ్మ రూపమే తెలంగాణ తల్లి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ఇతర శాఖ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసం గిస్తూ ఉద్యమ కాలంలో వివిధ రాజకీయ పార్టీలు తెలం గాణ తల్లికి వివిధ రూపాలు ఇచ్చారని, కానీ ఇప్పటివ రకు తెలంగాణ తల్లి రూపాన్ని అధికారికంగా ప్రకటించ లేదన్నారు. ఈ కారణంగానే ప్రజా ప్రభుత్వం బహుజ నుల తల్లి రూపమే తెలంగాణ తల్లి రూపంగా అధికారి కంగా ప్రకటించిందన్నారు. తెలంగాణ తల్లిని చూస్తే కన్నతల్లి ప్రతిరూపంగా స్ఫురిస్తోందన్నారు. ఉమ్మడి రా ష్ట్రంలో తెలంగాణ సంస్కృతిపై దాడి చేయడమే కాకుం డా అవమానించారన్నారు. రాష్ట్రం ఏర్పాటు తరువాత ఒక వ్యక్తి, ఒక రాజకీయ పార్టీ వారి గురించి మాత్రమే ఆలోచించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టా రని సిఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.కొంతమందికిబాధ, ఆవేదన, దుఃఖంఉండొచ్చని, వాళ్ల రాజకీయ మనుగడ కు ఈ నిర్ణ యాలు ప్రమాదకరమని వాళ్లు అనుకోవచ్చని, కానీఒక కుటుంబం కోసమో, ఒక రాజకీయపార్టీ కోసమో మనం తెలంగాణ సాధించుకోలేదన్నారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరం 'టీజీ' అని రాసుకు న్నామని, వాహనాలు, కార్యాలయాలపై కూడా అదే రా సుకున్నామని, కానీ గత బిఆర్ఎస్ ప్రభు త్వం మాత్రం 'టిజి' అక్షరాలు కాదని, 'టిఎస్' అని పెట్టి ప్రజల మనో భావాలను దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టిఎస్'ను 'టిజి'గా మార్చాం. ఉద్యమ రోజుల్లో ఎక్కడ విన్నా.. 'జయ జయ హేతెలంగాణ' వినిపించేది.కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆగీతానికి గౌరవం దక్కలేదు. అందుకే కాంగ్రెస్ ప్రభు త్వం 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రక టించాం' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నాం. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచా రని, తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూ గించారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉంది' అని సిఎం అన్నారు. తెలంగాణాను రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, అవినీతి నుంచి అభివృద్ధి, వైపు పునర్నిర్మాణం వైపు తీసుకెళుతున్నామన్నారు.

## పదేళ్లుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్టించలేదు : భట్టివిక్రమార్క

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చుతున్నారని విమర్శలు చేస్తున్నవారు గత పదేళ్లుగా అధికారంలో ఉండి అధికారి కంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్టించలే దని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. దశాబ్దాల పాటు కొనసాగిన తెలంగాణ పోరాటాన్ని అర్థం చేసుకున్న ఆనాటి యూపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధం గా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సంబంధించిన ప్రక టన చేసిన డిసెంబర్ 9వ తేదీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఆయన అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ, ఆ ఆకాంక్షలు మాత్రం గత పదేళ్లు నెరవేరలేదని చెప్పారు. ''ప్రజలు తొమ్మిదిన్నరేళ్లు నిర్బంధా ల మధ్య గడిపారు. రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టి అతలాకుతలం చేశారు. భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. పదేళ్లలో ఆత్మగౌర వంతో బతకాల్సిన ప్రజలను బందీ చేసి అనుక్షణం అవ మానాలకు గురిచేసిరాజ్య హింసతో పాలనసాగించారు'' అని భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాచరిక పోకడలతో నియంతృత్వ నిరంకుశ పరిపాలన సాగిస్తు న్న బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ బహి రంగసభలు, పీపుల్స్ పాదయాత్ర నిర్వహించామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాది కాలంలో తెలం గాణ ప్రజలు కోరుకుంటున్నట్టుగా స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ, స్వతంత్రంగా బతకాలనే పరిస్థితులను ప్రజాస్వా మ్యయుతంగా ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com